సనాతనం

Sanathanam

A Radical Insight

రాణి శివశంకరశర్మ

జో ప్రచురణలు
సత్తెనపల్లి

సనాతనం

Sanathanam - A Radical Insight

రాణి శివశంకరశర్మ

తొలిముద్రణ: మే, 2022

ప్రచురణకర్త: జో ప్రచురణలు,
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 7396666942

కాపీరైట్: సర్వహక్కులు రచయితవి.
ముఖచిత్ర కల్పన: రాజు

ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.

పంపిణీదారు:
అనల్ప బుక్ కంపెనీ,
సికింద్రాబాద్-500094, తెలంగాణ రాష్ట్రం.
ఫోన్: +91 7093800303
ఇ-మెయిల్: info@analpabooks.com
ఆన్‌లైన్‌లో కొనడానికి సందర్శించండి: www.analpabooks.com, www.amazon.in

హెచ్చరిక:
రచయిత నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి లేకుండా
ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా, ఏ రూపంలోనైనా, ఏ మాధ్యమంలోనైనా,
ఏ విధంగానైనా, ఎందుకోసమైనా సరే వాడటం-
రచయిత హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది.
ఈ పుస్తకాన్ని అచ్చయిన ఈ రూపంలో తప్పించి మరేవిధంగానైనా
పంపిణీ చేయడం, భద్రపరచడం, ఇతరులతో పంచుకోవడం,
ఏ మాధ్యమాల్లోనైనా ఉంచడం రచయిత హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది.

వెల: రూ. 125/- (భారతదేశంలో)
5 అమెరికా డాలర్లు (విదేశాల్లో)

ధన్యవాదాలు

ప్రతాప శ్రీనివాసమూర్తిగారు చిరకాల మిత్రులు. పౌరహక్కుల మేధావి, ప్రముఖ న్యాయవాది కన్నబీరన్‌కి అసిస్టెంటుగా పని చేసిన మిత్రులు న్యాయవాది కుమారస్వామిగారి ద్వారా నాకు పరిచయం అయ్యారు. ఇటువంటి మంచి మిత్రులని నాకు దగ్గర జేసినది నేను రాసిన 'లాస్ట్ బ్రాహ్మిన్' గ్రంథమే. కానీ అనతికాలంలోనే ఆప్తులుగా మారారు ప్రతాప శ్రీనివాసమూర్తిగారు.

సహృదయులు, సాహిత్యాభిమాని, పుస్తకప్రియులు, ఆత్మీయులు ప్రతాప శ్రీనివాసమూర్తిగారి ఆర్థిక, హార్దిక సహకారంతో యీ పుస్తకం వెలువడడం మా స్నేహానికి తీపిగుర్తు.

– రాణి శివశంకరశర్మ

శ్రీనివాసమూర్తిగారు
'సనాతనం–ఎ రాడికల్ ఇన్‌సైట్' ప్రచురణకు
పంపిన ఆత్మీయ సందేశం:

"I wish you all the best for your recent work " SANATHANAM " View of a writer on existing school of thought of world philosophy. I FEEL PREVILEGED FOR BEING A PART OF YOUR WORK."

రాణి శివశంకరశర్మ
ఇతర రచనలు

ది లాస్ట్ బ్రాహ్మిణ్

గ్రహాంతరవాసి

పురాణవేదం

అమెరికనిజం

సనాతనం, ఆధునికత – ప్రసంగవ్యాసం

హిందూత్వ రాజకీయాలు, సామాజిక మూలాలు – ప్రసంగవ్యాసం

శకుంతల (కాళిదాసు నాటకానికి నవలారూపం)

రోబోబుద్ధ (కథాసంకలనం)

నామిని 'మూలింటామె'కు భాష్యం

విషయ సూచిక

ముందుమాట... vi

తల్లి గర్భంలోకి... 1

సూర్యవృక్షం... 6

తలకిందులు చెట్టు తలకిందులు చరిత్ర...7

సూర్యుడే కవి... 9

వెల్తురికి స్త్రీలింగం... 10

చీకటి – వెలుగులు... 14

సూర్యుడూ – దేశం... 18

సూర్యుడూ – కాలం... 20

కదలని కాలం కదుల్తున్న దృష్టి... 24

వర్ణ వ్యవస్థ – కులం... 30

భారతీయ ఫాసిస్టుల ఆవిర్భావం... 34

కులం నుంచి మతంలోకి పెనం నుంచి పొయ్యిలోకి... 38

భారతీయుల నేచురల్ రెలిజియన్... 42

భారతీయుల మహామతం పుట్టుక... 48

వ్యక్తి... 55

భారతీయుల దృష్టిలో మృత్యువే జీవితం... 61

అస్తి నాస్తి విచికిత్స... 65

భారతీయ తాత్వికత ఫాసిజాన్ని బలపరుస్తుందా?... 72

వితండవాది అంటే నిందా?... 81

ఉపసంహారం... 86

ముందుమాట

శ్రీ రాణి శివశంకరశర్మ కోరిక మేరకు యీ ముందుమాట వ్రాస్తున్నాను.

శివశంకరశర్మ యొక్క Sanatanam - A Radical Insight వొక ఉద్గ్రంథం.

శర్మ సహనసహిత సనాతనిస్టు.

తనలో, మనలో ఎదుగు సనాతనిస్టు.

ఎదుగుదలయా, మార్పా.

శర్మ యీ రచనలో ప్రాచ్య, పశ్చిమ తత్వవేత్తలను, వారి రచనలను ఉదహరించి, ఉటంకించాడు.

ఇతని యితర రచనలు, The Last Brahmin, గ్రహాంతరవాసి, పురాణవేదమ్, అమెరికనిజం చదివితే కొన్నిచోట్ల ఒక ప్రశ్న కలుగుతుంది:

జరుగుతున్నది ఎదుగుదలయా, మార్పా. ఆలోచనాపూరిత, ఆలోచనను ఉత్తేజపరిచే రచన యిది. ఉటంకించిన, ఉదహరించిన రచయితలను, రచనలను శర్మ క్రోడీకరించటమే కాక, వివేకముతో జతచేసాడు.

కొన్నిచోట్ల వ్యాఖ్యానమందు సృజనాత్మకత వుంది. శర్మ సనాతనిజంను radical దృక్పథంతో చూస్తాడు; radical thoughను సనాతనిజంతో చూస్తాడు. కొన్నిచోట్ల సమన్వయం వుంది; కొన్నిచోట్ల సమన్వయ తాపత్రయంగా గోచరిస్తుంది.

ఈ గ్రంథాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటి, మూడవ భాగాలలో ప్రాక్ పశ్చిమ తాత్విక చింతనలు వొకటి యింకొక దానికి దారితీస్తుంది. రెండవ భాగంలో అది కొంత లోపిస్తుంది.

శర్మ శైలి వైయక్తికము, జటిలము.

శర్మ చివరలో యిలా వ్రాస్తాడు:

మొత్తంగా ప్రజా సమూహాలను శత్రు వర్గాలుగా విభజించడం వొక రాజకీయ అవసరంగా మారింది. హిందూ దళిత కమ్యూనిస్టులు అందరూ యిదే చేస్తున్నారు.

దీనితో ప్రశ్నించే తత్వం అనేది తిట్ల పురాణంగా మారింది.

భారతీయ సనాతన దృష్టి లేనిదే నిజమైన ప్రశ్నలు ఉదయించే అవకాశం లేదు. సనాతనం అంటే స్వభావ సిద్ధం, స్వయం చలనంలో వుండే ప్రకృతి అని అర్థం.

ఇతని నిర్వచనము, నిరుక్తము యితనివి. వాటిని కొంతమంది ఆమోదించక పోవచ్చు.

శ్రీ రాణి శివశంకరశర్మ యొక్క Sanatanam - A Radical Insight ఔచిత్యము, ప్రాముఖ్యత, విలువ కలది. తత్వమందు, తాత్వికతయందు ఆసక్తి వున్న ప్రతివాడు చదవతగిన గ్రంథము Sanatanam - A Radical Insight.

కుప్పా శ్రీనివాసశాస్త్రి
హైదరాబాదు
10. 12. 2021

తల్లి గర్భంలోకి

నేనూ, చంద్ర, సుబ్రహ్మణ్యం గారు లోపలికి ప్రవేశించాం గుహలోకి.

సంధ్యా సమయం. లోపల వెలుతురు చాలా తక్కువ. తడుముకొంటూ నడుస్తున్నాం. యువ పూజారి హెచ్చరిస్తున్నాడు, వొకొక్కసారి బాగా వంగి నడవమని. లేకపోతే నెత్తి బొప్పికడ్తుంది. మరోసారి యించుమించు చిన్నపిల్లల్లా పాకవలసి వచ్చింది.

తల్లి గర్భంలోకి ప్రవేశించినట్లుంది. కాలం తాలూకు మరో డైమన్షన్‌లోకి ప్రవేశించినట్లుంది. అదే సనాతనం. దానిపైన స్థల కాలాల పాదముద్రలు పడవు. అది అనంతం, దేశ కాల పరిమితులు లేనిది.

మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం.

మీయతే ఇతిమాయా. కొలవబడేదే మాయ. యీ ప్రపంచాన్ని మనం కొలతల్లో డైమన్షన్స్ లోంచి చూస్తాం. మనకి తెలుసున్నవి నాలుగే డైమన్షన్స్ – దృక్కోణాలు. గణితశాస్త్రం యింకా చాలా డైమన్షన్స్‌ని సైద్ధాంతికంగా సాధించింది. కాలాన్ని కూడా కొలవలేమని, అది నిరపేక్షమని అంటుంది వాక్యపదీయం. అది అనంతం. ఉషస్సూక్తంలో ఉషస్సుకి అనంతం అనే విశేషణాన్ని చేర్చింది రుగ్వేదం.

నేనూ, చంద్ర, సుబ్రహ్మణ్యం గారూ, పూజారీ అనంతంలోనే కదుల్తున్నట్లుంది.

వొక మూసి వేయబడిన అంతర్ గుహ ద్వారం వద్ద ఆగాడు పూజారి.

అదిగో కాశి అన్నాడు. సాక్షాత్తూ విశ్వేశ్వర నిలయం అన్నాడు.

ఎక్కడ అని నేను అడిగాను.

మూసివేసిన శిలని చూపించాడు. యీ గండశిలని తొలగిస్తే లోపలికి దారి యేర్పడ్తుంది. అక్కడి నుంచి జాగ్రత్తగా పయనిస్తే వారణాశికి భాగీరథీ తీరానికి దారితీస్తుంది అన్నాడు పూజారి.

యే గుహద్వారం యే క్షేత్ర స్థలానికి యే అద్భుత గమ్యానికి దారితీస్తుందో తెలుసుకోవడం అసాధ్యం అన్నాడు చంద్ర.

అన్నీ యీశ్వరుని దరికే అన్నాడు పూజారి.

వొక రహస్యాన్ని వినండి కాశీకి దారితీసే యీ రహస్య గుహ ముఖంలో వివిధ జాతుల మహాసర్పాలు వేళ్ళాడ్తూ వుంటాయి. కొన్ని లుంగ చుట్టుకొని పరుండి వుంటాయి. అవి మహాచక్రాల్లా భాసిస్తాయి. వాటి వలయాకారంలోకి నీ చూపు చొరబడినపుడు కాలం నిలిచిపోతుంది. స్థలం నిలిచిపోతుంది. నువ్వు అనంతంలో స్థిరపడతావు. అట్టి స్థితిని ఆదిశంకరులు పొందారు అన్నాడు పూజారి.

వొక మహాసర్పం మా పక్కనుంచి పాకుతోంది. ఆ శివ మాలికని అనుసరించండి అన్నాడు బ్రాహ్మణుడు.

మేం వంగుతూ, పాకుతూ, డేకుతూ ఆ సర్పం వెనుకగా వెళ్లాం. అలా వెళ్లగా వెళ్లగా..

మహా శివలింగం.

విప్రుడు అన్నాడు. యీ మహాశివలింగమూర్తి ఆద్యంతాల్ని బ్రహ్మ, విష్ణువులే కనుగొనకలేకపోయారు అన్నాడు.

యింతకీ యీ ప్రకృతి అంతా లింగాకృతే, అనంత సృజన, యీశ్వరుని సంభోగలీల, అది అనంత సృష్టి.

గుహలోంచి బయటికి వచ్చాం. సూర్యాస్తమయ సమయం. ఉభయ సంధ్యల్లోనూ రక్తారుణిమ అన్నాడు వొక కవి.

కవి అంటే రుషి అని అర్థం. మనిషి చాలా వరకు దారితప్పిపోయాడు. సూర్యునితో ఉషస్సుతో కొండకోనల్తో గుహ ముఖాల్తో సంబంధాన్ని కోల్పోయాడు.

గుహల్లో బొమ్మలు గీసిన ఆదిమ మానవుడే అసలు చిత్రకారుడు.

రుగ్వేద రుషే నిజమైన కవి.

గుహ ముఖంలోకి వేద కాలంలోకి తిరోగమించాలి. అక్కడ సూర్యుడూ, మేఘాలూ, ఉషస్సులూ, కొండకోనల్లో మనిషి మమేకమై జీవుడవుతాడు. జీవుని వేదన కళ్లకి కడ్తుంది.

మనిషి ఆధునికత సృష్టి

జీవుడు సనాతన దృష్టి.

జీవుడే సాక్షాత్కరించుకోగలడు అనంతాన్ని, అనంతంలో అనంత జీవరాశినీ, పాంచభౌతిక ప్రకృతిని, అందులో తననీ.

అందుకే వేదకాలంలో నిలిచిపోయి వైదిక రుషి హృదయాన్ని కవి హృదయాన్ని నా కళ్లతో నా హృదయంలో ఆవిష్కరిస్తాను.

వైదికంగా ఉదయిస్తాను.

ప్రకృతి నుంచి మానవ కథలోకి ప్రయాణించి మళ్లీ ఆ మానవ కథని కంచికి చేరుస్తాను. ప్రకృతి లయిస్తాను. అదే వేదం, అదే సనాతనం.

సూర్యుడు

సవిత, సూర్యుడు, ఆదిత్యుడు. పేరేదైతేనేం అదిగో ఆ అస్తగిరిపై నిలిచిన దైవం సర్వజీవజాల ప్రేరకుడు ఆయనే విశ్వసాక్షి.

మా అబ్బాయి పేరు ఆదిత్య అని గుర్తుచేశారు మిత్రులు రాజేశ్వరరావుగారు.

వేదకాలం నుంచి యీనాటి వరకు సూర్యుని స్థానం చెక్కు చెదరనిది. మనదంతా సూర్య కేంద్రక దృష్టి. నిజానికి నారాయణుడంటే సూర్యుడే. నారాయణుని సూర్యమండల మధ్యవర్తి అంటున్నారు సనాతనులు. దీనికి మూలం వేదంలోనే వుంది. అతి ప్రాచీన రుగ్వేదంలోనే వుంది. త్రివిక్రముడంటే ఆయనే. మూడు పాదాలతో విశ్వాన్నంతా ఆక్రమించింది సూర్యుడే. దృశ్యజాలాన్నంతా ఆక్రమించినది, దృశ్యాల్ని దృశ్యాలుగా చేసినది కనబరచినది సూర్యుడే కదా! విశ్వ ప్రేరకుడుగా గాయత్రీ మంత్రం వర్ణించేది సూర్యుణ్ణే. గొప్ప సరళత్వం కలిగి వుండడం వల్లనే గాయత్రీ మంత్రానికి అంత ప్రశస్తి వచ్చిందని కొందరు పాశ్చాత్య పండితులు అన్నారు. యీ సంగతిని ఫ్రిట్స్‌స్టాల్ 'డిస్కవరింగ్ ది వేదాస్' అనే గ్రంథంలో ప్రస్తావించారు. కానీ అది కాదు కారణం అగ్ని కాదు వరుణుడు కాదు అసలు వైదిక దేవత సూర్యుడే. నిజానికి పృథివి మీద ప్రజ్వరిల్లుతున్న అగ్ని కూడా సూర్యుడేనని, సూర్యుని అంశేనని వేదం చెబుతోంది. సూర్యుని నుంచి విడిపోయిన శకలమే భూమి అని సైంటిస్టులు అంటున్నారు. అంటే మనం సూర్యుని మీదే వున్నాం. అందుకే మనకింత సూర్యభక్తి.

విశ్వాన్నంతా అంటే మన దృష్టికి అందే దాన్నంతా ఆక్రమించి త్రివిక్రముడిగా పేరు పొందినదెవరంటే, వామన అవతారంలోని విష్ణువు అని సమాధానం వస్తుంది. విష్ణువు అంటే వ్యాపకుడు అని అర్థం.

రుగ్వేదంలో విష్ణువు అనే పదం సూర్యునికి విశేషణం. సారాంశంలో విష్ణువంటే సూర్యుడే.

'ఇదం విష్ణుర్ విచక్రమే త్రేధా

నినధే పదం సమూఢమస్య పాంసురే'

కిరణాలతో సర్వత్రా వ్యాపించియుండడం వల్లే సూర్యుడు విష్ణువు అని పిలువబడ్తున్నాడు. మూడుచోట్ల పాదమును వుంచి తన త్రివిక్రమ స్వరూపాన్ని చూపుతున్నాడు. పృథివి మీద అగ్ని రూపంలోను, ఆకాశంలో విద్యుత్తు రూపంలోను, ద్యులోకంలో సూర్య రూపంలోను భాసిస్తున్నది సూర్యుడే. (యాస్కుని నిరుక్తం)

పురాణాలలో విష్ణు రూపానికీ, వామనావతారంలో ఆయన త్రివిక్రమ స్వరూపానికీ మూలం సూర్యుడే. యీ సనాతన దైవమే విష్ణు రూపాన్ని ధరించాడు అంతే.

వైదిక ఆర్యులచే గొప్పగా కీర్తించబడి పూజించబడిన అగ్ని కూడా ఆదిత్య శబ్దవాచ్యుడేనని నిరుక్తం చెబుతోంది.

'సుద్రవిణః అదితే' అనే మంత్రాన్ని ప్రమాణంగా చూపుతోంది. అంటే మన కళ్లముందుండి, మనకి వెలుతుర్నీ, ఆహారాన్నీ అందిస్తూ ప్రాణం నిలుపుతున్న సమీపస్థ సూర్యుడే అగ్ని. పురాణ భాషలో చెప్పాలంటే ఆదిత్యుని అవతారమే అగ్ని. గగనానికీ యిలకూ గల దూరాన్ని అంతర్ దృష్టితో అనుభూతితో చెరిపేశారు వైదిక రుషులు.

సప్తాశ్వరథ మారూఢం అని కీర్తించబడ్తున్న సూర్యుని రథానికి నిజానికి వొకే అశ్వం వుందని అదే సప్తాశ్వాలుగా భ్రమింపజేస్తోందని వర్ణిస్తూ వేదం ఏకత్వం వైపు అడుగులు వేస్తోంది అద్వైత దృక్పథం వైపు అడుగులు వేస్తోంది.

సప్తయుంజంతి రథమేక చక్రం

ఏకో అశ్వో వహతి సప్తనామా.

త్రినాభిం చక్రమజరమనర్వం

యత్రేమా విశ్వా భువనాధి తస్థుః

సూర్యుని రథానికి వొకే చక్రం. నిజానికి మూడు చక్రాలు వున్నాయి కాని ఏకరూపమైనవి కనుక వొకే చక్రం అని పిలవబడ్తోంది. అలాగే ఏడు అశ్వాలు లాగుతున్నాయి రథాన్ని. వాస్తవానికి వొకే అశ్వం ఏడు పేర్లతో పిలవబడ్తోంది.

(సాయణ భాష్యం)

సప్తాశ్వ రథమారూఢం గుర్తుకు వస్తోంది కదా. ఆరు రుతువులకి అధిక మాసాలని కలిపి సప్తరుతువులు ఏర్పడ్తాయి అని సాయణ భాష్యం. నిజానికి సూర్యుని వల్ల ఏర్పడుతున్న కాలమంతా వొకటే. ఏకరూపమైన కాలంపై రుతువులు ఆరోపించబడ్తున్నాయని వాక్య పదీయం చెప్తోంది.

అనాదిగా మనుషులు ఏకత్వంవైపు యూనిఫైడ్ థియరీవైపు కదుల్తూ వచ్చారు. ఏకత్వంలోని అద్వైతంలోని సౌలభ్యంవైపు అడుగులు వేశారు. అద్వైత భావనకి మూలం సూర్యుడే. యీ ప్రపంచానికంతటికీ వొకే కారణం కోసం గ్రీకు తత్వవేత్తలు కూడా ప్రయత్నం చేశారు.

వేద రుషులు అనుభూతిలో బహుళత్వాన్ని నిలుపుకుంటూ, బహుళత్వంలోని రంగునీ రుచినీ ఆస్వాదిస్తూనే బుద్ధితో యింకా చెప్పాలంటే మనోబుద్ధులకి అతీతమైన స్థితిలో ధ్యానంలో ఏకత్వాన్నీ అద్వైతాన్నీ సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నించారు.

అందువల్లనే ప్రతీ దృశ్యమూ ప్రతీ శబ్దమూ మూడుగా సాక్షాత్కరించబడ్తుందని యాస్కుడు నిరుక్తంలో చెప్పాడు. 1) అధి భౌతికం 2) అధి దైవికం 3) ఆధ్యాత్మికం. అంటే భౌతికంగాను, దైవపరంగానూ, పరమాత్మ రూపంగానూ అంటే అద్వైతంగానూ

ప్రతిదీ వ్యాఖ్యానించబడ్తుంది. మనం చూసే చూపునిబట్టి ప్రతీదీ కనబడ్తుంది. దృష్టే సృష్టి. దృష్టికి మూలం సూర్యుడు. నిజానికి దృష్టి అంటే సూర్యుడే. అందుకే ఆయనని విశ్వ చక్షువు అని పిలుస్తున్నారు.

ఏకో అశ్వోవహతి సప్తనామా అనే మంత్రవాక్యాన్ని మరోసారి మననం చేద్దాం. వొకే అశ్వం, అనేక నామాలు. వొకే చక్రం. అనేక నామాలు. వొకే కాలం అనేక నామాలు. ఏకం సద్విప్రా బహుధా వదంతి వొకే సత్ ఉనికి అనేక రూపాలుగా వ్యాఖ్యానించబడ్తోంది అనే ఉపనిషత్ వాక్యంవైపు అడుగులు వేస్తోంది సూర్యతత్వం.

గాయత్రీ మంత్రార్థాన్నే పరిశీలించండి. సర్వప్రాణుల్ని మేల్కొల్పే సవిత – సూర్యుడు ప్రార్థించబడ్డాడు. ఆ మంత్రార్థం వొకేవొక పరమ సత్యమైన పరమాత్మగా వ్యాఖ్యానించబడింది. అదీ పరమార్థం.

◆ ◆ ◆

సూర్యవృక్షం

నేనూ, చంద్ర, సుబ్రహ్మణ్యం గారు, జితేంద్ర దైద అడవిలో నడుస్తున్నాం. సాయంసంధ్యా కాలపు మసక వెల్తుర్లో వివిధ అరణ్య వృక్షాలు బహుళంగా భాసిస్తున్నాయి. వొకొక్క చెట్టు వొకొక్క రూపం. వాటి శాఖలు బహువిధాలు, బహు రూపాలు. వొకదానితో మరొకదానికి పోలిక లేదు. ఆ వృక్షాల్ని ప్రకాశింపజేసే సూర్యుడు కూడా వొక వృక్షమే.

నిజానికి అన్ని వృక్షాలకీ ప్రాణం నిలుపుతున్న అసలైన వృక్షం ఆదిత్యుడే.

యస్మిన్ వృక్షే మధ్వదః సుపర్ణా
నివిశంతే సువతే చాధివిశ్వే
తస్యేదాహుః పిప్పలం స్వాద్వగ్రే
తన్నోన్న శద్యః పితరం నవేద. **ఋగ్వేదం 2-22**

వృక్షం నీళ్లను తాగి బతుకుతున్నట్లుగానే సూర్య కిరణాలు నీటిని పీల్చుకుంటున్నాయి. (మధ్వదః = మధువు అంటే నీరు.) యీ ఆదిత్య వృక్షాన్ని ఆరాధించిన సత్పురుషులకి గొప్ప 'ఫలం' లభిస్తుంది. పరమాత్మపరంగా కూడా యీ మంత్రానికి అర్థం వుంది. జ్ఞానరూపమైన ఫలాన్ని పొంది అమృతత్వాన్ని పొందుతారు జ్ఞానులు. (సాయణ భాష్యం)

ద్వా సుపర్ణా సయుజా సఖాయా అనేది కూడా రుగ్వేద మంత్రమే. రెండు పక్షులు వృక్షం మీద కూర్చుని ఉన్నాయి. వొకటి పళ్లని తింటోంది. మరొకటి నిమిత్తమాత్రంగా చూస్తూ కూర్చుంది. స్థిత ప్రజ్ఞుడన్న మాట. కర్మఫలం పట్ల ఆసక్తి లేనివాడని అర్థం.

మరో చెట్టు కవిత భగవద్గీతలో వుంది. అది తలకిందులు చెట్టు. పైన వేళ్లు వుంటాయి. కిందికి కొమ్మలు వుంటాయి. దాని నుంచి రాలిపోవడమంటే ఉన్నత స్థితికి – మోక్షానికి చేరుకోవడమేనని కంచి పరమాచార్యుల వారు వ్యాఖ్యానించారు. అది శీర్షాసనం వేసిన వృక్షం కదా మరి.

ఊర్ధ్వమూలమధశ్శాఖం, అశ్వత్థం ప్రాహురవ్యయం. అది అశ్వత్థ వృక్షము. అదే సంసారం. ఛందాంసి యస్య పర్ణాని దాని ఆకులు వేదాలేనట. ఆ వేదం నుంచే కొన్ని ఆకుల్ని యేరుకున్నానంతే.

◆ ◆ ◆

తలకిందులు చెట్టు
తలకిందులు చరిత్ర

చెట్లూ, పుట్టలూ, గుట్టలూ మనకెందుకు మానవ చరిత్ర గురించి ఆలోచించు అంటున్నాడు నాలో దాగిన ఆధునికుడు. చరిత్ర అనేది చాలా ఆధునికమైన పదం. సంస్కృతంలో చరితం అనే పదం వుంది. కానీ అది చరిత్రకి సమానార్థకం కాదు. రామచరితం అంటే చరిత్ర అని అర్థం కాదు. చరిత్రలో స్పష్టమైన భౌతిక ఆధారాలు కావాలి. నాణాలూ, శాసనాలూ వగైరా.

ఈ ఆధారాలు వాస్తవాన్ని పట్టిస్తాయా? అవి మళ్లీ కథలుగా కట్టుకథలుగా పుట్టు కథలుగా మారిపోతాయి. ఎందుకంటే ఆ ఆధారాలకి వ్యాఖ్యానాన్ని జతచేసి దానికి చరిత్ర అని పేరుపెట్టేది మనిషే, అతని రాగద్వేషాలే.

జ్యోతిబా ఫూలే అనే సంస్కర్త దశావతారాల కథని ఆధారం చేసుకుని చరిత్రని అల్లుతాడు. ఆర్యులు భారతదేశంలోకి చొరబడి యిక్కడ స్థానికులైన దస్యుల్ని అణిచి వేశారని అదే దశ అవతారాల కథ అని అంటాడు. నిజానికి విష్ణు అవతార కథలు వేదాల్లోనివి కావు. పురాణాలలోనివి. దశావతారాలనే భావనని స్థిరపరిచింది జయదేవుడు. మధ్య యుగాలకి చెందిన జయదేవుడు గీత గోవిందంలో దశావతారాల భావనని వొక గీతం ద్వారా ప్రసిద్ధిలోకి తెచ్చాడు. ఈ దశావతారాల్ని వైదిక ఆర్యుల దాడిగా అభివర్ణిస్తాడు ఫూలే. ఆర్యులంటే బ్రాహ్మణులేనంటాడు. ఎప్పటి వేదాలు, ఎప్పటి పురాణాలు. వేదాలు దర్శించబడిన కొన్ని వేల సంవత్సరాలకి పురాణాలు వచ్చాయి. ఎప్పటి ఆర్యుల రాక, యెప్పటి పురాణ రచన.

యీ పుక్కిటి చరిత్ర రచనలో భాగంగా వామనుడు ఆర్యుడని, దస్యుడైన బలి చక్రవర్తిని అణిచివేశాడని ఢంకా బజాయిస్తాడు ఫూలే.

ప్రపంచం వాస్తవం మీద నడవదు అదొక కల్పన. అదొక తలకిందులు చెట్టు. కల్పనలెన్నయినా చేసుకో నీ పురాణాలు నువ్వు రాసుకో. అది నిరపేక్ష సత్యంపై ఆధారపడి వుందంటేనే తంటా.

వ్యాసుడు కూడా సత్యాన్ని రాస్తున్నాననలేదు. రూపంలేని స్థల కాలాల్లేని యీశ్వరుడ్ని కల్పనల పంజరంలో బంధించి స్థల కాల బద్ధుడిని చేశానని బాధపడ్డాడు. రూపం రూప విసర్జితస్య భవతో ధ్యానేన యత్ కల్పితం యిత్యాది శ్లోకంలో పరమార్థాన్ని తెలపడం కోసం ఫక్తు కల్పన మీద ఆధారపడ్డానని ప్రకటించాడు. (పురాణ పర్యాలోచనం – చౌఖంబా ప్రచురణ)

నువ్వు కూడా అల్లాగే నీదికల్పన అను. బ్రిటిషు వారి కొలువు కూటంలో బ్రాహ్మణులు ఎక్కువగా ఉన్నారు. కనుక వారిని దించి, తమ వాళ్లకి, తమ జాతి వాళ్లకి ఉద్యోగాలు రావడం కోసం బ్రాహ్మణులకి వ్యతిరేకంగా కథలు అల్లవలసి వచ్చిందని, దానిలో భాగంగానే యీ దశావతారాల కథ అని జ్యోతిబాఫూలే అంటే ఎవరికీ అభ్యంతరం వుండనక్కరలేదు. తమిళనాడుకి చెందిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమకారులు ద్రవిడ – ఆర్య భేదాలను ముందుకు తీసుకువచ్చారు. స్వచ్ఛమైన ఆర్యులు, స్వచ్ఛమైన ద్రవిడులూ అనే జాతి భేదాలు కల్పితాలు. అంతా సంకరమే. అందువల్లనే యివన్నీ కట్టుకథలు. చరిత్రకాదు, చట్టుబండలూ కాదని ఆధునిక చరిత్రకారులే చెప్తున్నారు. ఉద్యమాలకి వాస్తవాలతో పనిలేదని, యీ ఉద్యమకారులు నిరూపించారు. యీ ప్రపంచమే పెద్ద అబద్ధం, కల్పన. దానిలో కొన్ని కొత్త కల్పనల్నీ అబద్ధాల్నీ చేర్చారు రకరకాల ఉద్యమకారులు.

యింతకీ విష్ణువూ మూడు అడుగులతో విశ్వాన్నంతా వ్యాపించిన త్రివిక్రముడూ సూర్య భగవానుడే. అతనికి పౌరాణిక రూపమే వామన అవతార కథ.

మనుషుల్లో కవులని పిలవబడే వాళ్లు కట్టుకథల్ని అల్లుతారు. నిజమైన కవి సూర్యుడే. రుగ్వేదం సూర్యుడ్ని కవి అని పిలుస్తోంది. అది సార్థకం. ఎందుకంటే సూర్యుడు మనకి దృశ్యాల్ని చూపుతున్నాడు. వొకరి ముఖాల్ని మరొకరు చూసుకునేలా చేస్తున్నాడు. మనం ఆ దృశ్యాలకి మన వ్యాఖ్యానాల్ని జతచేస్తున్నామే కానీ మనం నిజంగా దేన్నీ చూడడం లేదు. మన రాగద్వేషాలే మనం సృష్టించే చరిత్ర. అసలు వాస్తవాన్ని మనం ఎప్పటికీ చూడలేం.

◆ ◆ ◆

సూర్యుడే కవి

నిజానికి కవి ఎవరు? వాస్తవాల్ని వాస్తవాలుగా చూసేవాడు. కవిః క్రాంత దర్శనః భవతి కవికి అన్ని పదార్థాల యొక్క స్వరూపమూ తెలుస్తుంది. అతనికి తెలియని పదార్థమంటూ వుండదు. అంటే పదార్థాల్ని ఉన్నవి ఉన్నట్లుగా చూస్తాడు. విశ్వా రూపాణి ప్రతిముంచతే కవిః అనే రుగ్వేద మంత్రములో సూర్యుడే కవిగా వర్ణించబడ్డాడు. అవును నిజమే సూర్యుడే కవి, సత్యాన్ని సత్యంగా చూసే వాడు, చూపే వాడు. మనం దానికి వ్యాఖ్యానాల్ని జత చేస్తామంతే. అందుకే మనం మన మానవ దృష్టి పరిధి నుంచి బయటపడి సత్యం కోసం వేచివుండాలి. అప్పుడు సత్య సాక్షాత్కారం అదంతటదే జరుగుతుంది, సూర్యోదయంలా.

◆ ◆ ◆

వెల్తురికి స్త్రీలింగం

వెలుగంటే పురుషుడేనా? సప్తాశ్వాలని అధిరోహించి ఆకాశాన్ని యేలేది పురుషుడేనా? సూర్యుడేనా ఆదిత్యుడేనా? 'డు' అనే ప్రత్యయమే వస్తువుల్ని సాక్షాత్కరింప చేయగలదా! చూపు పుంలింగమా? సకల వస్తువుల్నీ పుంస్త్వం కమ్మేసిందా? వైదిక దృష్టి పుంలింగ ఆధిపత్యంతో మబ్బులు కమ్ముకు పోయిందా?

లేదు లేదు. సూర్యునికి స్త్రీలింగ రూపం సూర్య. ఆమె సూర్యుని భార్యగా వొకచోట, సూర్యుని కూతురుగా మరొకచోట వర్ణించబడింది. మొత్తానికి ఆమె స్త్రీ. ఉషస్సు కూడా స్త్రీయే. అంటే అర్ధనారీశ్వర తత్వానికి మూలం సూర్యతత్వమే. కాంతి అనేది స్త్రీలింగం, పుంలింగం కూడా. జ్ఞానం అనేది స్త్రీలింగం పుంలింగం కూడా.

సూర్యుని కూతురు సూర్య అత్తగారింటికి వెళ్లేటప్పుడు ఆమె మనసే రథం, ఆకాశమే పరదా, సూర్యుడు, చంద్రుడు ఇద్దరూ ఆ బండికి ఎడ్లు.

ద్వేతే చక్రే బ్రాహ్మణ రుతుథా విదుః (8-23)

సూర్యకి చంద్రసూర్యులే చక్రాలు. సంవత్సర రూపమైన చక్రం కూడా వుంది. అది గుహయందు వుంచబడింది అంటే రహస్యంగా ఉంచబడింది. అది మేధావులకే సాక్షాత్కరిస్తుంది. అంటే సూర్యచంద్రుల గమనం వల్లే సంవత్సరం ఏర్పడుతోంది. కాలాన్ని కొలవడానికి మేధాశక్తి కావాలి.

ఈ వర్ణనలో కాల గమనానికి స్త్రీ శక్తే మూలమన్న విషయం స్పష్టమవుతోంది. సూర్యచంద్రులు వొకచోట బండికి ఎడ్లుగాను, మరోచోట చక్రాలుగాను వర్ణించబడ్డారు అధిరోహించేది చలనానికి కారణమయ్యేది స్త్రీయే. యింతకీ రథం ఏది? ఆమె యొక్క మనస్సే. అంటే సంకల్పశక్తి ఆమె మాత్రమే. అతడు కాదు.

అతి ప్రాచీనమైన సాంఖ్యతత్వంలో సృష్టికీ పరిణామానికీ మూలం ప్రకృతి. ప్రకృతి అంటే స్త్రీయే. పురుషుడు నిమిత్త మాత్రుడు మాత్రమే. శక్తి, చైతన్యం స్త్రీయే. అంటే మనకి కనబడుతున్న సూర్యుడూ చంద్రుడూ దృశ్యాలు మాత్రమే. ఆ దృశ్యాన్ని ఏర్పరుస్తున్న అదృశ్య శక్తి స్త్రీత్వమే. ప్రకృతి అంటే స్త్రీయే.

సూర్యాయై దేవేభ్యోమిత్రాయ వరుణాయ (8-24) అంటూ ఇతర దేవతలతో పాటు సూర్యకి నమస్కారం చేసిన వైదిక రుషి సూర్యచంద్రులని శిశువులుగా వర్ణిస్తాడు.

పూర్వాపరం చరతొ మాయయైతొ

శిశూ క్రీడంతే పరియాతో అధ్వరమ్ (8-25)

ఆకాశంలో సూర్యుడూ చంద్రుడూ మాయమౌతూ వొకరి తర్వాత మరొకరు ఉదయిస్తూ శిశువుల్లా క్రీడిస్తున్నారు. దోబూచులాట అన్నమాట. చంద్రుడైతే రుతువులను, మాసములను, పక్షములను ఏర్పరుస్తూ నశిస్తూ పునర్జన్మిస్తూ వున్నాడు. పునర్జన్మ భావన ఏర్పడడానికి చంద్రుడే కారణం కావచ్చుననిపిస్తుంది. యిక్కడ సూర్యచంద్రులు శిశువులుగా వర్ణించబడ్డారు.

రథాన్ని అధిరోహించి ప్రయాణం చేసే ప్రౌఢగా సూర్య వర్ణించబడింది. రథచక్రాలైన సూర్యచంద్రులు మాత్రం శిశువులు మాత్రమే. అనసూయాదేవి త్రిమూర్తుల్ని శిశువుల్ని చేసి లాలించినట్లు పురాణ కథ. శివుడ్ని వొక శివ భక్తురాలు శిశువుని చేసి లాలించినట్లు బసవ పురాణంలో కథ వుంది. జన్మకీ పునర్జన్మకీ మూలం స్త్రీయే. అందువల్ల సూర్యచంద్రుల గమనానికీ రుతు చక్రానికీ సకల ప్రకృతి గమనానికీ మూలం స్త్రీయే. నిజానికి ప్రకృతి స్త్రీ లింగమే. వేదాలు పురుష దేవతలని మాత్రమే కీర్తించాయనడం అజ్ఞానం. ఆ పురుష దేవతల వెనక స్త్రీ వుంది ప్రకృతి వుంది. జననం, మరణం, జననం అపారమైన జీవనలీల అంతా ప్రకృతే.

వెలుగుకి మరో స్త్రీలింగ నామం ఉషస్సు. ఉషోదేవత వర్ణన అద్భుతంగా చేయబడింది రుగ్వేదంలో. సకల ప్రాణుల చలనానికి మూలం ఉషోదేవతే.

వయశ్చిత్తే పతత్రిణో

ద్విపచ్చతుష్పదర్జుని (1-3)

ఓ ఉషోదేవతా నీ ఆగమనంతో అన్నిరకాల ప్రాణులూ చైతన్యవంతం అవుతున్నాయి. తమస్సు నుంచి విముక్తమౌతున్నాయి. ఆ ప్రాణులెవరు. 1) రెండు పాదాల జీవులు - మనుషులు 2) నాలుగు పాదాల జీవులు - జంతువులు. 3) రెక్కలు గల జీవులు, పక్షులూ ఇవన్నీ చైతన్యవంతమౌతున్నాయి. మనిషి మిగిలిన అన్ని రకాల జీవులలో పశు పక్ష్యాదులలో వొకడు మాత్రమే. మిగిలిన జీవజాలంతో పాటు ఉషోదేవత ఒడిలో మేల్కొంటున్నాడు. యీ ద్విపాద పశువు కూడా. వైదిక కవి మనిషిని ద్విపత్ - రెండు కాళ్ల జీవి అని మాత్రమే వర్ణించాడు. అంతకంటే అతనికి గొప్ప ప్రత్యేకత యేమీ లేదు. ఈశ్వరుణ్ణి పశుపతి అంటారు. పశువులు అంటే మనిషితో సహా అన్ని జీవులూ పశువులే. విశ్వస్య ప్రాణనం జీవనం త్వే - ఉషోదేవతా ప్రపంచానికంతటికీ ప్రాణమూ జీవమూ నీవే.

ప్రపంచానికంతటికీ జీవమూ ప్రాణమైన ఉషోదేవత వర్ణన రుగ్వేదమంతా పరుచుకుని వుంది. జీవ చలనమంతా వెల్తురుతోనే ముడిపడి వుంది మరి.

అధి పేశాంసి వపతే నృతూ రివాపోర్ణుతే

వక్ష ఉస్రేవ బర్జహమ్ (1-24)

ఉషస్సు ప్రపంచమంతా వ్యాపించిన చీకటిని నాశనం చేస్తోంది అనే వాస్తవాన్ని రెండు ఉపమానాలతో రుషి వర్ణిస్తున్నాడు. 1) మంగలి కేశములను సమూలంగా కత్తిరించి ముండనం చేసినట్లు, ఉష ప్రపంచమందలి చీకటిని తొలగించి వేస్తోంది. 2) అంధకారమనే ఆచ్ఛాదనాన్ని పమిటని తొలగించి తన అందమైన వక్షస్థలాన్ని ప్రదర్శించే నర్తకిలా వుంది ఉషస్సు. 3) గోవు స్వయంగా తన గోష్ఠాన్ని (పశువుల కొట్టాన్ని) చేరినట్లు స్వయంగానే తూర్పు దిక్కుకు చేరిన ఉషస్సు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తోంది.

ఉషస్సుని వర్ణించడానికి ఉపయోగించిన యీ ఉపమానాలు దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రకృతిని నర్తకిగా వర్ణిస్తుంది సాంఖ్యతత్వం. ప్రకృతి తన నర్తన ద్వారా అందచందాల్ని ప్రదర్శిస్తూ పురుషుడ్ని బంధితుడ్ని చేస్తోంది. అదే యీ సృష్టికి మూలం. అదే ప్రకృతిలీల అంటుంది సాంఖ్య. యిక్కడ ఆ సాంఖ్యతత్వం గుర్తుకు వస్తోంది స్వయం ప్రకాశం స్వయం చలనం స్వయం ప్రకాశకం అనే భావాలకి భారతీయ తత్వంలో చాలా ప్రాధాన్యం వుంది. సూర్యుడు స్వయం ప్రకాశకుడు, ఉషస్సు స్వయం ప్రకాశకం. చంద్రుని ప్రకాశింప చేసేది సూర్యుడే చంద్రుడు స్వయం ప్రకాశకుడు కాదు యీ మంత్రంలో ఉషస్సు యొక్క స్వాధీనత స్పష్టమౌతోంది.

ఉష ఆభాహి భానునా చంద్రేణ

దుహితర్దివః (1-48)

ఉషోదేవతా అందరికీ ఆహ్లాదాన్ని యిచ్చే చంద్ర కాంతిగా వెన్నెలగా వెలిగిపో. మరి ఉషస్సే (సూర్యుడే) కదా చంద్రుని ప్రకాశానికి మూలం. చంద్రమా మనసో జాతః చక్షోస్సూర్యో అజాయత- అని వేదం. సూర్యుడు చక్షువు - చూపు, దృష్టి. చంద్రుడు మనస్సు. చంద్రునికి కూడా వెలుగునిచ్చేది సూర్యతేజస్సే, ఉషస్సే, సూర్యయే. యింకా చెప్పాలంటే ఉషస్సే చంద్రకాంతిగా ప్రకాశిస్తోంది. స్వయం ప్రకాశకమైన అంతశ్చైతన్యమే మనోబుద్ధుల్ని ప్రకాశింపజేస్తోందన్నవేదాంత తత్వం సూర్యతత్వమే. అసలు వెలుగు లోవెలుగే.

అసలు సూర్యకాంతి కానీ చంద్రకాంతి కానీ అవసరం లేని స్వయం ప్రకాశస్థితిని గురించి ఉపనిషత్తు మాట్లాడ్తోంది. పరమాత్మకి ఆధారం ఏమిటి అని మహారాజు జనకుడు యాజ్ఞవల్క్యుని ప్రశ్నిస్తాడు. సూర్యుడే కాంతికి మూలం. సూర్యకాంతిని ఆధారం చేసుకుని మనిషి కూర్చుంటున్నాడు. వెళ్తున్నాడు. వస్తున్నాడు అని సమాధానం చెప్తాడు యాజ్ఞవల్క్యుడు. మరి సూర్యుడు అస్తమించినపుడు పరిస్థితి ఏమిటి అని జనకుడు ప్రశ్నిస్తాడు. చంద్రకాంతిలో మనిషి పనులు చక్కబెట్టుకుంటాడు. వెళ్తాడు, వస్తాడు అని సమాధానం చెప్తాడు యాజ్ఞవల్క్యుడు. సూర్యచంద్రులు యిద్దరూ కనుమరుగైనపుడు పరిస్థితి

ఏమిటి అని ప్రశ్నిస్తాడు జనకుడు. అగ్నియే ఆధారం అని యాజ్ఞవల్క్యుని సమాధానం. అగ్ని కూడా లేనపుడు?? ఆత్మయే వెలుగు అని సమాధానం బయటి వెలుగు నుంచి లోవెలుగులోకి ప్రయాణం చేశాడు ఉపనిషత్ రుషి. స్వయం ప్రకాశకుడు త్రివిక్రముడైన సూర్యుడి నుంచి స్వయం ప్రకాశకత్వాన్ని స్వీకరించి అసలు నేనే స్వయం ప్రకాశకుణ్ణి అనే ఎరుకలోకి ప్రయాణించాడు. యిక్కడ సప్తాశ్వాలూ, చక్రాలూ, సూర్యుడు, కాంతీ అన్నీ వొకే వెలుగులో ఆత్మజ్యోతిలో కరిగిపోయాయి.

యింతకు ముందు ప్రస్తావించిన రుగ్వేద మంత్రములో మంగలి జుట్టుని కత్తిరించినట్లు ఉషస్సు చీకట్లను తొలగిస్తోందనే వర్ణన వుంది. యిదే ఉపమానం ఉపనిషత్తుల్లోనూ వుంది. యథాక్షురః క్షురధావే అవహితః స్యాత్

పరమాత్మ ప్రాణుల దేహములలో క్షురకుని కత్తి మొన పదునువలే కాష్ఠమునందు అగ్నివలె శిరస్సు నుండి నఖాగ్రము వరకు తన చైతన్య ప్రకాశముతో వ్యాపించి యున్నాడు. (బృహదారణ్యక ఉపనిషత్ 1వ అధ్యాయం)

చైతన్యమే అసలు వెల్తురు. ఆ వెలుగు లేకపోతే యే వెలుగూ లేదు.

మీమాంసకులు స్వతః ప్రమాణం అనే భావనకు మూలం రుగ్వేద సూర్యుడే. సూర్యుడు స్వయం ప్రకాశకుడు. వేదం కూడా అలాగే స్వయం ప్రకాశకం. దానినెవరూ సృష్టించలేదు. అది అనాది. దానికి మరొక ప్రమాణం అవసరం లేదు. అన్ని వస్తువులూ స్వతః ప్రమాణాలే. అవి వాటిగా ప్రకాశిస్తున్నాయి. అని మీమాంసకులు అంటారు.

◆ ◆ ◆

చీకటి – వెలుగులు

ఉపనిషత్తుల నుండి మీమాంసశాస్త్రం నుండి యీ శాఖా చంక్రమణం అంతటి నుండి మళ్ళీ రుగ్వేద సూర్యునిలోకి ఉషస్సులోకి అడుగుపెడ్డాం. ఉషస్సును గురించి మాట్లాడ్తున్నపుడు చీకటిని గురించి రాత్రిని గురించి మరిచిపోవద్దు. వెలుగు – నీడలు కలిసే వుంటాయి. అందుకే సూర్యనారాయణ మూర్తి భార్యగా ఛాయాదేవి వర్ణించబడింది అన్నారు మిత్రులు మృత్యుంజయరావుగారు.

ఆయన మాట వేద వాక్కే. రుగ్వేదంలో ఉషస్సూ రాత్రీ వేరువేరు కావని రెండూ వొకటేనని వర్ణించబడింది. ఉషస్సు అహోరాత్ర స్తుతి ద్వారా శ్లాఘించబడింది

అపురుషస్య దుహితరా విరూపే (4-49)

రాత్రి పగలు అనే విభాగానికి కారణమైన సూర్యుడే వాటికి తండ్రి. కాని అవి వొకదాన్ని మరొకటి బాధించుకుంటూ చరిస్తున్నాయి అని రుగ్వేద రుషి వర్ణించాడు. నిజమే కానీ వాటి వైరుధ్యం నిజం కాదని, ఏకత్వమే సత్యమని యీ మంత్రంలో స్తుతించాడు.

అపాన్యదేత్యభ్యన్య దేతి విషురూపే అహనీ సంచరేతే.

పరిక్షితోస్తమో అన్యాగుహాకరద్యౌ దుషాః (2-123)

ఉషస్సు – రాత్రి వ్యవధానం లేకుండా వొకదాని వెంట వొకటి పరిగెడ్తున్నాయి. అహము – పగటితో సాహచర్యం వల్ల రాత్రి కూడా అహము అనే పిలవబడ్తోంది. (ఉషస్సు – రాత్రి కూడా అహము అనే పేరుతో పిలవబడ్తున్నాయి) రాత్రి అన్ని వస్తువులనీ కప్పేస్తోంది. ఉషస్సు ప్రకాశింపజేస్తోంది.

చీకటికీ నలుపుకీ వ్యతిరేకార్థం లేదు. నిందార్థం లేదు. అది కూడా స్తుతికి అర్హమే వైదిక ధర్మంలో. శ్రీరాముడు నలుపు. శ్రీకృష్ణుడు నలుపు. నిజానికి రామకృష్ణ శబ్దాలకి అర్థం నలుపేనని నిరుక్తం చాటుతోంది.

బ్రాహ్మణంలో పశు సమామ్నాయంలో అధోరామం సావిత్రమాలభత అని వుంది.

దీనినే ఆధారం చేసుకొని "అధోరామః సావిత్రః ఇతి విజ్ఞాయతే" అని వ్యాఖ్యానించాడు యాస్కముని.

సావిత్రం అంటే ఉదయ సంధ్యాకాలం. యింకా పూర్తిగా వెల్తురు రాని సమయం. పూర్తిగా చీకటి తొలగిపోని సమయం. దీనినే సావిత్రం అంటారు. యీ సావిత్ర సమయాన్ని ఖంజనమనే పక్షితో పోలుస్తాడు. యీ ఖంజనమనే పక్షిని అధోరామం అని పిలుస్తారు. ఎందుకంటే రామ శబ్దమునకు నలుపు అని అర్థం. కృష్ణ శబ్దమునకూ నలుపనే అర్థం. అవతార పురుషులైన రామకృష్ణులు యిద్దరూ నల్లని వారే. యీ ఖంజన పక్షి అధోభాగం అంటే కాళ్లు నల్లగా వుంటాయి. పైనంతా తెల్లగా వుంటుంది. అందుకే అధోరామం అని పేరు వచ్చింది యీ పక్షికి. అలాగే సావిత్ర సమయం (ఉదయం సంధ్య) భూభాగంపై చీకటి ఆకాశంలో వెల్తురూ కలిసి సగం తెలుపూ సగం నలుపూ. సావిత్ర కాలం కూడా అధోరామమే. యీ చర్చ సారాంశం యేమిటంటే చీకటి వెలుగులూ నలుపు తెలుపులూ స్త్రీ పురుషులూ యీ తత్వాలన్నీ కలగలసి వుంటాయి. వాగర్థాల వలే విడదీయనంతగా కలిసి వుంటాయి. యేదీ మరొకదానికంటే గొప్పది కాదు. నల్లరంగుపై తెల్లరంగు ఆధిపత్యం సనాతనం కాదు, అధునాతనం.

నల్లవాళ్లు – తెల్లవాళ్ల కొట్లాటలు నేటివి. అవి వైదికం కావు.

కొందరు అతి తెలివిపరులు యీ సత్యాన్ని విస్మరించి, మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. దాన్నే చరిత్ర అంటున్నారు ప్రాచీన చరిత్ర అంటున్నారు. అదంతా నాన్సెన్స్.

నలుపు తెలుపుల అబద్ధపు చరిత్ర

నలుపు తెలుపులకి చరిత్ర లేదు. ఆది వుంటేనే చరిత్ర. కానీ నలుపు తెలుపులకి ఆద్యంతాలు లేవు. చీకటి వెలుగులకి ఆద్యంతాలు లేవు. అవి అనాది.

కానీ నలుపు తెలుపు రంగుల తేడాలనిబట్టి చరిత్ర రచన చేయాలని చరిత్రకారులు వృథా ప్రయాసపడ్డారు. తప్పుడు చరిత్రని రచించారు.

కారణం ఏమిటంటే రంగులు అనేవి సంకేతాలుగా వాడబడ్తాయి. అన్ని సందర్భాల్లో చర్మపు రంగులుగా నిర్ణయించలేం. వేదాల్లో దేవతలు తెల్లరంగు గల వాళ్లుగా, అసురులు నల్లని వాళ్లుగా వర్ణించబడ్డారు. పగలూ వెల్తురూ దేవతలకీ, రాత్రి చీకటి రాక్షసులకి సంకేతం. అంతేకానీ స్థానిక కృష్ణ వర్ణులపై శ్వేతజాతీయులు దాడి చేశారని నిర్ధారించలేం. ఎందుకంటే యిరానియన్ గ్రంథమైన జెండా అవెస్తాలో కూడా అహురులు నల్లని వారుగాను, దేవులు తెల్లవారుగానూ వర్ణించబడ్డారు. అవే పదాలూ, అవే పోలికలూ వేదంలోనూ కనబడ్తాయి.

నల్లరంగు – తెల్లరంగు అనేవి విశ్వాన్నీ ప్రకృతి గమనాన్నీ వర్ణించడంలో ఎక్కువగా వాడబడ్డాయి. అంతేకానీ జాతిభేదం ఆనాటి వారు ఎరుగరు. ఎందుకంటే చర్మపురంగుకంటే సాంస్కృతిక భేదాల్ని చూపడానికే వర్ణం అనే పదం వాడబడింది. నల్లరంగు అనేది వైదిక కర్మకాండకి దూరంగా వున్న వాళ్లు అనే అర్థంలో కొన్నిచోట్ల ప్రయోగించబడింది.

అసలు ఆర్యులు తెల్లనిరంగు గలవారుగా వర్ణించబడలేదు. రుగ్వేదంలో సోముడు, వాయువు, ఎద్దులు, మేకలు వీటికి మాత్రమే తెల్లరంగు ఆపాదించబడింది. అందువల్ల ఆర్యులు తెల్లవాళ్లూ, దస్యులు నల్లవాళ్లూ వాళ్ల మధ్య వర్ణ భేదాలు ప్రబలాయని చెప్పడం అసమంజసం. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం అనే విభజన కూడా రంగు అనేది జాతిపరం కాదని తెలియజేస్తోంది. అది సాంకేతికం.

ఇటువంటి ఉదాహరణలు యెన్నో చూపుతూ ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ వేదకాలంలో వర్ణభేదాలూ జాతిభేదాలూ కట్టుకథలని తేల్చారు. విశ్వం గురించి, ప్రకృతిని గురించి, ఆచార వ్యవహారాలను గురించి చేసిన వర్ణనలని వక్రీకరించి, జాతిభేదాలు రంగు భేదాల చరిత్రగా మార్చేశారు పాశ్చాత్య చరిత్రకారులు. భాషాభేదాల్ని జాతి భేదాలుగా చూపలేదూ? యిదీ అంతే. అంతా విడదీసి పాలించడంలో భాగం. (ది ఆర్యన్ రీ కాస్టింగ్ కన్‌స్ట్రక్ట్ – రొమిల్లా థాపర్ చూడండి)

యిటువంటి కాలం చెల్లిపోయిన కట్టుకథల్నే చరిత్రగా అల్లి ప్రచారం చేస్తున్నారు ఐడెంటిటీ ఉద్యమకారులు. వాళ్ల అవసరం అది. నేడు అవసరాలే చరిత్ర ఫోజిస్తున్నాయి.

యింతకీ నల్లరంగు చెడుకి సంకేతమేమీ కాదు. అలాగైతే కృష్ణ యజుర్వేదం అనే పేరు యెలా వస్తుంది? రామకృష్ణులు నల్లని వారు. ఆ పేర్లు కూడా నలుపునే సూచిస్తాయి. ద్రౌపదికి కృష్ణ అని పేరు ఆమె కూడా నల్లనిదే.

అలాగే రాక్షసులంటే ఆర్యులచే, బ్రాహ్మణులచే అణచివేయబడిన వారూ, శూద్రులూ, స్థానిక గిరిజనులూ అని అర్థం చెపుతున్నారు కొందరు. యిది తప్పు. రామాయణాన్ని పరిశీలిస్తే యీ సంగతి అర్థమౌతుంది. రావణాసురుడు బ్రాహ్మణుడు. వేద వేదాంగ విదుడు. అతడు స్వచ్ఛమైన సంస్కృత భాషలోనే మాట్లాడేవాడు. హనుమంతుడు సీతని వెతుకుతూ లంకకు వెళ్ళి ఆమెను చూసి ఆమెతో యే భాషలో మాట్లాడాలనే సందేహంలో పడతాడు. బ్రాహ్మణుల భాషయైన సంస్కృతంలో మాట్లాడితే బ్రాహ్మణుడైన రావణుడే మారువేషంలో వచ్చాడని జానకి భయపడే అవకాశం వుంది. అందుకే సంస్కృత భాషలో మాట్లాడకూడదని నిశ్చయించుకుంటాడు. సాధారణ భాషలో మాట్లాడవలెనని నిర్ధారించుకొంటాడు.

యది వాచం ప్రదాస్యామి
ద్విజాతి రివ సంస్కృతామ్.
రావణం మన్యమానా మాం
సీతా భీతా భవిష్యతి (సుందరకాండ 30-12)

అలాగే వృత్రాసురుడు కూడా పురాణాలలో బ్రాహ్మణుడిగానే వర్ణించబడ్డాడు. వేదంలోనైతే దేవ – రాక్షసులు చీకటి వెలుగులకి, మంచి చెడులకి సంకేతాలుగా వర్ణించబడ్డారు. యీ సత్యాన్ని కన్వీనియంట్గా కప్పిపుచ్చుతున్నారు ఐడెంటిటీ ఉద్యమకారులు.

నతే అదేవః ప్రదివో నివాసతే (7-12)

సూర్యుని సమీపంలో అదేవః = రాక్షసుడు ఎవరూ నిలబడలేరు. దివ్ శబ్దానికి ప్రకాశం అని అర్థం. అంటే యిక్కడ న ఇ తత్పురుషతో కూడిన దేవ శబ్దం చీకటిని సూచిస్తోంది. చీకటే రాక్షసుడు. సూర్య కాంతియే దేవుడు.

సంధ్యావందనం

ఉద్యంతమస్తంయంతమాదిత్యమభిధ్యాయన్
కుర్వన్ బ్రాహ్మణో విద్వాన్ సకలం భద్రమశ్నుతే
అసావాదిత్యో బ్రహ్మేతిబ్రహ్మైవసన్
బ్రహ్మా ప్నోతి య ఏవం వేద (తైత్తిరీయ బ్రాహ్మణం)

ఉదయించుచున్న సమయంలోనూ అలాగే అస్తమించుచున్న సమయంలోనూ అనగా ఉభయ సంధ్యా సమయాల్లోనూ ఆదిత్యుని ధ్యానిస్తూ బ్రాహ్మణుడు సకల శుభములను పొందుతున్నాడు. ఆదిత్యుడే బ్రహ్మము (పరమాత్మ) అనే సత్యాన్ని తెలుసుకొని అతడే పరబ్రహ్మము అయిపోతున్నాడు.

తన తేజస్సు ద్వారా సర్వ వ్యాపకుడు సర్వాంతర్యామియైన సూర్య భగవానుడే పరమాత్మ తత్వమునకు మూలం.

సూర్యోపాసనలో భాగంగా సూర్యోదయ సూర్యాస్తమయాలనీ వాటి సంధి దశనీ గమనిస్తూ వచ్చారు వైదికులు. దీని నుంచి యుగములు, యుగసంధి అనే భావనలు కూడా వచ్చాయి. కాలం ద్రష్టనిబట్టి వుంటుంది. మనం జీవించే పద్ధతినిబట్టి మన కాలం నిర్ధారించబడింది. చీమలూ దోమల కాలం వేరేగా ఉంటుంది. వాటికి కొన్ని రోజులే జీవితకాలం. అతి చిన్నవైన అణువుల కాలం కూడా అత్యల్పమని భాగవతంలో వర్ణించబడింది. బ్రహ్మగారి కాలం సుదీర్ఘమని వర్ణించబడింది. అత్యల్ప కాలాన్ని అతి సుదీర్ఘ కాలాల్ని అంతేకాదు కాలం యొక్క అనంతత్వాన్నీ వైదికులు పసిగట్టారు. అదంతా సూర్యారాధన వల్లే జరిగింది. ఎందువల్లనంటే పగలూ – రాత్రీ యెల్లపుడూ సూర్యకిరణాలే మనిషి ప్రాణాల్ని నిలుపుతున్నాయని, జీవి దేహమంతటా సూర్యకాంతి వ్యాపించి వుందని నమ్మారు.

◆ ◆ ◆

సూర్యుడూ – దేశం

బహుళత్వమూ – ఏకత్వమూ ఏకత్వంలోని బహుళత్వమూ, బహుళత్వంలోని ఏకత్వమూ సూర్యతత్వం వల్లే అవగతమయ్యాయి.

సదృశరిందు సదృశీరిదు శ్వో దీర్ఘం సచంతే వరుణస్యధామ
అననద్యాస్తి శతం యోజనాన్యేకైకా క్రతుం పరియంతి సద్యః (2-123)

ఒకే ఉషస్సు అనేక ఉషస్సులుగా భాసిస్తోంది. ఉషస్సులన్నీ సదృశములైనవే. మరి ఉషస్సులు అనే బహువచనం ఎలా సంభవించినది? సూర్యుడు వొక ప్రదేశంలో ఉదయించినపుడు ముప్పై యోజనాల వరకు జీవ జాలానికి కనపడతాడు. ఆ మేరకు ఉషస్సూ కనబడ్తుంది. ఉషస్సు అంటే యేమిటి? యదా నక్షత్రాణి న దృశ్యంతే సూర్యశ్చ నోదేతి ఉషఃకాలః నక్షత్రాలు అదృశ్యమై యింకా సూర్యుడు పూర్తిగా దృశ్యమానం కాని సంధి దశే ఉషః కాలం. సూర్యుడు ఉదయించే ప్రతీ ప్రాంతంలోనూ వొకొక్క ఉషోదేవత దర్శనమిస్తోంది. ప్రదేశ బహుళత్వం వల్ల ఉషస్సులు బహుళంగా భాసిస్తున్నాయి కాని అన్నీ సదృశమైనవే, అన్నీ వొకటే.

సూర్యుడు వొకచోట ఉదయిస్తున్నాడు మరోచోట అస్తమిస్తున్నాడు. ఇంకొకచోట మధ్యాహ్న సూర్యుడై ప్రచండంగా వెలిగి పోతున్నాడు. ఇది ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్టు వాక్కు.

ఉదయో యో లంకాయాం
సోస్తమయః సవితురేవ సిద్ధపురే
మధ్యాహ్నో యవకోట్యాం
రోమకవిషయేర్ధరాత్రః స్యాత్ (ఆర్యభటీయం)

యిక్కడ అసలు విషయం ఏమిటంటే సూర్యుడొక్కడే, ఉషస్సు కూడా వొకే తీరుది. కానీ ప్రదేశ బాహుళ్యం వల్ల బహుళత్వం భాసిస్తోంది. బహువచనం సిద్ధిస్తోంది. లంకలోనూ, సిద్ధపురంలోనూ యవనుల దేశంలోను, రోమ్లోనూ ఉదయించే, అస్తమించే,

వెలిగే సూర్యుడు వొక్కడే. ఉషస్సు ఒకటే. కానీ దేశ భేదాన్నిబట్టి బహుళత్వం స్థాపించబడ్తోంది. బహుళత్వం దృష్టిగోచరం. ఏకత్వం సత్యం, అదే దైవ స్వరూపం. అది అన్ని దేశాలనీ కలుపుతుంది.

మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం మీయతే ఇతిమాయా.

కొలతలే – డైమన్షన్సే మాయ అని పిలవబడ్తున్నాయి. దేశమూ, కాలమూ వట్టి కొలతలే అవి మాయే. ఆ మాయని తొలగిస్తే ఆదిత్యుడూ, ఉషస్సూ, గాయత్రీ వొక్కరే. అసావాదిత్యో బ్రహ్మ అదే బ్రహ్మ స్వరూపం. అదే అనంతం. చివరికి సూర్యతత్వం అనంతంలో లయిస్తుంది. పూర్ణంలో పూర్ణమౌతుంది.

◆ ◆ ◆

సూర్యుడూ - కాలం

కాలానికి ముసలితనం లేదు. అది ఎప్పటికీ శిథిలం కాని చక్రం. కాలాన్ని అనంతమైన పునరావృత్తితో కూడిన చక్రంగా చూసే దృష్టి రుగ్వేదంలోనే వుంది.

పంచారే చక్రే పరివర్తమానే
తస్మిన్నా తస్థుర్భువనాని విశ్వా.
తస్యనాక్షస్తప్యతే భూరిభారః
సనాదేవ నశీర్యతే సనాభిః (2-164)

రుతువులనే యిరుసులు గల సంవత్సరూపమైన కాలచక్రం నిరంతరం పునరావృత్తి చెందుతోంది. దానిలో సకల జీవరాశులూ, సకల భువనాలూ స్థితి కలిగి వున్నాయి. అతి సనాతనమైన యీ కాల చక్రం శిథిలం కాదు కాక కాదు. ఎంత భారం వున్నా శిథిలం కాని చక్రం యిది.

ప్రతీదాన్ని అనాదిగా అనంతంగా చూడడం భారతీయ దృష్టిలోని ప్రత్యేకత. యిక్కడ కాలం కూడా అక్షయమైనదిగా శాశ్వతమైనదిగా వర్ణించబడింది.

శబ్దమూ, కాలమూ, స్థలమూ (ఆకాశమూ) ప్రతీదీ శాశ్వతమూ, అసంతమూ, పూర్ణమూ. యీ దృక్పథం బీజంలోనే వుంది. అంటే రుగ్వేదంలోనే వుంది. యీ దృక్పథమే భర్తృహరివంటి మేధావుల్ని ప్రభావితం చేసింది.

కాలాన్ని ఖండ ఖండాలుగా చూస్తున్నది మానవుడు. నిజానికి కాలం అనంతం, శాశ్వతం. రుతువులూ, సంవత్సరాలూ యీ కొలతలన్నీ మానవబుద్ధి కల్పితాలే అంటాడు భర్తృహరి. దీనితో కాలపు పరుగుపందాన్ని నిలిపివేస్తాడు. గత వర్తమాన భవిష్యత్తుల్నీ వాటిని ఆధారం చేసుకొని అభివృద్ధి చెందిన తత్వాల్నీ చావుదెబ్బ తీస్తాడు. కాలాన్ని ముక్కలు చేసి వొకదాని మీద మరొక దాని ఆధిపత్యాన్ని నిలిపే పద్ధతికి ఆస్కారం లేకుండా చేశాడు భర్తృహరి. ప్రగతి, అభ్యుదయం పేరుతో సాగే వ్యర్థమైన పరుగుకి మద్దతులేకుండా చేశాడు. యిది వైదిక దృష్టిలోనిదే. విశ్వ గమనాన్ని చక్రాకృతిలో చూశారు.

పునరావృత్తిగా చూశారు వేద రుషులు. దీనికి మొదలూ లేదు తుదీ లేదు. కొలతలన్నీ మాయే.

మళ్లీ రుగ్వేదంలోకి ప్రయాణం చేద్దాం కాస్సేపు.

పునః పునర్జాయమానా పురాణీ

సమానం వర్ణమభిశుంభమానా

శ్వఘ్నేవ కృత్నుర్విజ ఆమినానా

మర్తస్య దేవీ జరయంత్యాయుః (1-92)

(పునః పునర్జాయమానా అనే వాక్యం చాలా ముఖ్యమైనది. శంకరాచార్యుల వారి పునరపి జననం పునరపి మరణం అనే భజగోవింద శ్లోకం గుర్తుకు వస్తుంది)

ప్రతిరోజూ మళ్లీ మళ్లీ సూర్యోదయానికి ముందే ప్రాదుర్భవిస్తోంది, ప్రాచీనమైన శాశ్వతమైన ఉషస్సు. ప్రతి నిత్యం ఒకే రూపాన్ని పొందుతూ వొకే వర్ణంలో శోభిస్తోంది ఉషస్సు. కాలం పరుగులు తీస్తున్నా ప్రతీసారీ వొకే వర్ణంలో వొకే రీతిగా ఉజ్వలంగా ప్రకాశిస్తూ తన నిత్యత్వాన్ని చాటుకుంటోంది ఉషస్సు. అమర్త్యురాలైన ఉషోదేవి మర్త్యుల యొక్క ఆయుష్షుని మాత్రం ప్రతిరోజు క్షీణింపచేస్తోంది. జరయతి – జరవైపు పరుగు తీయిస్తోంది మానవ జాతిని. వేటగత్తె ఎగురుతున్న పక్షుల యొక్క రెక్కల్ని గాయపరిచి వాటి ఆయువుని క్షీణింపజేసినట్లుగా ఉషోదేవి మర్త్యుల ఆయువుని క్షీణింపజేస్తోంది.

మర్త్య శబ్దానికి మరణశీలమని అర్థం. మనిషినేకాక మరణశీలమైన జీవజాలాన్నంతటినీ వేదరుషి ఉద్దేశించి వుండవచ్చు. మనం నివసించే లోకం పురాణాల్లో మర్త్యలోకంగా వర్ణించబడింది. అంటే మరణం కలిగిన లోకమని అర్థం.

పునరావృత్తితో కూడిన ఉషస్సు యుగ భావనకు దారితీసింది. ఇలాంటి అసంఖ్యాకమైన ఉషస్సుల పునరావృత్తే యుగాలుగా మారుతోంది.

ప్రమినతే మనుష్యా యుగాని

యోషా జారస్య చక్షషా విభాతి. (1-92)

తన రాకపోకల చేత మనుష్య సంబంధమైన కృత త్రేతాది యుగములకు హేతుభూతయై యుగముల ద్వారా జీవజాలాన్ని క్షీణింప జేస్తున్నదై సూర్యుని భార్యయైన ఉషోదేవి ప్రకాశిస్తున్నది.

కాలుడు అంటే మృత్యువు అనే అర్థం స్థిరపడింది. కాలంలోని క్షీణింపజేసే లక్షణాన్ని, యుగాలుగా మారి ప్రళయానికి దారితీసే కాల స్వభావాన్ని ఉషోదేవి వర్ణన వ్యక్తం చేస్తోంది. ఉషస్సుని అందమైన యువతిగా సూర్యుని భార్యగా వర్ణించిన మంత్రం కూడా వుంది.

కానీ కాలం యొక్క అనంత గమనాన్నీ ఆ ప్రవాహంలో కొట్టుకుపోయే జీవజాలాన్ని గురించి ప్రస్తావించిన మంత్రాలు నా దృష్టిని ఆకర్షించాయి. అలాగే యుగ భావన కూడా నన్ను ఆకర్షించింది.

యిక్కడి నుంచి నా మనస్సు భగవద్గీతలోని విశ్వరూప సందర్శన యోగంలోకి గంతింది. ఉషోదేవత రూపం శ్రీకృష్ణుని విశ్వరూపం రెండూ మర్త్యుల ఆయుష్షుని క్షీణింపజేసేవే అనంత యుగాల్ని పరుగు తీయించేవే.

సూర్య తేజస్సే ఉషస్సు. విశ్వరూపం కూడా సూర్య తేజస్సుతోనే పోల్చబడింది. దివి సూర్య సహస్రస్య – వొక్కసారిగా వెయ్యి సూర్యులు ఉదయించిన దానికంటే ఎక్కువ తేజస్సు కలిగి వుంది శ్రీకృష్ణ విశ్వరూపం.

తేజోభి రాపూర్య జగత్సమగ్రం

భాస స్తవోగ్రాః ప్రతపంతి విష్ణో

ఓ సర్వవ్యాపకుడైన విష్ణువా సమస్తమైన జగత్తును తేజస్సుతో కప్పివేసి ఆస్వాదిస్తున్నావు. అధికమగు తాపాన్ని కలగజేస్తున్నావు అంటాడు విష్ణు విశ్వరూపాన్ని చూసి నరుడు. విష్ణువంటే సూర్యుడే కదా?

విష్ణువు తనని మృత్యు రూపమైన కాలంగా అభివర్ణించుకుంటాడు.

కాలోస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధః

లోకాన్ని క్షీణింపజేసే నశింపజేసే కాలాన్ని నేనే అంటాడు విష్ణువు. కాలం దైవ స్వరూపం. కాలం అంటే మృత్యువుకి పర్యాయ పదం కూడా. అందుకే కాలధర్మం చెందాడంటారు.

జీవితానికి విరుద్ధమైనదే మృత్యువు కదా? ఒక వ్యతిరేక పదాన్ని వొక నెగిటివ్ పదాన్ని దైవ స్వరూపమనడంలో అంతరార్థమేమిటి? జీవితం సగుణం. మృత్యువు నిర్గుణం. అట్టి నిర్గుణమైన దాన్ని ఎత్తిపట్టడంలోని అంతరార్థమేమిటి? జీవితం ప్రకృతి. మృత్యువు వికృతి కాదా? కానే కాదు అంటాడు కాళిదాసు, 'రఘువంశమ్'లో.

మరణం ప్రకృతిః శరీరిణాం

వికృతిర్జీవిత ముచ్యతే బుధైః

క్షణమప్యవతిష్ఠతే శ్వసన్

యది జంతుర్ననుు లాభవానసౌ (8-87)

మృత్యువే ప్రాణికి సహజ స్వభావం, అదే ప్రకృతి. జీవితమనేది యాదృచ్ఛికం, అసహజం. అందువల్ల క్షణ కాలం జీవించినా దానితో తృప్తి పడాలి జీవి.

ఎందువల్ల? మరణం మాత్రమే జీవి సహజ స్వభావం కనుక, మృత్యు స్థితే సహజ స్థితి కనుక. అందుకే కృష్ణ భగవానుడు కాలాన్ని మృత్యు సమానం చేసివేశాడు.

ఎందుకంటే సృష్టి అసహజం, అది వికృతి. ఎందుకంటే సత్వరజస్తమో గుణాలు సమస్థితిలో వున్నపుడు సృష్టే లేదు. అవి విషమ స్థితికి చేరుకున్నపుడే సృష్టి మొదలైంది అంటుంది సాంఖ్య. సమస్థితే దైవ స్వరూపం. అదే మృత్యువు. సృష్టి అంతా జేరుకునేది అక్కడికే. అదే కృష్ణుని విశ్వరూపం.

ఉషస్సుని పునఃపునర్జాయమానా అని వర్ణిస్తోంది రుగ్వేదం. మళ్ళీ మళ్ళీ పుట్టేదిగా వర్ణిస్తోంది అంటే జన్మ పరంపర అన్నమాట.

శంకరాచార్యుల వారు భజగోవిందంలో పునరపి జననం, పునరపి మరణం అన్నారు. ఈ జనన మరణ పరంపరని దాటడమే నిజమైన దైవస్థితి. అదే అసావాదిత్యో బ్రహ్మ అంటూ ఉపనిషత్తు స్తుతించిన బ్రహ్మ స్వరూపం. అక్కడ కాలం ఏకం, అనంతం నిర్గుణం. దానినే కాలాతీత స్థితి అనవచ్చు. అదే సూర్యుని వెలుగుని మించిన వెలుగు, అదే ఆదిత్య బ్రహ్మ.

◆ ◆ ◆

కదలని కాలం
కదుల్తున్న దృష్టి

కాలం సగుణమా? నిర్గుణమా? కాలాలు ఉన్నాయా కాలాలన్నీ వొకటేనా? కాలానికి విశేషణాలు ఉన్నాయా లేదా?

సంఘటనలూ క్రియలే కాలమా? మనం కాలంపై సంఘటనల్నీ క్రియల్నీ ఆరోపిస్తున్నామా?

అసలు కాలంఅనేది వుందా? అది సాపేక్ష స్థితిలో మాత్రమే వుందా?

స్థల కాలం అనే పదాన్ని ఐనిస్టీన్ సృష్టించాడు. ఇది విజ్ఞాన శాస్త్రపరంగానే కాదు. సాధారణ మానవ జీవితాన్ని చూసినా అర్థం అవుతుంది. మనం కాలాన్ని సంఘటనలతో కొలుస్తాం. ఆ కాలంలో అని మనం అంటున్నామంటే, ఆ సంఘటనలు జరిగిన కాలంలో అనే అర్థం.

ఒకప్పుడు కాలాన్నీ సంఘటనలనీ విడదీయకుండా ఏకమొత్తంగా అర్థం చేసుకొనేవారు. మా అబ్బాయి పెద్ద వరద వచ్చినపుడు పుట్టాడు అనో మరొకటనో వొక ప్రధాన సంఘటనతో ముడిపెట్టి చెప్పేవారు. కాలాన్ని గడియారంతో కొలవడం ఆధునికం. కాలానికి గడియారం ప్రాతినిధ్యం వహించడం ఒక ఉపద్రవం. దీనితో బయాలాజికల్ క్లాక్ (జీవ గడియారం)కి స్థానం లేకుండా పోయింది. కోడికూత ఉదయాన్ని సూచించడం మానేసింది.

స్థల కాలాలకి ఆధునిక వాస్తవికతతో సంబంధం తెగిపోయింది. ఐనిస్టీన్ 'స్థల కాలం' అనే పదాన్ని సృష్టించాడు కానీ నిజ జీవితంలో అది తప్పుకొంది. డిజిటల్ టెక్నాలజీ వచ్చాక స్థలం వర్చ్యువల్ ప్లేస్గా మారిపోయి అభావం చెందింది.

అంటే వాస్తవంతో సంబంధం లేని 'మహిమ' (మేజిక్) పూరిత ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. ఏసుక్రీస్తు ఒక రొట్టెని పది రొట్టెలుగా మార్చాడు అంటారు. వర్చ్యువల్

వరల్డ్‌లో దేన్ని దేనిగానైనా మార్చవచ్చు. నరేంద్రమోడీ భగత్ సింగ్‌కి అన్నం క్యారేజి తీసుకొని వెళ్లి యివ్వవచ్చు. సంఘటనలని, దృశ్యాలని తారుమారు చేయవచ్చు.

కన్నుకి విస్తృతి అనదగిన కెమెరా నిజానికి కంటిని మోసగించేదిగా పరివర్తన చెందింది.

ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం కాదు, మార్చడం ముఖ్యం అనే మార్క్సు మాటకి విలువ లేకుండా పోయింది. అసలు వాస్తవం ఏమిటో తెలిస్తే కదా మార్చడం? స్థల కాలాలికి మధ్య సంబంధం తెగిపోయింది. ప్రపంచానికి వ్యాఖ్యానానికి మధ్య మాత్రమే కాదు, ప్రపంచానికి మార్పుకి మధ్య సంబంధం తెగిపోయింది. ప్రపంచం వొక అభూత కల్పనగా మిగిలింది.

"ముస్లింల వల్ల కరోనా వ్యాపించింది" అనే మాటని విద్యావంతులు వెంటనే నమ్మేశారు. ముస్లింల సమావేశాలపై ఆంక్షలు కూడా విధించింది ప్రభుత్వం. నిరక్షరాస్యులకన్నా ఆధునిక విద్యావంతులు యిటువంటి మూఢ నమ్మకాలకి ఎక్కువ గురౌతున్నారు. కారణం నిరక్షరాస్యులకన్న వాళ్లే ఎక్కువ డిజిటల్ మాయా ప్రపంచంలో జీవిస్తున్నారు.

చేతబడులని, జ్యోతిష్యాన్ని విమర్శించే హేతువాదులు విద్యావంతులలోని మూఢత్వాన్ని రూపుమాపలేక పోతున్నారు. కారణం హేతువాదులు ఆధునిక విద్యని టెక్నాలజీ వల్ల వచ్చే మార్పుల్ని ఎక్కువ నమ్ముతారు.

మనం యిప్పుడు సంగీతాన్ని కూడా వినడం లేదు చూస్తున్నాం అంటాడు టి.జె.యస్. జార్జి (మనకు తెలియని ఎంఎస్ పుస్తకంలో)

అంటే మనం శబ్దాన్ని కోల్పోయాం. దృశ్యాల వరదలో శబ్దాన్ని కోల్పోయాం. శబ్దం ఎప్పుడు మిస్ అయిందో దృశ్యం అర్థరహితంగా మారింది.

గడియారాన్ని కాలానికి ప్రతినిధి (రిప్రజంటేటివ్)గా మార్చినట్లుగా, దృశ్యాన్ని శబ్దాలకి ప్రతినిధిగా మార్చాం.

శబ్దం లేకపోతే ప్రపంచం చీకటిమయంగా మారిపోతుంది అంటాడు దండి. శబ్దం అంటే భాష కాదు. శబ్దం అంటే ధ్వని. శబ్దం మానవ సంబంధి కాదు. సర్వవ్యాప్తం. పక్షులూ, జంతువులూ, కీటకాలూ అన్నీ శబ్దాశ్రయాలే. యిప్పుడు మనిషికన్న అవే యింకా శబ్దానికి దగ్గర.

శబ్దంలో స్వరం ప్రధానం. ఉచ్చారణ ప్రధానం. ఉచ్చారణలో హెచ్చుతగ్గులు ప్రధానం. అందుకే వ్యాకరణ శాస్త్రంలో దంత్యం, తాలవ్యం యిత్యాదిగా మన ముఖంలో దేహంలో ఉచ్చరించే స్థానాన్నిబట్టి వర్ణాలని వర్గీకరించారు.

అంటే శబ్దం సంగీతానికి దగ్గర. శబ్దం నశించి భాష మాత్రమే మిగలడం ఆధునిక హింస.

శబ్దం ఒక చెట్టులాంటిది. పిట్టలాంటిది. అది ప్రత్యక్ష ప్రమాణంపై ఆధారపడినది. భాష ఒక ఇంద్రజాలం. ఒక లిఖిత సందేశం. ఎటునుంచి ఎటైనా వెళ్లవచ్చు. దానికి స్థల కాల సంబంధం లేదు. అది వాస్తవంతో తెగతెంపులు చేసుకొంటుంది.

శబ్దం మౌఖికం, వాస్తవం, ప్రత్యక్షం. భాష దానికి కొనసాగింపు అయిన భాష అనుమాన ప్రమాణంపై ఆధారపడినది. దాని వాస్తవికతని పసిగట్టలేం. అందుకే వేదాన్ని లిఖిత పాఠకుడి నుంచి రక్షించాలి అని వైదికులు తలిచారు. దాని ఫలితమే దేశ కాలాలు ఎంత మారినా, ఎన్ని మార్పులు వచ్చినా చెక్కుచెదరని స్వచ్ఛతతో ప్రాచీన వేదం లభిస్తోంది.

శబ్దం అనిత్యం, క్షణికం అని బౌద్ధులు భావించారు. శబ్దం నిత్యం అని వైదికుల భావన. (యాస్క నిరుక్తం)

అందుకే బౌద్ధం భాషగా మారి విస్తరించింది. మతంగా ఘనీభవించింది.

బౌద్ధాన్ని దేశం బయటికి పంపి భారతదేశం ఆత్మహత్య చేసుకొంది అని తెలుగు కవి గురజాడ అన్నాడు. కానీ బౌద్ధం బర్మాలో, శ్రీలంకలో రాజ్యమతంగా మారి ఫాసిజంగా నిలిచింది.

ఇప్పుడు హిందుత్వవాదులు కూడా బౌద్ధాన్ని బౌద్ధ ఫాసిజాన్ని క్రిస్టియన్ ఫాసిజంతో కలిపి అనుసరిస్తున్నారు. శబ్దాన్ని నిరాకరించి ఫక్తు వాచ్యతలోకి దిగజారుతున్నారు.

డిజిటల్ టెక్నాలజీ మోద అందరినీ మించి ఆధారపడడం కూడా శబ్దం నుంచి భాషలోకి భాష నుంచి దృశ్యంలోకి దృశ్యం నుంచి అసత్యంలోకి దిగజారడమే. హిందుత్వ ఇంటర్నెట్‌పై ఆధారపడడం దానికే సంకేతం.

శబ్దం అపౌరుషేయం, మానవ సృష్టి కాదు. శబ్దం అనాదిగా వుంది అని మీమాంసా శాస్త్రం చెబుతుంది.

శబ్దం అపౌరుషేయం అనాది కనుక శబ్దాశ్రయమైన విశ్వమూ అనాది. మరి దేవుడు, సృష్టికర్తలకి స్థానం ఎక్కడ? వారి అవసరం లేనేలేదు.

శబ్దం ప్రత్యక్షం, ప్రపంచం ప్రత్యక్షం. పరోక్షమైనది అనుమాన ప్రమాణ జన్యమైనది కూడా ప్రత్యక్ష ప్రమాణ జన్యమే. మనం తెల్లవారి బయటికి వచ్చి చెరువుని చూస్తాం. చెరువు నిండుగా వుండడాన్ని గమనిస్తాం. దానినిబట్టి రాత్రి వాన కురిసింది అని ఊహిస్తాం. ఈ ఊహాపోహలకి కూడా ప్రత్యక్షమే ప్రమాణం. ప్రత్యక్షం అనే ప్రమాణంపైనే అనుమానం నిలిచి వుంది.

ఇంద్రియార్థ సన్నికర్ష వల్ల జ్ఞానం పుడుతోంది. అంటే మన యింద్రియాలు పదార్థాల కలయిక వల్లనన్న మాట. పదార్థాలు వున్నాయి. అవి వాటికి అవిగా వున్నాయి. పదార్థాల వునికి స్వతస్సిద్ధమైనది. స్వతః ప్రామాణ్యాన్ని మీమాంసా శాస్త్రం నొక్కి చెపుతుంది. శబ్దం అనాది, పదార్థం అనాది. వాటి మధ్య సంబంధం అనాది.

యీ పదార్థాలకి, పదార్థ సముచ్చయమైన విశ్వానికి ఒక బాహిర కారణాన్ని వెతకడం వృధా ప్రయాస. ఎందుకంటే అలాంటి బాహిర కారణాన్ని వెతికి పట్టుకొంటే, దానికి మరొక కారణం కావాలి. దేవుడు వుంటే, ఆ దేవుడికి కూడా తండ్రి వుండాలి, తాత వుండాలి. స్వతఃప్రామాణ్యం యీ సమస్యని నివారిస్తుంది. సాంఖ్యం చెప్పేది కూడా యిదే.

సాంఖ్య తత్వ శాస్త్రం ఏం చెప్తోంది? కార్యకారణ పరంపర కాదు, కార్యకారణ అభేదం మాత్రమే వుంది అని చెపుతోంది. విత్తులోనే చెట్టు వుంది. విత్తూ చెట్టూ ఒకటే. ఉపనిషత్తులో ఒక వర్ణన వుంది. సాలెపురుగు సాలెగూడు వేరు కాదు.

మీమాంసకులు, సాంఖ్యులు దైవాన్ని మొదట్లోనే యెందుకు తుంచేశారు?

ఈశ్వరుణ్ణి అంగీకరించినట్లయితే కర్మకి ప్రాధాన్యం నశిస్తుంది. మీమాంసకుల దృష్టిలో కర్మ అంటే రిచ్యువల్, యజ్ఞ కర్మకాండ. ఇది ఆదిమ ప్రజల మేజిక్‌తో దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ పోల్చాడు. ఒక ఆదిమ తర్కం మనని వెంటాడింది. ఆ తర్కం దేవుడిని ధియాలజీని నిరాకరిస్తూ వచ్చింది.

అందుకే చాలా ఆలస్యంగా మాత్రమే భారతదేశంలో థియాలజీ దైవ చింతన పర్సనల్ గాడ్ ఆవిర్భవించారు. బహుశా ముస్లింలు కేరళకి చేరడం, మసీదు నిర్మించడం, అక్కడి రాజుతో ప్రజలతో సాన్నిహిత్యం దైవ భావనకి పురుడు పోసింది.

శంకరాచార్యులు బౌద్ధాన్ని యిస్లాంని కలిపి నూతన మతానికి అంకురార్పణ చేశాడు.

అందుకే శంకరాచార్యులని ఆనాటి బ్రాహ్మణులు ద్వేషించినట్లే కనబడ్తుంది. శంకరాచార్యుల వారి తల్లి చనిపోయినపుడు, కర్మకాండలో సహకరించడానికి ఆయన స్వగ్రామమైన కాలటిలో ఏ బ్రాహ్మణుడూ సహకరించలేదు. శంకరాచార్యులు స్వయంగా తల్లి శవాన్ని దహనంచేసి, కాలటిని శపించారు. దహనం కూడా తన యింటి పెరటిలోనే చేయడం ధిక్కారాన్ని సూచిస్తోంది.

తద్దినం జరుపుతున్న మండన మిశ్రుని యింటికి శంకరాచార్యులు వెళ్ళారు. అప్పుడు మీమాంసకుడైన మండన మిశ్రుడు సన్యాసాశ్రమాన్ని కాషాయ వేషధారణని నిందించాడు. స్త్రీ గర్భంలో వసించి, స్త్రీ వల్లనే జన్మించి, స్త్రీలని బంధనంగా భావించడం కృతఘ్నత అంటాడు మండన మిశ్రుడు. ఆశ్చర్యం ఏమిటంటే మండన మిశ్రుడి భార్య ఉభయ భారతి కామశాస్త్రం నుంచి శంకరుణ్ణి ప్రశ్నలు అడుగుతుంది.

శంకర గ్రంథాలకి శిష్యుడు పద్మపాదాచార్యులు రాసిన వ్యాఖ్యానాన్ని తగలబెట్టడం కోసం అతని మేనమామ యిల్లే తగలబెట్టుకొన్నాడు. యాత్రకి వెళ్తూ ఆ గ్రంథాన్ని పద్మపాదుడు మేనమామకి అప్పజెప్పి వెళ్తే, ఆయన చేసిన నిర్వాకం అది.

ఆనాడు అందరూ మీమాంసకులూ జగత్తు వారికి సత్యం. సన్యాసం అంటే గిట్టదు. అది బౌద్ధుల గోల. దేవుడు కాదు, వైదిక కర్మకాండ యజ్ఞం వారికి ప్రాణం.

అందుకే మీమాంసకులు ప్రచ్ఛన్న చార్వాకులు అని జైనులు అన్నారు. (ఆంధ్రప్రదేశ్‌లో జైన బౌద్ధాలు – బిఎస్ఎల్ఎన్ హనుమంతరావు) కణ్వ ఆశ్రమంలో జరిగే పండిత చర్చలలో లోకాయతం కూడా వుంది అని మహాభారతం పేర్కొంది.

భౌతిక జగత్తులో పూర్తిగా యిమిడి పోయిన వాడే బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడు దేశకాలాల సూత్రాలని కనుగొనాలనుకున్నాడు కానీ వాటిని మీరాలనుకోలేదు.

క్షత్రియులు ఇహపరాలని జయించాలనుకున్నారు. అందుకే అవతార పురుషులు క్షత్రియులే కానీ బ్రాహ్మలు కాదు.

బ్రాహ్మణుడు ప్రధానంగా ప్రకృతినీ, ప్రకృతిలో మనుషుల స్థానాన్ని సూత్రీకరించాడు. అందుకోసం స్థల కాలాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు.

మూర్తో ధర్తా చేత్ ధరిత్ర్యాః తతః
అన్యఃతస్యాప్యన్యోన్యైవమత్రానవస్థా
అంత్యే కల్ప్యా చేత్ స్వశక్తిః కిమాద్యే
కింనో భూమేః సాష్టమూర్తే శ్చమూర్తిః

(సిద్ధాంత శిరోమణి గోళాధ్యాయః భాస్కరాచార్య)

ఖగోళ శాస్త్రవేత్త భాస్కరాచార్యులు భూమికి వేరే ఆధారం లేదు. దానికి అదే ఆధారం అన్నారు. భూమికి ఆధారం వుంది అంటే దానికి మరో ఆధారం వుండాలి. యిలా ఆధార ఆధేయ భావాన్ని సాగదీస్తూ పోతే దానికి తుది అంటూ వుండదు. యిలా సాగదీయడంకంటే మొదట్లోనే భూమికే ఆకాశంలో నిలిచి వుండగల స్వయంశక్తి వుందంటే సమస్య వుండదు. భూమి శివుని వలే స్వయం శక్తి గలది.

యిక్కడ దేవాధిదేవుడిని పైన నిలపడం లేదు. భూమికే తనని నిలుపుకొనే శక్తి వుందంటున్నాడు భాస్కరాచార్యులు.

కార్యకారణ సంబంధానికి చెందిన ఈ పొదుపు భారతీయ తత్వంలోనే వుంది. న అన్యాధారః స్వశక్త్యైవ వియతి

నియతం తిష్ఠతి స్వశక్తితోనే భూమి ఆకాశంలో నిలిచివుంది.

స్వశక్తి స్వతః ప్రకాశం, స్వతః ప్రమాణం యివి భారతీయ తత్వాలు. అందుకే రమణ మహర్షి 'నిన్ను నువ్వు తెలుసుకో' అంటాడు. అంటే నీకు నువ్వే ఆధారం, నీకు నీవే జ్యోతి ఆత్మజ్యోతి. శబ్దాన్ని సూర్యుడితో పోల్చాడు మీమాంసా భాష్యకారుడు శబరుడు. పరమాత్మని సూర్యుడితో పోలుస్తారు వేదాంతులు. అంటే అంతా స్వయం ప్రకాశం మాత్రమే.

భౌతిక జగత్తుకి, మానవ అనుభవానికి పూర్తిగా బయట విశ్వానికి మూలకారణాన్ని మరో పేరుతో దైవాన్ని నిలపడం సనాతనం కాదు. అందుకే శివుడితో భూమిని పోల్చాడే

కాని, శివుడిని భూమికి సృష్టికి ఆధారంగా నిలపలేదు.

సృష్టికర్త భావనకి దూరంగా సాంఖ్య సృష్టి క్రమాన్ని ఆశ్రయించాడు భాస్కరాచార్యులు. సూక్ష్మం నుంచి స్థూలం సహజసిద్ధంగా పరిణమిస్తుందని సాంఖ్య మతం.

మరి ఆకాశంలో భూమి స్థిరంగా ఎలా నిలిచి వుంది? దాని స్వభావమే అలా నిలిపి వుంచింది. అగ్నికి ఉష్ణంలా నీటికి చల్లదనంలా భూమికి అచలత్వం నిలిచి వుండడం స్వభావం అంటాడు భాస్కరాచార్యులు.

స్వభావం అనేది సనాతనంలో అతి ప్రధానమైన భావన. ఆయుర్వేదం అకృతకం అంటాడు చరకుడు. నిప్పుకి వేడి, నీరుకి ద్రవత్వం అలాగే ఆయుర్వేద సూత్రాలు ప్రకృతిలోనే వున్నాయి అంటాడు. 'స్వాభావికం' అంటాడు.

ఈ స్వభావ వాదానికి మరో ముఖమే వర్ణ వ్యవస్థ.

◆ ◆ ◆

వర్ణ వ్యవస్థ - కులం

2011లో నేను మిత్రుడు ఉపాధ్యాయుడు సురేష్‌తో కలిసి హుజూరాబాద్ జిల్లాలో జాంబ పురాణం చెప్పే దక్కలి మొగిలిని కలిశాం. కులాల గురించి అడిగితే, తోటలో అన్ని పూలు ఒకే రంగులో వుండవు అన్నాడు.

కుల వ్యవస్థని స్వభావ సిద్ధమైనదిగా చూడడం సంస్కృత గ్రంథాలలోనూ, ప్రజల వాడుకలోనూ కూడా కనబడ్తుంది. భోజుడు రాసిన వృక్షాయుర్వేదంలో చెట్లలో కూడా స్వభావ సిద్ధమైన వర్ణ వ్యవస్థ వర్ణించబడినది. (నా పురాణ వేదం గ్రంథంలో వివరంగా రాశాను) అంటే సృష్టిలో కానీ సామాజిక వ్యవస్థలో కానీ భగవంతుడి ప్రమేయం లేదు. అన్నీ స్వభావ సిద్ధమైనవి, నేచురల్. ఆక్టేవియో పాజ్ కూడా యీ సంగతి రాశాడు.

బ్రాహ్మణులు ఈ స్వాభావికతకి, స్వతః ప్రమాణం అనే భావనకి ఒక సైద్ధాంతిక సమర్ధన చేకూర్చారు. ప్రకృతిని, ఖగోళాన్ని, సమాజాన్ని యీ స్వాభావిక తర్కంతో వ్యాఖ్యానించారు. యీ స్వాభావికత అనే తర్కాన్ని బ్రాహ్మలు కనుగొనలేదు. అది యిక్కడి ప్రజా సమూహాలలో వున్నదే. దానికి శాస్త్రస్థాయి కల్పించారు బ్రాహ్మలు. అంత మాత్రమే.

నిజానికి సమాజాన్ని రాజ్యాన్నీ నిలపడం కోసం అవసరమైన శాస్త్రాలని రచించింది బ్రాహ్మలే. బ్రాహ్మలే స్థల కాలాలని నిర్వచించే శాస్త్రాలని రచించారు. బౌద్ధులు కాదు. కారణం - బౌద్ధులు ఐహిక జగత్తు పట్ల విరక్తిని తాత్వీకరించారు. దానివల్ల రాజ్యానికి పౌర సమాజంలో రాజ్యరూపాలైన సామాజిక వర్గీకరణకి అవసరమైన శాస్త్రాలని రచించలేదు. బ్రాహ్మణులే రచించారు.

పంచాంగం ద్వారా వ్యవసాయదారులకి కాల అవగాహనని పెంచింది బ్రాహ్మలేనని చరిత్ర కారుడు డి.డి. కోశాంబి రాశారు. ఖగోళ గణిత జామెట్రీల జ్ఞానాన్ని పెంచింది బ్రాహ్మణులే. యజ్ఞ యాగాదులలో వేదిక నిర్మాణాల సందర్భంలో, గణితం జామెట్రీ అవసరమయ్యాయి. (శుల్బ సూత్రాలు) అలాగే వ్యాకరణ సూత్రాలు శ్రౌత సూత్రాల సంస్కృతి నుంచే ఆవిర్భవించాయి అంటాడు ప్రముఖ యిండాలజిస్ట్ ఫ్రిట్స్ స్టాల్.

(ఈ సందర్భంలో BUDDHISM IN THE SHADOW OF BRAHMINISM

- JONNES BRONK HORST పరిశీలించిదగిన గ్రంథం)

రాజుకి క్షత్రియ హోదా కల్పించడం, అతనిని నిలపడం కోసం యజ్ఞ యాగాది రిచ్యువల్స్‌ని నిర్వహించడం బ్రాహ్మడి పనే. బ్రాహ్మణుడు చక్రభ్రమణంతో కూడిన ప్రకృతినీ, స్థల కాలాలని సూత్రబద్ధం చేశాడు.

బ్రాహ్మణుడు స్థాపించిన స్థలకాలాన్ని చెదరగొట్టింది హిందుత్వ. ఈ సత్యాన్ని పసిగట్టింది గుజరాత్‌లో పుట్టి కాశీలో స్థిరపడిన పరివ్రాజకుడు మేధావి కరపాత్ర స్వామి.

ధర్మాన్ని భౌగోళిక సరిహద్దుల్లోకి కుదించడం అవాంఛనీయం, ప్రమాదకరం, ధర్మ విరుద్ధం అని చాటిన మేధావి కరపాత్ర స్వామి. హిందువు అంటే యీ భౌగోళిక సరిహద్దులలో జీవించే వాడు. ఆ సరిహద్దుల పట్ల భక్తిభావం కలవాడు అని జాతీయవాద నిర్వచనం యిస్తే యితర దేశాలలో నివసించే హిందువుల పరిస్థితి ఏమిటి అని హిందూ సంఘ్ పరివార్‌ని నిలదీశాడు కరపాత్ర స్వామి (ఆర్ఎస్ఎస్ బౌర్ హిందూ ధర్మ్).

నిజానికి సనాతన ధర్మంలో స్థల కాలాలు స్టేటిక్ కాదు, డైనమిక్. భగవంతుడు సర్వాంతర్యామి కావడం వలన రాముడు అయోధ్యలో తిష్ఠ వేసుకొని కూర్చోడు. భద్రాచలం అంతకన్న గొప్ప పుణ్యక్షేత్రం.

కాలం కూడా ఒకచోట నిలిచి పోయి కొండ గుర్తులని వదలదు. అనంత యుగాలు, అనంత అవతారాలు. అందువల్ల రాముడి ఆనవాళ్లని చరిత్రలోకాక సాహిత్యంలో వెతకాలి.

కానీ హిందూ వాదులు యీ డైనమిక్ స్థల కాల భావనకి ముగింపు పలికారు. కాలాన్ని చక్రాకృతి నుంచి బాణంగా మార్చారు. దానితో రాముడి సర్వాంతర్యామిత్వం అంతరించింది.

అందుకే వేదమంత్రాలకి కూడా కాస్మిక్ అర్థాన్ని పక్కనబెట్టి సామాజిక అర్థాన్ని అన్వయించారు. పురుష సూక్తంలో సర్వాంతర్యామియైన పరమాత్మ రూపం వర్ణించబడింది. కానీ ఆ సూక్తంలో హిందూ సమాజ ఐక్యత అనే ఆధునిక రాజకీయ భావనని మతభావనని ప్రవేశపెట్టాడు ఆర్ఎస్ఎస్ గురువు గోల్వాల్కర్. ఇది తప్పుడు వ్యాఖ్యానం అని కరపాత్ర స్వామి నిలదీశారు.

హిట్లర్ జాతీయతా వాదాన్ని భారత్‌లో హిందుత్వ పేరుతో వ్యాపింప చేస్తున్నారు అని విమర్శించారు కరపాత్ర స్వామి. తద్దినంతో సహా అన్ని కర్మకాండలనీ వైదిక ధర్మాన్నీ సర్వాత్మనా వ్యతిరేకించే సావర్కార్ ధార్మికుడు ఎలా అవుతాడు అని నిలదీశారు కరపాత్ర స్వామి. గురివింద గింజల్లా నెహ్రూని మరోవైపు విమర్శించడంలోని హిపోక్రసీని చెండాడారు.

వైదిక ధర్మంలో వర్ణ వ్యవస్థలో బహుళత్వం వుంది అని దాన్ని హిందుత్వవాదులు నాశనం చేసి హిట్లర్ తరహా ఏకస్వామ్యాన్ని నియంతృత్వాన్ని తీసుకు వస్తున్నారని కరపాత్ర స్వామి విమర్శించారు.

భారతీయ తత్వానికి విరుద్ధంగా కృత్రిమ హిందూ ఐక్యతని పెంపొందించడం వల్ల దేశం సురక్షితం కాదు. మన ఊరి మీద శత్రువు దాడి చేస్తున్నపుడు అందరూ ఐక్యమవుతారు. అక్కడ మతభేదం అడ్డంకి కాదు అని విశాల దృష్టితో వాదించారు కరపాత్ర స్వామి.

ఈ విశాల దృష్టి వైదిక ధర్మంలోనిదే.

జైమిని మీమాంసా సూత్రం గురించి యిక్కడ మాట్లాడడం సముచితం.

'స్యాద్యోగాఖ్యా హి మాధురవత్'

గతంలో మధురలో పుట్టి పెరిగి, యిప్పుడు వేరే ప్రాంతంలో నివసిస్తున్నా అతడిని మధురకి సంబంధించిన వ్యక్తిగానే చూస్తారు. అది యౌగికార్థం. రూఢ్యర్థం వేరు. అంటే బహుళ అర్థాలు వుంటాయి. ఒకే అర్థం వుండదు. అలాగే బహుళ అస్తిత్వాలు వుంటాయి. ఒకే అస్తిత్వం వుండదు.

ఇలా ఒకే అస్తిత్వంలోకి కుదించడానికి బ్రిటీషు వారు ప్రయత్నించారు. 1881 జనాభా లెక్కలలో ప్రజలని మత ప్రాతిపదికన వర్గీకరించారు. కానీ నిజానికి ఇటువంటి స్పష్టమైన వేర్పాటుతో కూడిన అస్తిత్వాలు లేనేలేవు.

జైమిని సూత్రాలలో పిక నేమ్యధికరణంలో – వేద మంత్రాలలోని శబ్దాలకి అర్థం చెప్పడానికి మ్లేచ్ఛ శబ్ద జ్ఞానం కూడా ఉపయోగిస్తుంది అని రాశారు.

అంటే జ్ఞానంలో కానీ, అస్తిత్వంలో కానీ యింత వేర్పాటు భావన ఆనాడు లేదు. ఎందుకంటే బహుళ అర్థాలు బహుళ వ్యాఖ్యానాలు వుండేవి.

ఈ బహుళ అర్థాలని అస్తిత్వాలని ఒకే మూసలోకి యిమిడ్చి డైనమిక్‌గా వుండే భారతీయ స్థల కాలజ్ఞానం స్టాటిక్‌గా మార్చబడింది. దానినుంచే హిందుత్వ, అయోధ్య రాజకీయాలు పుట్టాయి.

పూర్వ మీమాంసా దర్శనము (చర్ల గణపతిశాస్త్రి) చూస్తే సనాతన దృక్పథంలోని బహుళత్వం అర్థమవుతుంది. "నచైతద్విద్మో వయమబ్రాహ్మణా బ్రాహ్మణావా మేము బ్రాహ్మణులమో అబ్రాహ్మణులమో ఆ సంగతి ఎరుగము అను అర్థవాదములో – స్త్రీకే మేమెవరమో తెలుసు, మాకెట్లు తెలుస్తుంది. పురుషునికి కూడా తెలియదు. సంగతి తల్లికే తెలియవలయును. మాకు తెలిసికొన శక్యము కాదు. ప్రవరానుమంత్రణము చేత అబ్రాహ్మణుడు కూడా బ్రాహ్మణుడగును"

అన్నీ తెలుసు అని వైదికుడు భావించడు. అందుకే అస్తిత్వ బహుళత్వానికి ఆస్కారం వుంది సనాతనంలో. భారతీయ స్థల కాల భావనని ఎవరు అపహరించారు? ఎవరు అదృశ్యం చేశారు?

భారతీయ తాత్విక చింతనలో స్వభావము స్వతః ప్రమాణము ప్రాధాన్యం వహించాయి. ప్రకృతికి బయట ఏదీలేదు. భగవంతుడు ఉన్నా ప్రకృతి స్వరూపుడే.

ఇందుగలడందు లేదు అనడానికి లేదు. సర్వవ్యాపి. యింకా చెప్పాలంటే ప్రకృతికీ ఈశ్వరుడికీ అభేదం. నిరీశ్వర సాంఖ్యం క్రమేపీ సేశ్వర సాంఖ్యంగా మారినా ఈశ్వరుడు ప్రకృతికి మరోపేరు. ప్రకృతి ఈశ్వరుడికి మరోపేరు. కార్యకారణ అభేదం అనే సాంఖ్య భావన, ఈశ్వర ప్రమేయం వల్ల రద్దు కాలేదు. కారణాన్ని కార్యానికి, భగవంతున్ని జగత్తుకి పూర్తి దూరంగా నెట్టే ధియాలజీ భారతదేశంలో పుట్టలేదు.

అందుకే దైవభావన బలపడినా, 'దైవం మానుషరూపేణ' ఆవిర్భవించాడు. కేవలం మనిషి రూపంలోనే కాదు, జంతు పక్షి రూపాల్లో కూడా దైవం సాక్షాత్కరించింది.

కొంత మంది హేతువాదులు, దళిత వాదులు వెంకటేశ్వర సుప్రభాతంలో శృంగార వర్ణనలేమిటి? అంటారు. యిది ఆధునిక ప్రశ్న. ప్రకృతి నుంచి భగవంతుణ్ణి వేరు చేసే దృక్పథం.

అయితే ఈ ప్రాకృతిక దృక్పథం తీవ్రంగా దుర్వినియోగం చేయబడ్డం వల్లే హిందుత్వ ఆవిర్భవించింది.

◆ ◆ ◆

భారతీయ ఫాసిస్టుల ఆవిర్భావం

భారతీయ స్వాభావిక వాదాన్ని (నేచురలిజాన్ని) ఫాసిజంగా తాత్వీకరించిన వ్యక్తి సావిత్రీదేవి. ఈమె గ్రీకు జాతీయురాలు కానీ భారతదేశం వచ్చి సావిత్రీదేవిగా పేరు మార్చుకుంది. సావిత్రీదేవి జర్మన్ నాజీ నియంత హిట్లర్‌ని విష్ణు అవతారంగా వర్ణించి భారతీయ తాత్వికతకి ఫాసిస్ట్ మలుపు యిచ్చింది.

నిజానికి హిట్లర్‌కి భారతదేశం అంటే ఏమాత్రం గౌరవం లేదు. భారతీయులు అధమ జాతి వారు కనుక ఇంగ్లీషు వారు పరిపాలించడమే మేలు అని హిట్లర్ భావన. ఎందుకంటే యూరోపియన్లే నిజమైన ఆర్య జాతీయులు. వారి జెండా ప్రపంచమంతా ఎగరాలని హిట్లర్ ఉద్దేశం.

సావిత్రీదేవి అభిప్రాయం పూర్తిగా భిన్నమైనది. నిజమైన ఆర్యులు భారతీయులే. ఆర్య నాగరికత భారతదేశంలో మాత్రమే వుంది. ప్రాచీన గ్రీసులో పేగన్ – బహు దేవతారాధన వుండేది. ప్రకృతిలో ప్రకృతి శక్తులలో దైవిక భావనని చూసేవారు గ్రీకులు. ఆ నాగరికతని యూదు క్రైస్తవాలు నాశనంచేశాయి. మానవ కేంద్రకత – ఆంత్రపోసెంట్రిజాన్ని బలపరిచాయి.

అటువంటి ప్రాచీన గ్రీకు నాగరికతని బోలిన నాగరికతని భారతదేశంలో సజీవంగా చూడవచ్చునని భావించింది సావిత్రీదేవి. ప్రకృతిని ఈశ్వర స్వరూపంగా చూసే భారతీయ దృక్పథం ఆమెకి నచ్చింది. సావిత్రీదేవి జంతు ప్రేమికురాలు. జంతువులపై హింసాత్మక పరిశోధనలు చేస్తున్న సైన్సు సంస్థలపై దాడి కూడా చేసింది సావిత్రీదేవి. ఆశ్చర్యం ఏమిటంటే హిందుత్వ సృష్టికర్త సావర్కార్ భారతీయ గోపూజ, ఆలయాలు ఆచార వ్యవహారాలన్నిటినీ అసహ్యించుకున్నాడు. పూర్తి యూరోపీయ ఫాసిస్టు తరహాలో ఆలోచించాడు.

కానీ గ్రీకు జాతీయురాలైన సావిత్రీదేవి భారతీయ ఆచార వ్యవహారాలని అన్నిటినీ అభిమానించింది.

నిజానికి యింగ్లీషు వాళ్ళని పేగన్ భయం పెంటాడింది. తాము యిక్కడి సంస్కృతిలో లీనమైపోయి ముస్లింలు యవనులు యితర జాతుల్లా భారతీయ సంస్కృతిలో భాగమై

పోతామేమోనన్న ఫోబియా వెంటాడింది. అందుకే భారతీయులకి కుక్కలకి ప్రవేశం లేదు అని బోర్డులు పెట్టారు. గాంధీని తామున్న రైలుపెట్టె నుంచి నెట్టివేశారు. కారణం – భారతీయులని అవమానించడమే కాదు తాము వారితో కలిసి పోతామనే భయం.

భారత సంస్కృతిలో యీ సంలీనం చేసే లక్షణం ఎక్కువ. ఆ సంస్కృతి తనలో కలుపుకోలేనిదంటూ లేదు. ఇక్కడ ఇస్లాం దర్గా సంస్కృతిగా రూపాంతరం చెందలేదా?

బ్రిటీషు వాడు తాను యిక్కడి సంస్కృతిలో లీనమైపోతానని భయపడడమే కాదు, యిప్పటికే సమ్మిళితమైన జాతుల అస్తిత్వాలని అడ్డంగా చీల్చాడు. 1881లో జనాభా గణనలో హిందూ – ముస్లిం అస్తిత్వాలని డాక్యుమెంట్ పరంగా విభజించాడు. నిజానికి యిక్కడి అస్తిత్వాలు అనేక సాంకర్యాలతో విడదీయరానివిగా వుండేవి. బ్రిటీష్‌వాడు యిలా విభజించి సరిహద్దులు గీసి సంలీనం కాకుండా జాగ్రత్త పడ్డాడు.

నిజానికి బ్రిటీష్ వాడి యిండియన్ ఫోబియాకి చరిత్ర వుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో వ్యాపారాన్ని రాజ్యాన్నీ జమిలిగా విస్తరిస్తున్న కాలం. బ్రిటిష్ అధికారులు, ఉద్యోగులు భారతీయ పండగలలో ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొనేవారు. గుడులకి వెళ్లేవారు. నాట్యాలని, కళలని వీక్షించే వారు. క్రమేపీ యీ సంస్కృతులలో భాగం కావడం మొదలుపెట్టారు. ఒక బ్రిటీష్ అధికారి తన కూతురిని ఆలయ నర్తకిగా చేయడానికి కూడా సిద్ధపడ్డాడు.

ఇలా భారతీయ పేగన్ సంస్కృతిలో తమ జాతీయులు సంలీనమై పోతుండడం క్రిస్టియన్ మిషనరీలకి భయం పుట్టించింది. బ్రిటీష్ రాణికి తమ భయాన్ని లేఖాపూర్వకంగా తెలియచేశారు. భారతీయులతో ఇంగ్లీషు వారు దూరం పాటించాలని కోరారు. భారతీయుల ఆచార వ్యవహారాలకి ఆలయ నిర్వహణకి చట్టాలకి దూరంగా వుండాలని అన్నారు. లేకపోతే ఇంగ్లీషు వారు ఆకారంలోనే యింగ్లీషువారిగా ఆలోచనల్లో ఆచార వ్యవహారాల్లో పేగన్ భారతీయులుగా పతనం అవుతారని భయపడ్డారు.

అందుకే భారతీయ విశ్వాసాలని, చట్టాలని వేటినీ స్పృశించవద్దు అని, దూరం జరగమని బ్రిటీష్ రాణి ఆదేశించింది. అందుకే భారతీయ చట్టసభలు ఏర్పడ్డాక మాత్రమే సంస్కరణలు ప్రారంభించారు బ్రిటీష్ వారు. (రిపబ్లిక్ ఆఫ్ రెలిజియన్ – అభినవ చంద్రచూడ్)

యిలా భారతీయ సంస్కృతికి దూరం జరగడమే యిండియాలో సెక్యులరిజంగా భావించబడింది. తరువాత మెకాలే ఆకారంలో భారతీయులుగా వుండి మానసికంగా యింగ్లీషు క్రైస్తవులుగా వుండే తరాన్ని సృష్టించాలని భావించాడు. అందుకోసం విద్యా సంస్కరణలు తెచ్చాడు. పాశ్చాత్య విద్యయొక్క సుపుత్రుడే సావర్కార్.

సావర్కార్ భారతీయ వారసత్వ భావననే తిరస్కరించాడు. చిత్ పవన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సావర్కార్ పితృ కర్మకాండనే తిరస్కరించాడు. తన భార్య చనిపోతే తద్దినం పెట్టలేదు. తాను చనిపోయాక ఎటువంటి కర్మకాండ జరపవద్దని, అంబులెన్స్‌లో తీసుకువెళ్ళి ఎలక్ట్రిక్ మిషన్ ద్వారా ఆధునిక పద్ధతిలో దహనం చేయమన్నాడు. గోపూజని

పరిహసించాడు. గుడుల చుట్టూ ప్రదక్షిణ చేయడాన్ని వెటకారం చేశాడు. కుల నిర్మూలన చేసి ఆధునిక హిందూ జాతిని సృష్టించాలని పిలుపునిచ్చాడు. దానికి భౌగోళిక జాతీయతని ప్రాతిపదిక చేశాడు. ఈ జాతీయతా వాదం బ్రాహ్మణ సంస్కృతికి భారతీయ సంస్కృతికి పూర్తిగా ఎదురీదడమే.

యూరోపియన్ గ్రీకు దేశీయురాలైన సావిత్రీదేవి విచిత్రంగా భారతీయ సంస్కృతిని అన్నివిధాలా ఆరాధించింది. అక్కడితో ఆగితే మంచిదే. కానీ భారతీయ సంస్కృతి సంప్రదాయాలతో నాజీ ఫాసిజానికి పెళ్లిచేసింది. దాని ఫలితమే నేటి హిందుత్వ.

సావిత్రీదేవి కలకత్తాకి చెందిన ముఖర్జీ అనే బ్రాహ్మణుడిని పెళ్లి చేసుకుంది. అతడు హిట్లర్ నాజీయిజాన్ని సమర్థిస్తూ పత్రిక తెచ్చేవాడు. ఫాసిస్టులకి గూఢచారిగా పనిచేసింది. సంఘ్ పరివార్ సభ్యులతో స్నేహం చేసింది. ముస్లింలు యిక్కడి పేగన్ బహుళ సంస్కృతిని ఆర్యన్ కల్చర్ని నాశనం చేస్తారు కనుక వారిని ద్వేషించాలని హిందువులకి బోధించింది.

ఇటీవలి కాలంలో సావిత్రీదేవిని స్మరించిన వ్యక్తి బిజెపికి చెందిన మేనకాగాంధీ మాత్రమే. ఈమె కూడా జంతు ప్రేమికురాలు. అంటే జంతు ప్రేమ, భూత దయలని మానవ ద్వేషంగా మలచవచ్చునని సావిత్రీదేవి పంథా సూచిస్తుంది.

దీనిలో వింత ఏమీలేదు. శ్రీలంక, బర్మా బౌద్ధులు చేస్తున్నదేమిటి? మానవ హక్కుల మేధావి కన్నబీరన్ ఒకసారి బౌద్ధ భిక్షువుని ప్రశ్నించాడట – మీది అహింసా మార్గం అంటారు కదా, తమిళులపై దాడికి ఎందుకు పాల్పడతారు అని. "అహింసా సిద్ధాంతం బౌద్ధులకే పరిమితం" అన్నాడట ఆ బౌద్ధ సన్యాసి.

కనుక ఏ సిద్ధాంతమైనా స్వార్థ పూరిత సెక్టేరియనిజంగా మారే వీలు వుంది. దానికి కారణం – మనుషులలోని ఆదిమ తెగ సంస్కృతి, యితర తెగల పట్ల సందేహం ద్వేషాల యొక్క కొనసాగింపు కారణం కావచ్చు. ఆ తెగ మనస్తత్వానికి నేటి ఫాసిస్టు జాతీయవాదాన్ని జతకలిపితే పెద్ద ముప్పే పొంచి వుంటుంది.

భారతీయ సంస్కృతి ప్రకృతిలో ప్రతిదాన్నీ భాగంగా చూడడం వల్ల దానికి బాహిరము ఇతరము అనేది తాత్వికంగా అసాధ్యం. భారతీయ సంస్కృతిలో 'అదర్' (ఇతరం)ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించింది సావిత్రీదేవి. ఈవిడ తత్వాన్నే కొనసాగించింది హిందుత్వ.

గ్రీకు తత్వవేత్త ప్లేటో, భావాలకి ప్రతిబింబమే యీ ప్రపంచం అన్నాడు. అంటే ప్రపంచానికి బయట ఒక 'అదర్' వరల్డ్ ఇతరాన్ని సృష్టించాడు. అదే 'భావ' ప్రపంచం. క్రైస్తవం ఈ లోకానికి బయట పరలోకాన్ని దైవాన్ని నిలిపింది. రెండింటి మధ్య ఘర్షణ సృష్టించింది. ఈ లోకాన్ని లౌకిక వాంఛలని పాపంగానూ, దైవాన్ని పరిపూర్ణత గానూ ఎదురుబొదురుగా నిలిపింది. ప్రొటెస్టంటిజం (కాల్వినిజం) కొందరు దైవానికి అనుకూలురు, మరి కొందరు శాశ్వత శాపగ్రస్తులు వుంటారని, యిదంతా పూర్వ నిర్ధారితం (ప్రీడిటర్మిన్) అంది.

భారతీయ సంస్కృతిలో ప్రతిదీ ప్రాకృతికం. దేవుడు ప్రకృతితో విడదీయరాని వాడు. సోషల్ ఆర్డర్ అనదగిన కుల వ్యవస్థ కూడా ప్రకృతిలో అంతర్భాగం. అందువల్ల అంతరాలు

వుండవచ్చు కానీ 'అదర్' లేదు. అందువల్లనే ఈ ప్రాకృతిక తత్వంలో యిస్లాం భాగం కాగలిగింది. ముస్లింలు ఇతరులు కాదు.

కానీ సావిత్రీదేవి భారతీయ ప్రాకృతిక దృష్టిని మానవ కేంద్రకత లేకుండా సకల జీవరాశి దైవ స్వరూపం కావడాన్ని మెచ్చుకుంది కానీ ముస్లింలని శత్రువులుగా 'అదర్'గా నిలపడానికి ప్రయత్నించింది.

సావిత్రీదేవి పద్ధతి పాశ్చాత్య భారతీయ తత్వాలని కలిపే ప్రయత్నం. అదొక భ్రష్టతని సృష్టించింది. అదే హిందుత్వ.

దీనితో భారతీయ బహుళ సంస్కృతి మూలాలకి దెబ్బ తగిలింది. ప్రాకృతిక బహుళత్వంలో సర్వవ్యాప్తమైన ఏకం సత్ స్థానంలో మోనోపలీ నాజీ నియంతృత్వం యూనిఫార్మిటీని సృష్టించింది. యూనిటీ స్థానంలో యూనిఫార్మిటీ రాజ్యం చేయడం మొదలుపెట్టింది. ప్రాకృతిక ఐక్యతని రాజ్య నియంతృత్వ ఐక్యత ఆక్రమించింది.

భారతీయుడు బ్రాహ్మడు సావర్కార్ భారతీయ సంస్కృతిని మొత్తంగా తిరస్కరించాడు. హిట్లర్ జాతీయతా వాదాన్ని హిందూ జాతీయ వాదంగా దిగుమతి చేశాడు.

యూరోపియ స్త్రీ అయిన సావిత్రీదేవి ఫాసిజాన్ని భారతీయ సంస్కృతితో మేళవించడానికి కృషిచేసింది.

ఆధునిక కాలంలో భారతదేశానికి చుట్టుపక్కల దేశాలు చాలావరకు మతరాజ్యాలుగా ఆవిర్భవించాయి. కానీ భారతదేశం 'కొంతవరకు' భిన్నంగా నిలిచింది. డైరెక్ట్‌గా మతరాజ్యంగా మారలేదు.

బుద్ధిస్టు దేశాలైన బర్మా, శ్రీలంకలు బుద్ధిస్టు రాజ్యాలుగా వున్నాయి. పాకిస్తాన్, నేపాల్, భూటాన్.. అన్నీ మత రాజ్యాలే.

భారతదేశం మతరాజ్యం కాకపోవడానికి కారణం అసలు యిక్కడ ఆర్గనైజ్డ్ మతం ఆవిర్భవించక పోవడమే కారణం. బౌద్ధం యిప్పటికీ బలంగా వుంటే భారతదేశం ఎప్పుడో మతరాజ్యంగా మారిపోయేది.

భారతదేశంలో వున్న ఆచార వ్యవహారాలు పండగలు, దేవతలు చాలా వరకు ప్రాకృతికమైనవి. ప్రాకృతిక దృక్పథంలో భాగమైన కుల వ్యవస్థ కూడా స్టేట్ రెలిజియన్ ఆవిర్భావానికి అడ్డంకిగా నిలిచింది. శకల శకలాలుగా విడిపోయే కులాలు వ్యవస్థీకృత మతం ఆవిర్భావానికి అడ్డంకి. అటువంటి ఒక మతం లేనిది మతరాజ్యం ఎలా ఆవిర్భవిస్తుంది?

◆ ◆ ◆

కులం నుంచి మతంలోకి
పెనం నుంచి పొయ్యిలోకి

సిక్కులలో ముస్లింలలో వుండే సోదర భావం హిందువులలో అసాధ్యం. ఎందుకంటే కులాలు అటువంటి మతపర సోదర భావాన్ని అసాధ్యం చేస్తాయి అంటాడు అంబేద్కర్ (అనిహిలేషన్ ఆఫ్ కేస్ట్)

కుల ఐక్యతలాగే మత ఐక్యత కూడా సెక్టేరియన్, అది సర్వ సమానత్వం ఏమీ కాదు. మత పర సమానత్వం పెద్ద సమూహం ఆవిర్భావానికి కారణమౌతుంది. అలాగే ఆ సమూహాన్ని మరింత విస్తరించుకోవడానికి ఆస్కారం యిస్తుంది. అది మత జాతీయతకి దారితీస్తుంది. అంతేకానీ సంకుచితత్వానికి ఇతరుల పట్ల ద్వేషానికి అది ముగింపు ఏమీ కాదు.

నిజానికి అంబేద్కర్ కూడా అటువంటి సర్వ సమానత్వం గురించి మాట్లాడలేదు. జాతీయత గురించి మాట్లాడాడు. ముస్లిం జాతీయతలాగే హిందూ జాతీయత సాధ్యం కాకపోవడానికి చింతించాడు. దానికి కుల వ్యవస్థ కారణం అన్నాడు. ఈ హిందూ జాతీయతా దృష్టితోనే హిందువులు చరిత్రలో నిరంతరం ఓటమికి గురికావడానికి, హిందువులలోని కులపరమైన అనైక్యత కారణం అన్నాడు. ఆసియాలో ఒక జాతిగా రూపొందిన బౌద్ధ మతంలోకి మారాడు. అంబేద్కర్ కూడా హిందూ జాతీయ తర్కాన్నే ఆశ్రయించాడు. హిందూ జాతీయత అసాధ్యం అని అంబేద్కర్ అన్నాడు. సాధ్యమే అని హిందూ వాదులు అన్నారు. అంబేద్కర్ మరియు హిందూ వాదులు యిద్దరూ హిందూ జాతీయత, ఆవశ్యకతని గుర్తించారు.

ఆధునిక సమానత్వ భావన యిలా జాతీయ వాదంతో మిళితమైపోవడం నిజమైన సమానత్వానికి దారికాక పోవడమే కాదు రాజ్య నియంతృత్వానికి రహదారి. అలాగే బహుళత్వానికి ముప్పు.

ఎంతగా హిందూ జాతీయ వాద ముసుగులో ఫాసిజం చొచ్చుకు రావడానికి

ప్రయత్నించినా, అనేక మత రాజ్యాల మధ్య భారత దేశం 'మతాతీతం'గా నిలిచింది. కనీసం ప్రత్యక్షంగా రాజ్యంతో మతాన్ని ముడివేయడం సాధ్యం కాలేదు. రాజ్యాంగంలో సెక్యులర్ అనే పదాన్ని చేర్చవలసి వచ్చింది. దీనికి కారణం భారత ఖండంలో కులం వుంది కానీ మతం లేదు. కులం కూడా వ్యవస్థీకృతం కాదు. బ్రిటీషు వాళ్ళ డాక్యుమెంటేషన్ తర్వాతే కులం కూడా ఘనీభవించింది. ఈ డాక్యుమెంటేషన్ వివిధ అస్తిత్వాలు ఒక దానిలో మరొకటి కలిసిపోకుండా గోడకట్టింది. కృత్రిమ స్థిర అస్తిత్వాలని సృష్టించింది జనాభా గణన డాక్యుమెంటేషన్.

నిజానికి భారత సంస్కృతి నుంచి, పేగన్ కల్చర్ నుంచి దూరంగా వుండాలనే యింగ్లీషు వాడి పరాయీకరణ భావం నుంచి భారతదేశపు సెక్యులరిజం ఆవిర్భవించింది అంటాడు న్యాయవేత్త అభినవ చంద్రచూడ్ (రిపబ్లిక్ ఆఫ్ రెలిజియన్). నిజానికి యింగ్లండులో యిటీవల వరకు ప్రొటెస్టంటు మతరాజ్యమే కొనసాగింది.. ఇతర మతాలకి ప్రచార హక్కులేదు. దైవ నిందకి శిక్ష వుండేది. దైవనింద అంటే క్రైస్తవ నిందే. ఇతర మతాలకి ఈ చట్టం వర్తించదు.

యింతగా మతపరమైన సంస్కృతి నుంచి వచ్చిన ఆంగ్లేయులపై మిషనరీల పట్టు కొనసాగింది. అందువల్ల యిక్కడి ఇండియన్ కల్చర్స్ పట్ల దూరంగా వున్నారు. అంటే వాళ్ళని వారి వారి పర్సనల్ రెలిజియస్ చట్టాలకి వదిలిపెట్టారు. ఆ చట్టాలని గ్రంథాల అనువాదాల ద్వారా ప్రవేశపెట్టారు.

సంస్కృత ధర్మశాస్త్ర గ్రంథాలని అనువదించడం ద్వారా 'హిందూ లా'ని సృష్టించారు. ఇందుకోసం బ్రాహ్మణ పండితులపై ఆధారపడ్డారు. గ్రామాలు, గూడాలలోని మౌఖిక చట్టాలని పట్టించుకోలేదు. యిక్కడ '(గ్రంథం' పట్ల బ్రిటీష్ వారు ఆసక్తి కనబరచారు. వారు రెలిజియన్ ఆఫ్ బుక్‌కి చెందిన వారు మరి. (హిందూ సామ్రాజ్యవాద చరిత్ర – స్వామి ధర్మతీర్థ)

అయితే అంబేద్కర్ కూడా బ్రిటీష్ తర్కానికి లోబడి మనుస్మృతిని హిందూమతానికి పర్యాయపదంగా మార్చాడు. మనుస్మృతి దహనం హిందూమత దహనంగా భావించాడు. బ్రిటీష్ వారి ప్రభావం వల్ల సంస్కృతి, మతం, ధర్మాలకి గ్రంథం పర్యాయ పదంగా మారింది. మౌఖిక సంస్కృతులు గుర్తింపు కోల్పోయాయి.

దీనివల్ల సెక్యులరిజం పేరుతో పరోక్షంగా మత ప్రమేయం ప్రారంభమైంది. దళితుల్ని, గిరిజనుల్ని, అందర్నీహిందూ ఐడెంటిటీలో భాగం చేసింది రాజ్యాంగం. రిజర్వేషన్లు, ప్రత్యేక సౌకర్యాలు కులంతో కాదు మతంతో ముడివేయబడ్డాయి. హిందువులకే రిజర్వేషన్లు వర్తిస్తాయి.

దేశ విభజన వల్ల వచ్చిన అసమ్మతిని నిమ్మదింప చేయడం కోసం కావచ్చు స్వతంత్రానికి ముందు వున్న మతపర నియోజక వర్గాలని ముస్లింలు వదులుకున్నారు.

కానీ దళితులకి రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. ఈ రిజర్వేషన్ సౌకర్యం 'హిందూ' అస్తిత్వంతో ముడిపడింది. మతాంతరీకరణ చెందనంత వరకే రిజర్వేషన్ సౌకర్యం వర్తిస్తుంది.

అంబేద్కర్ బౌద్ధ మతం స్వీకరించడం ద్వారా తనతో పాటు మతాంతరీకరణ చెందే దళితులకి రిజర్వేషన్ సౌకర్యాన్ని తిరస్కరించినట్లైంది. నవ బౌద్ధులకి కూడా రిజర్వేషన్ సౌకర్యం వర్తించేలా కృషి చేస్తానని అంబేద్కర్ అన్నాడు.

అంబేద్కర్ మరణానంతరం బౌద్ధులకీ, సిక్కులకీ కూడా ఎస్సీ రిజర్వేషన్ ఉ ద్ధరించబడింది. అంటే హిందూ దళితులతో పాటు బౌద్ధ సిక్కు దళితులకీ రిజర్వేషన్ సౌకర్యం వర్తిస్తుంది. కానీ అతి పెద్ద మైనార్టీలైన ముస్లిం, క్రైస్తవ దళితులకి ఈ సౌకర్యం కల్పించబడలేదు.

బౌద్ధం స్థానికమూ హిందూ మతంతో పోలిక కలిగినది కావడం వల్ల అంబేద్కర్ ఆ మతంలోకి వెళ్ళాడు అని కొందరు వాదిస్తారు. దానిలో నిజం వున్నా లేకపోయినా ఫలితం మాత్రం 'హిందూ' ఐడెంటిటీ ఉద్ధరణకి ఉపయోగించింది.

అసలు హిందూ అంటే ఏమిటి? హిందూ మతం అంటే ఏమిటి? హిందువు అంటే ఎవరు? ఈ ప్రశ్నలకి 'హిందుత్వ' సృష్టికర్త సావర్కార్ యిచ్చిన నిర్వచనం చివరికి విజయం సాధించింది. ముఖ్యంగా ముస్లింలకి (కొంతవరకు క్రైస్తవులకి) భిన్నమైన వాళ్ళే హిందువులు. జైన బౌద్ధ సిక్కు మతస్తులు కూడా 'హిందూ' ఐడెంటిటీలో భాగమే. ఎందుకంటే వారి పుణ్యభూమి భారతమే.

అందుకే గుజరాత్ హిందూ ప్రభుత్వం ఇటీవల మతాంతరీకరణకి అనుమతించిన వారు బౌద్ధులు మాత్రమేనని ఆకార్ పటేల్ రాశారు. (మన హైందవ రాజ్యం – ఆకార్ పటేల్)

అంటే రాజ్యాంగం మత ప్రమేయం లేనిదిగా కనిపిస్తున్నా, మతం ముసుగులో రాజ్యంలోకి చొరబడి పోయింది.

బహుళత్వం, పేగనిజంలని ఆరాధిస్తున్నట్లు కనబడిన సావిత్రీదేవి 'ముస్లిం అదర్'ని సృష్టించింది. అలాగే బహుజన హితం పేరుతోనే ఏకశిలా సదృశ మత అస్తిత్వం (హిందుత్వ) బలపడ్తోంది.

కొందరు నన్ను అడుగుతుంటారు. ఇప్పటికీ బహు దేవతారాధన వుంది. బహుళ సంస్కృతులు ఉన్నాయి. సంస్కృతి మోనోపలికి దారితీస్తోంది అనే వాదనలో వాస్తవం ఎంత?

ఔను. అవన్నీ పైకి కనిపిస్తున్నాయి. కానీ అవన్నీ ఒకే మూసలోకి వొదిగిపోతున్నాయి. అదే హిందుత్వ.

ఒకే దేవుడు రాముడు, ఒకే పుణ్య స్థలం ప్రార్థనా స్థలం అయోధ్య. ఒకే గ్రంథం

భగవద్గీత, ఒకే పేరు హిందూ. యిలా క్రైస్తవ మోనోథీయిజపు అనుకరణ యెలాగూ వుంది. దానితో పాటు టెరిటరీ భౌగోళిక సరిహద్దులపైన ఆధారపడిన జాతీయతతో 'హిందూ' మతాన్ని ముడిపెట్టి, ముస్లింలని పక్కనబెట్టి యితరులందర్నీ గణించే ప్రక్రియ బహుళత్వాన్ని సావర్కార్ హిందుత్వగా మార్చేసింది.

దీని ఫలితమా అన్నట్లు యూపీలోనూ యితరత్రా చమర్ యితర జాటవులు లాంటి దళిత కమ్యూనిటీలు నవయానంతో పాటు హిందుత్వకి దగ్గర జరిగాయి. నిజానికి బాబ్రీ మసీదు స్థలం బౌద్ధులదేననే వాదన 'హిందుత్వ'లో భాగమే.

ఈవిధంగా సావర్కార్, సావిత్రీదేవిల భిన్నమార్గాల ఫాసిజాలు ఏకోన్ముఖంగా పయనిస్తున్నాయి. మనకి ఒకే మెజారిటీ మతం లేని లోటుని 'హిందుత్వ' ఫాసిజం పూరించవచ్చు. మన దేశం కూడా శ్రీలంకలా బర్మాలా మతరాజ్యంగా మారే ప్రమాదం వున్న మాట నిజం.

శ్రీలంకలో, బర్మాలో ఒక వ్యవస్థీకృత మతం వుంది. అది బౌద్ధం. అదృష్టవశాత్తూ అటువంటి వ్యవస్థీకృత మతం మన దేశం నుంచి ఎప్పుడో నిష్క్రమించింది.

కానీ కృత్రిమ ఏకీకరణ ద్వారా 'హిందూ' ఐడెంటిటీ సృష్టించబడింది. యిది హైబ్రిడ్ మొక్కలాంటిది. అయితే భారతదేశంలోని ప్రజలలో వున్న నిజమైన బహుళత్వం మతరాజ్యాన్ని నివారించగలదా, లేక పూర్తిగా విఫలమౌతుందా అనేదే ప్రశ్న.

గాంధీ హత్యానంతరం విడుదల చేసిన ప్రకటనలో గాడ్సే తనకి కుల పట్టింపులు లేవు అని చెప్పాడు. హిందుత్వ సృష్టికర్త సావర్కార్ కుల నిర్మూలనకి కృషి చేస్తానన్నాడు.

'కుల నిర్మూలన' పట్ల హిందూ వాదులకి చిత్తశుద్ధి వుందా లేదా అనేది వేరే ప్రశ్న. కుల అస్తిత్వాన్ని మతంతో ముడి వేయడంలో మన రాజ్యాంగ నిర్మాతలతో సహా అందరూ ముందున్నారు. ఒకడు దళితుడా కాదా అనేది అతడు 'హిందూ' మతస్తుడా కాదా అనేదానితో ముడిపెట్టారు. క్రమేపీ ముస్లిం, క్రైస్తవుడు కానివాడే దళితుడు. అంటే హిందువే దళితుడు. దళిత అస్తిత్వం పూర్తిగా హిందూ అస్తిత్వంతో అవిభాజ్యంగా మారిపోయింది.

మరే సామాజికవర్గ అస్తిత్వం యింతగా మతంతో ముడిపడి లేదు. ఒక బ్రాహ్మణుడు హిందువైనా క్రైస్తవుడైనా బ్రాహ్మణుడే. అలాగే రెడ్డి కూడా. కానీ ఒక ఎస్సీల ఎస్టీల అస్తిత్వం 'హిందూ'తో ముడిపడింది. రాజ్యాంగమే ఈ ప్రమాదాన్ని కల్పించింది.

అంటే దళితులు హిందువులు కాదు అని కొందరు మేధావులు మాట్లాడ్తారు. కానీ రాజ్యాంగం ప్రకారం దళిత అస్తిత్వం మాత్రమే హిందువు. దళితుడే హిందువు (అందుకే కావచ్చు గుజరాత్ హిందుత్వ వాదులు దళితులని మహా హిందువులు అన్నారు) యిలా ఒక పెద్ద ప్రజా సమూహం హిందూ ముద్ర కింద పడి నలిగిపోయే ప్రమాదం రాజ్యాంగంలోనే కల్పించబడినపుడు అంబేద్కర్ ఎందుకు నిరసన తెలపలేదు?

రాజ్యాంగంలో దళితులకి హిందూ మత అస్తిత్వాన్ని బలపరిచి, మనుస్మృతి దహనం వల్ల ఉపయోగం ఏమిటి? బహుశా మనుస్మృతి దహనం ద్వారా 'అవర్ణ'లైన దళితుల్ని హిందూ అస్తిత్వంలో భాగం చేశారా? రాజ్యాంగం చేసింది అదే కదా?

చివరికి నవ బౌద్ధం హిందూ అస్తిత్వంలోకి దారిని సుగమం చేసింది.

◆ ◆ ◆

భారతీయుల నేచురల్ రెలిజియన్

అహం బ్రహ్మాస్మి – నేనే సర్వవ్యాపకమైన పరమాత్మ స్వరూపుణ్ణి

తత్ త్వ మసి – ఆ పరమాత్మయే నీవు భగవంతుడు నీవు ఒకరే.

శివోహం – నేనే శివుడిని, నేనే భగవంతుణ్ణి.

రసోవై సః – భగవంతుడు రస స్వరూపుడు.

ఇటువంటి ఉపనిషత్ వేద వాక్యాలు ప్రకృతితో ప్రకృతి స్వరూపుడైన భగవంతుడితో అవినాభావ సంబంధాన్ని అభేదాన్ని స్థాపించాయి. ఇది నేచురల్ రెలిజియన్‌కి దారితీసింది. అంటే ప్రకృతికి మనిషికి మధ్య దూరాన్ని చెరిపేసింది.

భగవంతుడికీ మనిషికీ దూరాన్ని చెరిపేసింది. దైవం మానుష రూపేణ – దేవుడు మనిషి రూపంలోనే ప్రత్యక్షమవుతాడు. కాకపోతే జంతువు రూపంలో సాక్షాత్కరిస్తాడు మనిషి కూడా జంతువే. ద్విపాద పశువు అన్నారు. శివుడు పశుపతి. అంటే మనని కూడా పశువుల్లో చేర్చేశారు.

దేవుడితో ప్రకృతితో మనిషి తాదాత్మ్యం చెందడం వల్ల, మానవ ఉద్వేగాలు కూడా దైవస్తాయికి చేరాయి. పునరుత్పత్తికి మూలమైన శృంగారం భక్తి ఏకమయ్యాయి.

రకరకాల రంగులతో ఉద్వేగాలతో, పూనకాలతో నృత్య గానాలతో స్త్రీపురుష జంతు వృక్ష బహుళ రూపాలతో విలసిల్లే ఇండియన్ నేచురల్ రెలిజియన్ యూరోపియన్లని కూడా తాదాత్మ్య స్థితికి తీసుకువెళ్ళింది. దానితో పేగన్ సంస్కృతి తమలో కలిపేసుకొంటుందని వాళ్ళు భయపడ్డారు. మిషనరీలు హెచ్చరికలు జారీచేశారు.

ఈ తాదాత్మీకరణకి గురిచేసే భారతీయ సంస్కృతితో దూరం జరగడమే ఆధునిక భారత చరిత్ర. అది వలసవాదం మనకిచ్చిన శాపం. వరంగా భ్రమించే శాపం.

ప్రకృతినీ దేవుడినీ వేరుచేసి, దేవుడిని సృష్టికర్తగా మాత్రమే కాదు ప్రకృతిపై మనిషిపై జడ్జిగా నిలిపే మతం నుంచి పాశ్చాత్యం ఎదిగింది. మనిషిపై దేవుడిని ప్రకృతిపై మనిషిని నిలిపారు. ప్రకృతిపై తీర్పరి మనిషి. ఈ భావజాలం నుంచే ప్రకృతిని పూర్తి అబ్జెక్టివ్

పరిశీలించే సైన్స్ ఎదిగింది. (క్వాంటం ఫిజిక్స్ దీనికి ఒక కుదుపు)

ఇదే పద్ధతిలో వివిధ సమాజాలని పూర్తి విడిగా నిలబడి పరిశీలించవచ్చునని, వర్గీకరించవచ్చని, హెచ్చుతగ్గులలో పేర్చవచ్చని యూరోపియన్లు భావించారు. భావాలని వస్తువులని పూర్తిగా వేరుపరచి వస్తు జగత్తుపై భావాలని నిలిపే గ్రీకు తాత్వికుడు ప్లేటోలోనే దీనికి మూలం వుంది.

ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద వుండెను అని బైబిల్. కానీ మనకి వాక్యం కాదు స్వర ప్రధానమైన శబ్దం ప్రధానం, అది అనాది, అపౌరుషేయం. ఎవరూ దానిని సృష్టించలేదు. ప్రకృతిలోని శబ్దం, స్వరం, లయ యివే ప్రధానం. ఇది 'లోగో సెంట్రిజం' కాదు.

భాష కాదు భాషకి మూలమైన శబ్దం ప్రధానం వేదమంత్రాల ఉచ్చారణని కప్పల అరుపుతో పోల్చింది రుగ్వేదం. ఇది హాస్యం కాదు, వాస్తవం.

ప్రముఖ డచ్ యిండాలజిస్ట్ ఫ్రిట్స్ స్టాల్ వేదమంత్రాల ఉచ్చారణకి పక్షుల అరుపులకీ మధ్యన ఉన్న పోలికలని అధ్యయనం చేశారు. అందుకే ఫ్రిట్స్ స్టాల్ 'వేదాస్' గ్రంథంలో 'మీనింగ్ లెస్ నెస్ ఆఫ్ మంత్రాస్' అనే ఒక అధ్యాయం రాశారు.

స్వరం తప్పితే నరక ప్రాప్తి తప్పదు అని ప్రాచీనులు హెచ్చరించారు. స్వరం మారడం వల్ల అర్థం కూడా మారిపోతుంది అన్నారు. అంటే శబ్దం గ్రంథంలో వుండదు. మానవ కంఠనాళాలలోనూ మొత్తం మానవ శరీరంలోనూ వుంటుంది. నిజానికి కేవలం దేహంలోనే కాదు 'శబ్ద గుణక మాకాశం' శబ్దం అనేది ఆకాశం – స్పేస్ అనేది అంతా ఆక్రమించి వుంటుంది. అది మానవ సృష్టి కాదు, దైవ సృష్టి కాదు. సృష్టి అంతా ప్రకృతి అంతా వ్యాప్తమై వున్నది.

శబ్దం స్వతః ప్రమాణం ప్రకృతిలాగే. శబ్దార్థాలు పార్వతీ పరమేశ్వరుల వలే కలగలసి పోయి వుంటాయని మహాకవి కాళిదాసు. కాళిదాసు పేరులో కూడా స్త్రీ కలిసిపోయిలేదూ?

అంటే సెర్చ్ ఫర్ మీనింగ్ అనేది భారతదేశంలో లేదు. ఎందుకంటే అర్థం శబ్దం వేరు కాదు, దేవుడు ప్రకృతి వేరు కాదు. అలా పూర్తిగా వేరుగా వున్నచోట మాత్రమే 'దైవం' ఉంది అనికాని, ప్రపంచానికి అర్థాన్ని లక్ష్యాన్ని కమాండ్మెంట్స్‌ని యిస్తున్నాడు అనడం కుదురుతుంది. అలాగే దేవుడు మరణించడం కూడా అక్కడే.

దేవుడి స్థానం కదిలిపోయే కొలదీ, భాషకి యివ్వబడిన స్థిరమైన స్థానం కదలబారింది పాశ్చాత్యంలో. భాషలోని లాజికల్ నిర్మాణాలని కనుగొనడానికి తత్వవేత్త బెట్రాండ్ రస్సెల్ చేసిన ప్రయత్నాన్ని తుత్తునియలు చేశాడు తత్వవేత్త విట్జన్ స్టైన్. అలాగే కొన్ని సంకేతాలు మనిషి బుర్రలోనే వుంటాయి అని, వాటి ఆధారంగా భాషా వ్యవహారం సాధ్యమనే ఒక ప్రముఖ ధియాలజిస్టు వాదనని కూడా నిరాకరించాడు విట్జన్ స్టైన్.

భాష వ్యవహార సమయంలోనే అర్థాన్ని సంతరించుకొంటోంది. ఒక సాంస్కృతిక సందర్భంలో, చారిత్రక సందర్భంలో ఒకపదానికి ఒక అర్థం సిద్ధిస్తోంది.

అంటే మానవ వ్యవహారమూ, సంస్కృతీ భాషతో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. అంటే భాషకి అర్థం పూర్వసిద్ధం (ప్రీడిటర్మిన్) కాదు. అది మనిషి బుర్రలో లేదు, దేవుడి బుర్రలో కూడా లేదు. దేవుడు దగ్గర కాని ఒక గ్రంథంలో కానీ భాష లేదు.

భాష అనేది ఒక ప్రత్యేక చారిత్రక సందర్భంలో ఒక ప్రత్యేక సంస్కృతిలో, ఒక ప్రత్యేక వాడుకలో అర్థాన్ని సంతరించుకొంటోంది. దీనితో దేవుడూ, తార్కిక నిర్మాణమూ కూడా మరణించాయి.

భారత ఖండంలోని ప్రాకృతిక సంస్కృతిలో భాష కాదు శబ్దం ప్రధానం. శబ్దం ఎప్పటికీ అర్థాన్ని సంతరించుకోకపోవచ్చు. అర్థం అంటే వాచ్యత, అర్థం అంటే వివరణ, వాటి అవసరం శబ్దానికి లేదు. శబ్దం స్వర ప్రధానం. కొన్ని సంగీత రాగాలకి దీపాలు వెలిగాయని, వర్షాలు పడ్డాయని ప్రతీతి.

వాక్కు (శబ్దం) అంటే కేవలం వ్యక్తమైనది మాత్రమే కాదు, అవ్యక్తంగా వున్నది కూడా. వ్యక్తమయ్యేది వైఖరీ వాక్కు మాత్రమే. పరా వాక్కు ఎప్పటికీ వ్యక్తం కాదు.

చీమల జంతువుల భాషలు తెలిసిన వ్యక్తుల కథలు పురాణ జానపదాల్లో కనిపిస్తాయి. పురాణ ఇతిహాసాలలో జంతువులు కూడా గొప్ప వ్యాకరణ బద్ధంగా మాట్లాడ్తాయి. కపి వీరుడైన హనుమంతుడు గొప్ప శబ్ద శుద్ధి గలవాడు. భాష మాత్రమే కమ్యూనికేషన్ – వ్యవహార సాధనం కాదు. భాష అనేది శబ్దం యొక్క అధమ వ్యక్తీకరణ మాత్రమే.

అందుకే అర్థం అనేది మహాత్ముల వాక్కులని అనుసరిస్తుంది అంటాడు భవభూతి. అర్థం ప్రధానం కాదు, అర్థం ద్వితీయం.

చరిత్ర, సంస్కృతి, భాషా వ్యవహారమూ భాషకి అర్థాన్ని కల్పిస్తుందని తత్వవేత్త విట్జన్ స్టైన్ అన్న మాటని ఫ్రాయిడ్ దెబ్బకొట్టాడు. మానసిక వ్యాధిగ్రస్తుల మాటల్లో, కలల్లో, తొట్రుపాటుతో కూడిన వ్యవహారంలో అసలు అర్థం కోసం వెతికాడు. అంటే భాష అర్థాన్ని యివ్వడం లేదు, అర్థాన్ని చెదరగొడ్తోంది అన్నాడు. అసలుఅర్థం కోసం భాష బయటికి తొంగిచూశాడు.

నిజానికి భాషని తార్కికంగా హేతుబద్ధ నిర్మాణంగా భావించి నిరూపించడానికి ప్రయత్నించిన బెట్రాండ్ రస్సెల్ మనవరాలు మానసిక వ్యాధితో బాధపడి చనిపోయింది. భాషా వ్యవహారంలో అర్థాన్ని వెతికిన విట్జన్ స్టైన్ సోదరులు యిద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

ఫ్రాయిడ్ యీ మానసిక వ్యాధులలో డిప్రెషన్లలో చెదిరిపోయిన భాషలో అర్థం కోసం వెతికాడు. సృష్టికర్తయైన దేవుడు, అతని ఆజ్ఞలు, సృష్టిలో ఉన్నత స్థానంలో

జీవులన్నిటి పైన దేవుడు నిలిపిన మానవుడు.. వీరిలో కాదు, మానవుడి భ్రష్టత్వంలో అతని ఉన్మాదంలో అర్థాన్ని అన్వేషించుకోవలసిన స్థితికి పాశ్చాత్యం నెట్టబడింది. దీనికి కారణం ఏమిటి?

నేను ఆలోచిస్తున్నాను కనుక ఉన్నాను అని తత్వవేత్త డెకార్టె అన్నాడు. అంటే మరణించిన దైవం స్థానంలో, డివైన్ ఆర్డర్ స్థానంలో ఆలోచనని నిలిపాడు. నీవు ఉ న్నావు అని అర్థం చేసుకోవడానికి ఆలోచనే ఆధారం. మరి ఆలోచన సరైనది అనడానికి ఆధారం ఏమిటి? నిజంగానే ఆలోచన ప్రకృతిని ప్రతిబింబిస్తోంది అనడానికి కొలమానం ఏమిటి? ఏదీ లేదు. కాస్మిక్ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అంటాడు – మన సిద్ధాంతాలకి సరిపోయే వాస్తవం అంటూ ఏదీ ఎప్పటికీ దొరకదు అని.

ఆలోచన సరైనది, వాస్తవికమైనది అనడానికి ఆధారం, కొలమానం, ప్రమాణం ఏదీ లేదు అందుకే తత్వవేత్త జిజక్ అంటాడు ఆలోచన అంటే ఉన్మాదం నుంచి పలాయనం (లెస్ దేన్ నథింగ్)

ఆలోచనకి వుండే స్వతంత్ర సత్తా హేతుబద్ధత ఆధునిక విశ్వాసం మాత్రమే. పునాదులు లేని విశ్వాసం. ఫ్రాయిడియన్ తత్వవేత్త లకాన్ సింబాలిక్ ఆర్డర్ మానవుణ్ణి నడిపిస్తోంది అంటాడు. కానీ ఆ సింబాలిక్ ఆర్డర్ చెదిరిపోతే? మన ముఖాన్ని గుర్తుపట్టడం మనకే కుదరదు.

నా జీవితంలో జరిగిన ఒక సంఘటనని చెప్తాను. ఒకసారి విజయవాడ నుంచి అమలాపురం వరకు ప్రయాణం చేసి, బస్సుదిగి ఒక వ్యక్తిని అడిగాను "మీరెవరో పరిచిత వ్యక్తిలా వున్నారు. మీరెవరు?" "నేను యింతవరకూ మీ పక్క సీట్లో కూర్చొని మీతో మాట్లాడ్తూ వచ్చిన వ్యక్తినే"

అంటే అతన్ని నేను ఎందుకు గుర్తించలేకపోయాను. నాకు మందమరుపు అని మీరు ఆరోపిస్తారు అనుకుంటా కానీ శంకరాచార్యులు అన్నది ఏమిటి?

కాతే కాంతా కస్తే పుత్రః

సంసారోయమతీవ విచిత్రః

భార్య ఎవరు, కొడుకు ఎవరు ప్రపంచం చాలా విచిత్రమైనది.

ఒక స్మృతి పరంపర, అది కల్పించిన నామరూపాలు యీ ప్రపంచం అర్థమవుతున్న భ్రమని కల్పిస్తున్నాయి. వివిధ దృశ్యాల మధ్య సంబంధాన్ని కల్పిస్తున్నాయి. కానీ యీ కల్పన చెదిరిపోయే అవకాశం ఎక్కువ.

నిజానికి భాషలో వ్యవహారంలో మనం ఉద్దేశించినది మిస్ అవుతుండడం వల్లే మనిషి ఆల్కహాలికుడు అవుతున్నాడు. తన ఉన్మాద స్థితిలోకి దూకి తన ఉనికిని వెతుక్కుంటున్నాడు. అంటే ఆలోచన నుంచి పలాయనం చిత్తగించి ఉనికిని వెతుక్కుంటున్నాడు.

అందువల్ల ఆలోచన కాదు, ఉన్మాదమే ఉనికి. నాకు పిచ్చెక్కింది కనుక నేను ఉన్నాను అనేది సరైన వాక్యం అంటే భాష ప్రకృతి నుంచి మనిషిని దూరం చేస్తోంది. సంగీతం, స్వరం, శబ్దం ప్రకృతికి దగ్గర.

అందుకే మిత్రుడు తాత్వికుడు నరహరి ఒకసారి మందు బాటిల్ పైకెత్తి అరిచాడు "అర్థానికి తలుపులు మూసెయ్ లేకపోతే నిన్ను చంపేస్తాను"

బాల ఉన్మత్త పిశాచవత్ ఉండేవాడే జ్ఞాని. ఇలా ఆలోచన, దేవుడు, తర్కము పాశ్చాత్యంలో చెదిరిపోవడం మొదలైనపుడే, పాశ్చాత్యుల పాత టెక్నాలజీని మనం అరువు తెచ్చుకున్నట్లే వారు వదిలేసిన భావాలని యిక్కడ పునరుజ్జీవింప జేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. పాశ్చాత్యం యాంటీ క్రైస్ట్ వైపు పయనిస్తుంటే, భారతీయులు క్రైస్తవాన్ని బోలిన మతం కోసం అన్వేషణ మొదలుపెట్టారు. పాశ్చాత్యాన్ని అమెరికనిజాన్ని ఇండియాలో పునరుజ్జీవింప చేయడానికి ప్రయత్నం మొదలుపెట్టారు.

దీనికి చెప్పుకోదగిన ఉదాహరణ ఆర్య సమాజ్‌కి చెందిన దయానంద సరస్వతి.

ప్రపంచానికి ఒక అర్థం, అర్థమనదగిన దేవుడులని రద్దుపరచుకుంటూ వస్తోంది పాశ్చాత్యం. వారి సైంటిఫిక్ దృక్పథం కూడా భూకేంద్రక మానవ కేంద్రక దృష్టికి దెబ్బ కొట్టడంతో క్రైస్తవం కల్పించిన అర్థం చెదిరిపోయింది. యింక క్వాంటం ఫిజిక్స్ ద్రష్టకీ దృశ్యానికీ మధ్య దూరాన్ని చెరిపేయడంతో సృష్టికర్తపైన ద్రష్టపైన, కర్త ద్రష్ట తీసుకువచ్చిన ఆబ్జక్టివిటీపైన తిరుగులేని దెబ్బపడింది.

కానీ భారత సంస్కృతి ఒక దేవుడిని అర్థాన్ని కనుగొనడం కోసం కొత్త అన్వేషణ మొదలుపెట్టింది. సృష్టికర్తని కొత్తగా ఆవిష్కరించడం కోసం ప్రయత్నం మొదలుపెట్టింది. క్రైస్తవ మిషనరీలు భారతీయులని పూర్తిగా మతాంతరీకరించలేక పోయారు. కానీ వారి దృష్టి, దృక్పథం భారతీయులని ఆక్రమించడం మొదలుపెట్టింది. పాశ్చాత్యంలో దైవం కోసం అర్థం కోసం వారి అన్వేషణ విఫలమైంది, చావుదెబ్బ తింది. కానీ అక్కడ మరణించిన దేవుడిని యిక్కడ భారతఖండంలో పునరుజ్జీవింపచేసే ప్రయత్నం కొంతవరకు సఫలమైంది. భారతఖండంలో దైవం కోసం అర్థం కోసం థియాలజీ కోసం అన్వేషణ మొదలైంది. ఆ పనిని భారతీయులే భుజానికెత్తుకున్నారు. పాశ్చాత్య క్రైస్తవులని అనుకరిస్తూ..

◆ ◆ ◆

భారతీయుల మహామతం పుట్టుక

దయానంద సరస్వతి ఆర్యసమాజ్ అనే సంస్థ స్థాపించాడు. ఆర్య శబ్దాన్ని బౌద్ధుల నుంచి బ్రాహ్మణుల వరకు ఉపయోగించారు కాని యిలా ఆ పదం పేరుతో ఒక సంస్థ, నిర్మాణం ప్రారంభం కావడం పూర్తిగా కొత్త. పాశ్చాత్య ఫాసిస్టులు రేసిస్ట్ దృక్పథంతో ఆధునిక కాలంలో ఈ పదానికి ప్రాచుర్యం తెచ్చారు. ఆర్య శబ్దాన్ని జాతి వాచకంగా మార్చారు. దయానంద సరస్వతి కూడా జాతి వాచకంగానే వాడాడు. భారతదేశం ఆర్యుల భూమి అంటూ, పాత నిబంధనలోని దేవుడిచే ఎన్నుకోబడిన ప్రజలు అనే దృక్పథాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టాడు. యిదే హిందుత్వ వాదానికి మూలం.

ఒకే దేవుడు, ఒకే గ్రంథం అనే కాన్సెప్ట్‌ని కొత్తగా ప్రవేశపెట్టాడు. వేదమే ఆ గ్రంథం. ఉపనిషత్తుల దగ్గర నుంచి పురాణాల వరకు వాఙ్మయమంతా తిరస్కరించబడింది. వేద ప్రామాణ్యాన్ని ఇలా 'ఒకే గ్రంథం' అనే క్రైస్తవ ప్రొటెస్టంట్ దృక్పథంలోకి కుదించాడు. బ్రాహ్మణులని క్రైస్తవ పోపులతో పోల్చి నిరాకరించాడు. ఇది కేథలిక్కులపై ప్రొటెస్టంట్ల దాడిని తలపిస్తుంది.

పురాణాలని పురాణ కథలని 'హేతువాదం'తో తిరస్కరించాడు. ప్రసాదాన్ని ఎలుక తింటుంటే రక్షించుకోలేని దేవుడు దేవుడెట్లా అవుతాడు అనే ప్రశ్న ఉదయించి, విగ్రహారాధనపైన నమ్మకం సన్నగిల్లింది అని చెప్పుకొన్నాడు. పురాణాలలో శృంగారం వంటి మానవ భావోద్వేగాలకి స్థానం వుండడం కూడా అతనికి చిరాకు తెప్పించింది. వాటిని అసభ్యం అంటూ తిరస్కరించాడు. రాసక్రీడల శ్రీకృష్ణుడిని తీవ్రంగా నిందించాడు దయానంద సరస్వతి.

దయానంద సరస్వతి తన సత్యార్థ ప్రకాశ గ్రంథంలో దేవీదేవతలపై చేసిన నిందలు వెటకారాలు వంటివి నేటి దళితవాదులకీ హేతువాదులకీ కూడా సాధ్యం కావు. ఆవిధంగా ప్రకృతిలో భాగమైన దేవీ దేవతలని నిరాకరించి ఒకే ఒక యెహోవాని పోలిన నిర్గుణ దైవాన్ని నిలిపాడు దయానంద సరస్వతి.

అద్వైత విశిష్టాద్వైతాది సకల భారతీయ తాత్విక పరంపరని మూలమట్టంగా తిరస్కరించాడు దయానంద సరస్వతి.

దయానంద చేసిన అతి ముఖ్యమైన సంస్కరణ మత స్వీకరణ అనే కొత్త క్రైస్తవ పద్ధతిని ప్రవేశపెట్టడం, బాప్తిజంలా అటువంటి రిచ్యువల్‌ని ప్రవేశపెట్టడం. ఈనాడు హిందుత్వ ఘర్ వాపసీకి మూలం అదే.

జన సామాన్యంలో ఉన్న ఒక ప్రాకృతిక మతం స్థానంలో వ్యవస్థీకృత మతాన్ని ప్రవేశపెట్టాడు దయానంద. మనుషుల మధ్య ప్రకృతిలో భాగంగా ప్రకృతి స్వరూపంగా వుండి, ప్రాకృతిక లక్షణాలు మానవ లక్షణాలు ఉద్వేగాలు గల దేవీ దేవతల స్థానంలో ఒక ప్రభువైన దేవుడిని నిలిపాడు. ఒక హేతుబద్ధుడైన దేవుడిని నిలిపాడు.

కార్య కారణాలకి అభేదం చెప్పడం ద్వారా, ప్రకృతికి సృష్టికి అతీతమైన ఒక ట్రాన్సెండెంటల్ గాడ్‌ని నిరాకరించిన భూమి మీద ట్రాన్సెండెంటల్ గాడ్‌ని నిలిపాడు దయానంద సరస్వతి. తద్వారా దైవమనే లక్ష్యాన్ని గమ్యాన్ని అర్థాన్ని కల్పించాడు. పాశ్చాత్యంలో చెదిరిపోయిన అర్థం, దైవం భారత భూమి మీద కాళ్లూనింది. దీనియొక్క అధమ వ్యక్తీకరణే అయోధ్య ఉద్యమం.

దయానంద సరస్వతి దృక్పథాన్ని కొనసాగిస్తూ జరూసలేంలా ఒకే పవిత్ర స్థలాన్ని ఒక దైవ భూమిని, ఒకే ప్రభువైన దేవుడిని నిలపడం కోసం ప్రయత్నం నుంచే బాబ్రీ మసీదు విధ్వంసం, రామజన్మభూమి ఆవిర్భవించాయి.

వేదం పేరుతో పురాణాలని ధ్వంసం చేశాడు దయానంద. పురాణాన్ని ఇతిహాసాన్ని చారిత్రక శిథిలంగా ఘనీభవింపచేశారు హిందూవాదులు. అర్థంలేని చోట అర్థాన్ని, కార్యకారణ సంబంధంలోకి యిమిడిపోయే దైవంలేని చోట అటువంటి దైవాన్ని కనుగొన్నారు. భారతీయ బహుళ సంస్కృతిని ఫాసిజంతో ముడిపెట్టాలన్న సావిత్రీదేవి లక్ష్యం కూడా దీనితో నెరవేరింది.

దయానంద సరస్వతి పురాణాలని పురాణ పాత్రలని ఎకసక్కెం చేశాడు. తిరస్కరించాడు. కానీ ప్రముఖ సోషలిస్టు రామ్ మనోహర్ లోహియా చారిత్రక పాత్రలకన్న పురాణ పాత్రలు ప్రభావశీలమైనవి అన్నారు.

హిందుత్వవాదులు పురాణ పాత్రలని చారిత్రక పాత్రలుగా దిగజార్చారు. తద్వారా పురాణ పాత్రల ప్రభావంపై దెబ్బకొట్టారు. అయోధ్యలో రాముడు జన్మించాడు అనే దానికి బాబ్రీ మసీదు కింద దొరికే చారిత్రక శిథిలాలే ఆధారం అన్నారు. యిటువంటి తర్కం పూర్తిగా ఆధునికం, పాశ్చాత్య క్రైస్తవం.

అంటే దయానంద సరస్వతి పూర్తిగా పురాణాలని తిరస్కరించడం ద్వారా ఇండియన్ 'పేగన్ కల్చర్'పై దెబ్బకొట్టాడు. హిందుత్వ వాదులు తెలివిగా పురాణ ప్రభావాన్ని తొలగించడం కోసం పౌరాణిక దృష్టిని బలహీనపరచి చారిత్రక దృష్టిని ప్రవేశపెట్టారు.

పౌరాణిక దృష్టి రాముడిని సర్వాంతర్యామిగా నిరూపిస్తోంది. యోగినాం హృదయేషు రమతీతి రామః హృదయంలో నివసించే వాడే భగవంతుడు. భగవంతుని స్థానం హృదయం. ఈ హృదయంలోని భగవంతుని సాక్షాత్కరించుకోవడం కోసం సాధనమే ఆలయం. అసలు ఆలయం దేహమే అందుకే తెలుగు వాళ్ళకి అయోధ్య కాదు భద్రాచలమే రామక్షేత్రం. రామదాసు కీర్తనలలో అయోధ్య పేరు కనబడదు.

క్రైస్తవుల సంగతి వేరు. వారికి ఒకటే జరూసలేం. సర్వాంతర్యామియైన రాముడి స్థల కాలాలని కుదించి చారిత్రీకరించడమే హిందూ వాదులు చేస్తున్న అపచారం. పౌరాణిక సంస్కృతిపై దయానంద సరస్వతి డైరెక్టుగా దెబ్బకొడితే హిందూ వాదులు పరోక్షంగా దెబ్బతీశారు.

పురాణ ఇతిహాసాలు వేదమును వైదిక దృక్పథాన్ని చేరుకోవడానికి మార్గంగా భావించబడ్డాయి. వేదం అంటే ఏమిటి? వేదసారం నాసదీయ సూక్తం ద్వారా స్పష్టమౌతుంది. ఈ సృష్టి ఎవరి వల్ల జరిగింది? ఈ సృష్టికర్త ఎవరు అనే ప్రశ్న పూర్తిగా తప్పు అని స్పష్టం చేసింది నాసదీయ సూక్తం.

అది అడగరాని ప్రశ్న. కొన్ని ప్రశ్నలు అడగరాదు. అడిగినా మౌనం వహించాలి. బుద్ధుడు అవ్యాకరణీయ ప్రశ్నలు అడగకూడని ప్రశ్నలలో దేవుడు, సృష్టి కర్తని చేర్చాడు.

సృష్టికర్తని ప్రత్యక్షంగా చూడాలంటే సృష్టికర్తకి ముందు ఎవరో ఒకరు వుండాలి. అయితే దేవతలని అడగవచ్చు కదా? ఏదైనా ఉనికిలోకి వచ్చాకే దేవతలు వచ్చారు. ఉనికి అనేది సంభవించాకే దేవతల ఉనికి కూడా సాధ్యం. ఏదీ ఉనికిలో లేనపుడు దేవతలు కూడా ఉనికిలో వుండరు. అంటే మనకు కానరాని దేవతలు వుంటే, వాళ్ళు కూడా సృష్టి మొదలయ్యాకే వునికిలోకి వచ్చారు అని చెప్పవలసి వస్తుంది. అప్పుడు వాళ్ళని ప్రశ్నించి మాత్రం ఏమి లాభం?

మనకి కానరానివి చాలా వున్నాయి. సూక్ష్మక్రిములు కూడా మనకి కానరావు. వాటిని ప్రశ్నించి ఏదైనా లాభం వుందా? దేవతలను ప్రశ్నించడం కూడా అలాంటిదే. అందుకే దేవతలని ప్రశ్నించి కూడా లాభం లేదు అని రుగ్వేదంలోని నాసదీయ సూక్తం చెప్పింది.

పురాణాలు బ్రహ్మ జీవితానికి కూడా కాలపరిమితి వుంది అంటాయి. బ్రహ్మ కోట్ల సంవత్సరాలు జీవిస్తాడు. కానీ అతనికి కూడా అంతం వుంది. ఎందుకంటే పుట్టినది ప్రతీదీ నశిస్తుంది. దోమ ఒకరోజులోనే చచ్చిపోవచ్చు, మనిషి వంద సంవత్సరాలు బతకచ్చు, కొన్ని చెట్లు వేల సంవత్సరాలు బతకచ్చు. కానీ చావు తప్పదు. అంతం తప్పదు. మృత్యువు అనివార్యం.

సైన్సు పరిశోధనలు సఫలమై మనిషి వృద్ధాప్యాన్ని నియంత్రించి వేల సంవత్సరాలు

బతకచ్చు అప్పటికీ చావుతప్పదు. పుట్టిన ప్రతిదీ నశించక తప్పదు అనే లాజిక్‌ని పూర్తిగా అతిక్రమించ వచ్చునని ఏ సైంటిస్టూ ఏ తత్వవేత్త సిద్ధాంతీకరించలేదు.

మరి అమరత్వం అంటే ఏమిటి? అమర వీరులు లాంటి పదాలని నాస్తికులు కూడా ఎలా వాడుతున్నారు? ఏమాత్రం హేతుబద్ధం కాని అమరత్వం అనే పదం భాషలోకి ఎలా వచ్చింది?

పుట్టిన వాడికి మరణం తప్పదు, మరణించిన వాడికి పునర్జన్మ తప్పదు. కనుక చనిపోయిన వారి గురించి ఏడవడం అనవసరం అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. పునర్జన్మ ప్రత్యక్షం కాదు. పక్కనబెడదాం. మరణం తప్పదు కదా? మరి అమరత్వం ఏమిటి? దాని అర్థం ఏమిటి?

పుట్టుకని అపహాస్యం చేసేదే మరణం. మరణం అనేది వున్నపుడు పుట్టుకకు, పెరగడానికి, ఉనికికి అసలు అర్థం ఏమిటి? అసలు ఉండడం అంటే ఏమిటి? కొన్ని స్మృతుల సమాహారం.

నేను ఉన్నాను, నా పేరు రాణి శివశంకరశర్మ, నా తల్లిదండ్రులు వీళ్ళు... యిలా ఎన్నో స్మృతుల (జ్ఞాపకాల) పుట్టని నేను. పుట్ట పగిలిపోయాక పుట్టకి అర్థం ఏమిటి? ఆ జ్ఞాపకాల పుట్ట ఎప్పుడైనా అసలు ఉండేది అసడానికి రుజువు ఏమిటి?

ఫ్రెంచి తత్వవేత్త లకాన్ అంటాడు మనిషి మొదట అద్దంలో పెద్దవాళ్ళు చూపిన ప్రతిబింబం ద్వారా తన ఉనికిని ఒక ఇమేజ్‌గా యిమేజనరీ (ఊహ)గా తనలో ప్రతిష్టించుకున్నాడు. అదే 'నేను'కి మొదలు. తర్వాత సింబాలిక్ ఆర్డర్ మొదలౌతుంది. అంటే సమాజంలో ఒక వ్యక్తి స్థానాన్ని నిర్ణయించే సంకేతాల వ్యవస్థ. అంటే ఉనికి అనేది కల్పితం. భాషా కల్పితం. అయితే భాషలేని పిల్లి ఎలుకని గుర్తించగలదా? మనిషి గుర్తించే విధానం వంటిది జంతువులకి వుండదు. బహుశా ఆకలి వేయడం వల్ల వచ్చే ఒక మూమెంట్ ఒక కదలిక మాత్రమే పిల్లికి తెలుసు. ఎలుక అనేదేదీ పిల్లికి తెలీదు. పిల్లి ఎలుకని పట్టడం అనేది మానవులకి మాత్రమే చెందినది. ఎందుకంటే వాళ్ళకి భాష వుంది. (ఈ విషయాన్ని తత్వవేత్త విట్జన్ స్టెయిన్ ఆసక్తికరంగా చర్చించారు)

సరే పిల్లి ఎలుకల గురించో మరొకదాని గురించో మనకి ఎందుకు? మన గురించి మనకి తెలుసా?

అసలు మనిషి జీవితకాలం తక్కువ. అతడు తన ఉనికిని తరతరాల జ్ఞానంతో వ్యవస్థలతో సంకేతాలతో సంస్కృతితో బలపరచుకొంటున్నాడు. ప్రపంచంలో ఎన్నో చచ్చిపోతున్నాయి. మనిషి చావు కూడా అంతే. కానీ మనిషి విషయంలో తాను సంపాదించుకొన్నది అంతరిస్తుందనే భయం ఎక్కువ.

మనిషి లోభిత్వాన్ని మనం నిందిస్తాం. మనిషి లోభిత్వాలలో అన్నిటికన్న భయంకరమైన లోభిత్వం తన 'ఉనికి'గా పేర్చుకున్న నిర్మాణం మొత్తం అంతరిస్తుంది.

ధ్వంసమౌతుందన్న భయం అసలైన లోభిత్వం. అందుకే మనిషి మతం కోసం ఆత్మాహుతికి సిద్ధపడతాడు. ఎందుకంటే అతని ఉనికి అతని దేహంలో లేదు. మనిషి దేహానికి చాలా దూరంగా జరిగాడు. అందుకే ఆత్మహత్య అనేది మనిషి ఉనికి అతని భౌతిక దేహంలో లేదు అని నిరూపిస్తుంది. ధనవంతులు, భద్ర జీవులు వ్యర్థత్వాన్ని ఫీలవుతుంటారు. మనిషే సృష్టించిన సింబాలిక్ ఆర్డర్లో తనకి స్థానం లేకుండా పోయిందనో తాను ఇర్రెలవెంట్ – అప్రధానం ఐపోయాననో ఎందరో ఆత్మహత్య చేసుకొంటారు.

బహుశా మానవ జీవిత కాలాన్ని యింకా పొడిగించే సైన్సు పెరిగే కొలదీ ఆత్మహత్యలు పెరుగుతాయి. బహుశా భవిష్యత్తులో ఆత్మహత్యలు నివారించే స్పెషలిస్టులకి అధిక ఆదాయం లభిస్తుంది.

దేహానికి దూరంగా జరిగిన మనిషి తిరిగి తన దేహానికి చేరుకోగలడా? కృతకమైన భాషా నిర్మాణంలోనే తన ఉనికిని వెతుక్కునే వ్యర్థ ప్రయత్నాన్ని విరమించుకోగలడా? అంటే సింబాలిక్ ఆర్డర్లో అర్థం కోసం అన్వేషణలో మునిగిపోయిన ఆధునిక మనిషి, ఈ అన్వేషణకి ఫుల్‌స్టాప్ పెట్టగలడా!

ఎందుకంటే అర్థం కోసం వ్యర్థ ప్రయాస మనిషిని వస్తుజాలంలోకో, మతంలోకో తరుముతోంది. ఆధునిక యుగంలో మనిషి రెండిటివైపు పరిగెడ్తున్నాడు. 1) కన్స్యూమరిజం 2) మతం. ఈ రెండూ వేరు వేరు విషయాలుగా కనబడతాయి. కానీ రెండూ ఒకటే. ఎందుకంటే రెండు తన దేహం నుంచి మనిషి చేసే పలాయనాలే. బైట అర్థం కోసం చేసే ప్రయాసలే.

ఎందుకంటే, పాశ్చాత్య నాగరికత ఇహ – పరాల విభజన నుంచి వృద్ధి చెందింది. అదే కొంగ్రొత్త వస్తుజాలాలని ఆవిష్కరించడంలోనే మనిషికి విముక్తి అనే భావనని పెంచింది. అధిక ఉత్పత్తిని మార్చ్యిస్టులు, కేపిటలిస్టులూ యిద్దరూ యిష్టపడేది అందుకే.

అయితే మినమలిజం నుంచి పూర్తిగా దూరం జరిగి అధిక ఉత్పత్తిని ఆశ్రయించడం మనిషిని రెండు విధాలుగా దివాళా తీసేలా చేస్తోంది. బయట వస్తువుల పోగు చేయడంలో అంతరంగానికి ఏకాంతానికి ఆస్కారం లేకపోవడం, మనిషి ఉనికినే ప్రశ్నార్థకం చేసే పర్యావరణ విధ్వంసం.

ఒకసారి కార్ల్ సాగన్ యితర గ్రహాలలో బుద్ధి జీవులు ఉన్నాయా లేదా అనే విషయంపై చర్చ మొదలుపెట్టాడట. అప్పుడొక సైంటిస్టు అన్నాడట – జీవజాలం బుద్ధిజీవులు పుష్కలంగా వున్న ఒక గ్రహం మనకి తెలుసు. దానిని నిలుపుకోగలిగితే చాలు అని సమాధానం యిచ్చాడట.

కాస్మాలజిస్టు స్టీఫెన్ హాకింగ్ చనిపోయినపుడు కవి, రచయిత అవ్వారి నాగరాజు ఫోను చేసి అన్నాడు – హాకింగ్ ఈ గ్రహాన్ని పాడుపెట్టి యితర గ్రహాలకి తరలిపోవడం గురించి మాత్రమే యెక్కువగా మాట్లాడాడు. ఈ గ్రహాన్ని రక్షించుకోవడం ఎలా అని

ఆలోచించలేదు. కానీ జపాన్ ప్రకృతి వ్యవసాయవేత్త ఫుకు ఓకా అదే ఆలోచించాడు ('గడ్డిపరకతో విప్లవం' పుస్తక రచయిత)

పరలోకానికో ఇతర ఖండానికో పరగ్రహానికో తరలిపోవడం వలసపోవడం అనేది పాశ్చాత్యాన్ని మొదటి నుంచి వెంటాడ్తోంది. ఎందుకంటే ఉన్నచోట తనలో సత్యం లేదు, దైవం లేదు. బయట వుంది అనేది పాశ్చాత్య తత్వం. అర్థం కోసం దైవం కోసం అన్వేషణ అక్కడే మొదలైంది.

కానీ భారతదేశంలో శబ్దార్థాలు విడదీయరానివి. దానివల్ల సింబాలిక్ ఆర్డర్‌తో కూడిన భాషా నిర్మాణంలో ఉనికిని వెతుక్కునే ప్రయాస తప్పింది. మౌనం కూడా వ్యాఖ్యానమే. చిత్త వృత్తి నిరోధమే నిజమైన యోగం, కలయిక. తన ఉనికిని చేరుకునే దారి. అందుకే దేహమే దేవాలయం. దీనినే ఉన్నత స్థాయిలో వ్యక్తం చేశాడు యూజీ కృష్ణమూర్తి "బోడీ ఈజ్ ఇమ్మోర్టల్"

ఒకసారి కంభంలో నేను వొక క్షౌరశాలకు వెళ్ళాను. అక్కడికి వచ్చిన వొక అపరిచితుడు అడిగాడు – నా వయస్సు ఎంత అని. "నాకెలా తెలుస్తుంది నీకు నీ వయస్సు తెలియదా" అని నేను ఎదురు ప్రశ్నించాను. "నాకెలా తెలుస్తుంది? నేనొక వ్యవసాయ కూలీని. వయస్సుని లెక్కించుకోవడంతో నాకేమి పని. నువ్వు చదువుకొన్న వాడిలా వున్నావు. ఇలాంటి లెక్కలు వెయ్యడం, లెక్కించడం నీ పని. కనుక ఊహించి చెప్పగలవని నిన్ను అడిగాను" అని సమాధానం చెప్పాడా అపరిచితుడు.

ఇప్పుడు మాత్రం నీకు వయసుని లెక్కించుకోవలసిన అవసరం ఏమి వచ్చింది అని అడిగాను.

"ఆధార్ కార్డు తప్పకుండా వుండాలని, దానికి వయసు అవసరమని అంటున్నారు" అని సమాధానం చెప్పాడా వ్యక్తి.

మనిషి ఒక బాహిరమైన డాక్యుమెంటుగా ఒక స్పష్టమైన బాహిరమైన ఉనికిలో ఘనీభవించడం బ్రిటీష్ ఆధునికత తర్వాతే మొదలైంది. అది యిప్పటికీ కొనసాగుతూనే వుంది. నిజానికి అస్తిత్వం స్థల కాలాతీతంగా కొనసాగేది. అది లెక్కింపబడలేదు. ఒక అనంతంలో ఉనికి కొనసాగేది. దీన్ని మరింత మరింత బాహిరం చేయడమే ఆధునికత. దాని యొక్క అత్యాధునిక రూపం ఇంటర్నెట్.

ఇంటర్నెట్ మనిషిని పూర్తిగా డేటాగా మార్చేస్తోంది. యింకా చెప్పాలంటే అర్థం కోసం అన్వేషణ మనిషిని బహిర్ముఖుణ్ణి చేసింది. అది దైవాన్వేషణగానో వస్తు పరతంత్రంగానో మార్చింది. రెండువిధాలుగా అది మనిషిని బహిర్ముఖుణ్ణి చేసి, మతం వైపో, వస్తు జాలం వైపో తరిమింది. ఇప్పుడు దానియొక్క తీవ్రస్థాయి అన్వేషించే వాడిని, కర్తని, సృష్టికర్తని ముగించి వేస్తోంది. వట్టి పొందికలేని డేటాని మిగులుస్తోంది. ఆ డేటాకి అర్థ సందర్భాలు ముగిసి పోతున్నాయి. ఆ డేటాలో ఏది సత్యం ఏది అసత్యం

అనే చర్చ కూడా ముగిసిపోయి, ఎంటర్‌టైన్ చేయడం మాత్రమే మిగులుతోంది. కాలం వెళ్ళబుచ్చడమే పరమార్థంగా మారుతోంది. అయితే కాలం గడిపే 'కర్త'కి స్థానం మృగ్యం కావడం వల్ల 'కాలం గడపడం' అనే దానికి అర్థం పోతోంది. కాలం అదంతట అదే గడిచిపోతోంది. దేహాన్ని ఆత్మని, వాటి సంబంధాన్ని కోల్పోయిన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం.

ఇంకా చెప్పాలంటే మనిషి ఉనికి సింబాలిక్ ఆర్డర్‌లో కూడా లేదు. మార్కెట్ సృష్టిస్తున్న సింబాలిక్ డిజార్డర్‌లోనే మనిషి తన ఉనికిని వెతుక్కోవలసిన పరిస్థితిలోకి నెట్టబడ్డాడు. యిది ఆధునికత మొదట్లో సృష్టించిన వ్యక్తి, వ్యక్తి వాదం అనే భ్రమని కూడా చెదరగొడ్తోంది. దానితో వ్యక్తి రకరకాల వస్తువులనీ, డిజిటల్ ప్లాట్‌ఫారంలని యాప్‌లనీ పోగు చేసుకోగలుగుతున్నాడు కాని, తన ఉనికిని తానే పోగు చేసుకోలేక పోతున్నాడు. అంటే ఆధునిక వ్యక్తి నిర్మాణం అనేది కూడా చరమస్థాయికి చేరుతోంది.

అందువల్ల సైన్సు జీవితకాలాన్ని పెంచవచ్చు కాని జీవించే వ్యక్తి మిగలక పోవచ్చు. 'వ్యక్తి' ముగిశాక, జీవిత కాలం పెరగడం అనే దానికి అర్థం వుండదు. ఎవరు జీవించాలి అనే ప్రశ్నకి సమాధానం వుండదు. యిది ఆధునిక సంక్షోభం.

◆ ◆ ◆

వ్యక్తి

వ్యక్తి ఎందుకు ముగిసిపోతున్నాడు. వ్యక్తి అనే పదానికి అర్థం ఎందుకు అంతరిస్తోంది. మూసలలోకి యిమిడిపోవడం వల్లనా?

మనిషి తన జ్ఞానం ద్వారా ప్రతిదాన్నీ వర్గీకరించాడు. ఇలా వర్గీకరించి ఒక వరసలో నిలపడం అతనికి సౌలభ్యాన్ని యిచ్చింది. సాధారణీకరణలు చాలా సరళత్వాన్ని జీవితంలోకి తీసుకువచ్చాయి. ప్రత్యేకతలని తగ్గించి వేసి సరళీకరిస్తూ వచ్చాడు. యిది ప్లేటో భావాలకి సమానం. భౌతిక వస్తు జాలమంతా కొన్ని భావాలకి వ్యక్తీకరణ. ఈ ఆలోచన బహుళత్వాన్ని కుదించి సాధారణీకరించింది.

కానీ భారతీయ తాత్వికతలో బహుళత్వం కుదించబడలేదు. ఏకత్వం వున్నా అది మూసగా మారలేదు. ఒకే సత్యం బహుళంగా వ్యక్తమౌతుంది అన్నారు. కానీ అక్కడ బహుళ రూపాలకి ప్రాధాన్యం యివ్వబడింది. జగత్తు అంటే నామరూపాలే.

అయితే బహుళత్వాన్ని కొన్ని సాధారణీకృత భావాలలోకి కుదించడం పాశ్చాత్యంలో కాన్సెప్ట్యువలైజేషన్‌కి దారితీసింది. ఈ కాన్సెప్టులు వస్తువులని మింగేశాయి. తత్వశాస్త్రంలో మనస్తత్వ శాస్త్రంలో మనస్సుకో, భౌతికానికో కామానికో, అర్థానికో దేనికో ఒకదానికి ప్రాధాన్యం యిచ్చే సిద్ధాంతాలు మొదలయ్యాయి. ఆ మూసలోకి అన్నీ యిమడ్చబడ్డాయి. ఈ విశ్లేషణలు స్పష్టమైన మూసల నిర్మాణానికి కారణమయ్యాయి.

ఈ మూసలు అనేవి భౌతిక ఆచరణలోకి కూడా వచ్చాయి. లైవ్ స్టాక్ పేరుతో జీవజాలాన్ని పెంచడంలో, ఆ జీవుల్ని ప్రత్యేకంగా ఒక ఫ్యాక్టరీలో వస్తువుల తయారీ పద్ధతిలో జీవజాలాన్ని పెంచడం మొదలైంది. కోళ్ళఫారాలు, ఎద్దుల పెంపకం లాంటివి పెద్దెత్తున ఫ్యాక్టరీ ఉత్పత్తుల్లా తయారయ్యాయి. గత కాలానికి భిన్నంగా మాసివ్‌గా పెద్దెత్తున మాంస ఉత్పత్తి మొదలైంది. ఆయా జీవులు ఎంత బరువు వుండాలి, ఎంత మాంసాన్ని ఉత్పత్తి చేయాలి అనేటువంటివి కృత్రిమంగా సైన్సు ద్వారా నియంత్రించబడ్డాయి.

జీవులకి గతంలో వుండే స్వేచ్ఛా గమనాన్ని అరికట్టి ఒకేచోట యిరుకు స్థలాల్లో పెంచడం అనే పద్ధతి పెరిగింది. సెక్సు అవసరం లేకుండా జంతువులకి పిల్లలు పుట్టే

పద్ధతులు వచ్చాయి. ప్రకృతిని యింతగా అరికడ్తూ మూస పద్ధతిలోకి జీవులని లాగుతూ మనిషి తన జీవితం మాత్రం వైవిద్యభరితంగా వుంచుకోగలడా?

విద్యలో జీవితంలో మనిషి కూడా మూస పద్ధతిలోకి లాగబడ్డాడు. విద్య అనేది వ్యక్తి నిర్మాణం కోసం కాకుండా క్రమేపీ వట్టి పోటీగా మిగిలింది. ఈ పోటీ ఎందుకో కూడా తెలీదు. ఎందుకంటే నిలకడైన ప్రమాణాలు ఏవీ లేవు. మార్కెట్ అవసరాలు మనిషి అవసరాల మీద ఆధారపడవు. నిరంతరం కృత్రిమంగా కల్పించబడ్తాయి.

క్రమేపీ జంతువు అనే పదానికి అర్థం పోయి, మాంసం ఉత్పత్తి అనే పదం స్థిరపడింది. అలాగే మనిషి, వ్యక్తి అనే పదాలకి అర్థం పోయింది. మానవ వనరులు అనే పదం వచ్చింది.

"ఉక్కు మనిషి అంటే ఒకప్పుడు దృఢ నిశ్చయానికి సంకేతం. యిప్పుడు ఉక్కులో పోతపోసిన విగ్రహం అని మాత్రమే అర్థం గుజరాత్ పటేల్ విగ్రహంలా" అన్నారు మిత్రులు కర్ణం విజయ్ కుమార్.

రూపకాలంకారాలు, పౌరాణిక కల్పనలు అన్నీ వట్టి వాచ్యతలోకి కుదించబడ్తున్నాయి. వినాయకుడికి ప్లాస్టిక్ సర్జరీ చేసి తల అతికించారు అన్నారు మోడీ.

సోషలిస్టు రామ్ మనోహర్ లోహియా "జంతువు మనిషి కలిసి పునరుజ్జీవనం పొందడంగా వినాయక రూపాన్ని వర్ణించారు. ఆ కలయికలో జంతువు నశించలేదు, మనిషిరూపమూ నశించలేదు. రెండూ పునరుజ్జీవనం చెందాయి, పూరకం అయ్యాయి అన్నారు లోహియా. అంటే ప్రకృతిలో మనిషి యితర జీవులతో తనకి గల సజీవ సంబంధాన్ని గుర్తింపచేసే రూపం వినాయక రూపం. ఈ వివరణ ఎంత కళ్ళు తెరిపించేలా వుంది?

కానీ యిటువంటి తాత్వికమైన సృజనాత్మకమైన కవిత్వాత్మకమైన వివరణలకి కాలం చెల్లిపోయిందా? ప్రతీదీ వాచ్యతలోకి దిగజార్చబడ్తోందా? లేకపోతే ఈ అపభ్రంశాలేమిటి?

మనిషి జీవితమే అటువంటి వాచ్యతలోకి దిగజారుతోంది. ఎన్నో కమ్యూనిస్టు ఉద్యమాలకి విద్యార్థి ఉద్యమాలకి నిలయం అని చెప్పబడే ఆంధ్రప్రదేశ్లో చదువులు ఎంత నిర్జీవంగా మార్చబడ్డాయి? శ్రీచైతన్య, నారాయణల పేరుతో ఆటలూ, పాటలూ, సకల సృజనాత్మక కార్యకలాపాలు నివారించబడ్డాయి. బ్రాయిలర్ కోళ్ళ పెంపకంతో విద్య సమానం చేయబడింది.

ఎఫిషియన్సీ, ఖచ్చితత్వం (కన్సిస్టెన్సీ) పేరుతో చివరికి మానవ జీవితం మూసలలోకి కుదించబడింది. ప్రకృతిని పశు పక్ష్యాదులని వర్గీకరించడం సాధారణీకరించడమే కాక, వాటి జీవితాన్ని మూసలలోకి కుదించినందుకు ప్రకృతి మనిషిపై పగ తీర్చుకొంటోందా? ప్రకృతి పగతీర్చుకోవడమంటే, ప్రాకృతిక ఉత్పాతాలైన వరదలూ తుపానులూ మాత్రమే కాదు. మనిషి జీవితం మూసలలోకి యిమిడిపోయి నిస్సారం కావడం కూడా.

అంతా లాభం కోసం వ్యాపారం కోసం నియంత్రించడంగా మారాక, వైద్యం కూడా వ్యాధిగా మారిపోతుంది. విద్య అజ్ఞానానికి మారుపేరుగా మారిపోతుంది.

స్థల కాలాలకి అతీతమైన ఖచ్చితత్వంతో, సాధారణీకరణతో కూడిన జ్ఞానం వల్ల మనిషి చాలా సౌలభ్యాన్ని సాధించాడు. కానీ ఆ సౌలభ్యాన్ని సాధించే క్రమంలో జీవలక్షణమైన వైవిధ్యాన్ని బలిపెట్టాడు. అందువల్లనే విద్య, వైద్యంలాంటి వ్యవస్థలన్నీ సారాన్ని కోల్పోయి టెక్నికల్‌గా ఖచ్చితత్వాన్ని సాధించాయి. మనిషి జీవితంలోంచి కవిత్వం నిష్క్రమించినట్లే, మనిషి సృష్టించిన వ్యవస్థలకి సార భూత అర్థం లోపించింది. అతని జీవితానికి కూడా.

వర్గీకరణ, ఏ శాఖకాశాఖ విడిపోవడం పాశ్చాత్య జ్ఞాన అభివృద్ధిలో కీలకం. ఒకప్పుడు తత్వశాస్త్రం విజ్ఞాన శాస్త్రం విడివడలేదు. కళలకన్నా యితర జ్ఞాన శాఖలకన్నా తత్వశాస్త్రం గొప్పది అని హెగెల్ భావించాడు. ప్లేటో కవిత్వాన్ని నిషేధించాడు. ఇటువంటి ఖచ్చితమైన వర్గీకరణ జ్ఞానపరమైన హైరార్కీ భారత ఖండంలో సాధ్యం కాలేదు.

ఆధునిక కాలంలో శ్రీనివాస రామానుజన్ తన గణిత సమీకరణాలకి అర్థం పరమార్థం దైవమే అనడం ద్వారా ఆధ్యాత్మికతకీ, మతానికీ గణిత జ్ఞానానికీ దూరం చెరిపేశాడు.

ఉపనిషత్తుల్లో కవిత్వ తత్వం కలిసిపోవడం వల్ల అది తత్వశాస్త్రం కాదు అని కొందరు పాశ్చాత్యులు అన్నారు. యిలా స్పష్టంగా వర్గీకరించుకొని పాశ్చాత్య జ్ఞానం ఎదిగింది. అది ఖచ్చితత్వాన్ని ఉపయోగితని సాధించింది.

నిజానికి ఖచ్చితత్వం ఉపయోగిత అనేవి ప్రకృతిసిద్ధమైనవి కావు. ప్రకృతిని మనకి అనుగుణంగా అవసరార్థం మెలితిప్పడం వల్ల వచ్చినవి. ఈ క్రమంలో చాలా విధ్వంసం జరుగుతుంది.

నీటిని యిష్టం వచ్చినట్టు మళ్ళించే మెగా ఆనకట్టలనే చూడండి అవి ఉపయోగకరంగా కనిపిస్తాయి కానీ పర్యావరణంలో ఎటువంటి విధ్వంసకర పరిణామాలకి దారితీస్తాయో మనిషి వివేచించడం లేదు.

మనిషి క్రమేపీ దూరదృష్టిని బలిపెడ్తున్నాడు. నిజానికి అనుమాన ప్రమాణం ప్రత్యక్షంపై ఆధారపడినట్లే, దూరదృష్టి అనేది మనిషికి స్వతస్సిద్ధమైనది. ప్రకృతి విశ్వమంతా వొకటే. 'విరాట్ పురుషుడు'ని ఏనాడో సాక్షాత్కరించుకొన్నాడు. బిందువులోనే సింధువు వుంది. వ్యక్తిలోనే విశ్వ రహస్యం వుంది. అణువుల్లో బ్రహ్మాండం వుంది. ఈ ఆలోచనలు ఎంత విశాలమైనవి. మెతుకుని చూస్తే అన్నం ఉడికినట్లు గ్రహించవచ్చు.

ప్రకృతిలోని సమతుల్యతని చెదరగొట్టకూడదు అని ప్రాచీనులకి తెలుసు. కానీ తక్షణ ప్రయోజనాలూ మరింత తక్షణ అవసరాలూ ప్రధానమయ్యే ఆధునిక జీవనశైలి ఈ సమతుల్యతని చెదరగొడ్తోంది.

నిజానికి తక్షణ అవసరాలు అనే పదం సరైనది కాదు. మనిషి అవసరం అంటే

ఏమిటో తెలుసుకొనే వివేచించే ప్రమాణాలు సాంస్కృతిక మైనవి. ఆ సంస్కృతిని ధ్వంసం చేసి మార్కెట్ లాభ దృష్టి అవసరాలని శాసిస్తోంది. అవసరాలని సృష్టిస్తోంది.

దీనివల్ల మనిషి విశ్వంతో ప్రకృతితో వున్న స్వతస్సిద్ధ సంబంధాన్ని కోల్పోతున్నాడు. దీనివల్ల జీవితానికి అర్థం నశిస్తోంది. ఎందుకంటే అర్థం అనేది బయటి నుంచి తెచ్చుకొనేది కాదు. అది నీటి ఊటలా లోపలి నుంచి సిద్ధించేది.

మార్కెట్ మాయాజాలం అంతర్ముఖత్వాన్ని అడ్డుకొంటోంది. దానివల్ల మనిషికి యితర ప్రకృతితో పుట్టుకతో సిద్ధించే అంతస్సంబంధం తెగిపోతోంది. దీనివల్ల వచ్చే నష్టం లెక్కించరానిది. పురుషార్థాలకి గండిపడ్తుంది. దానివల్ల 'అర్థం' లేనిదిగా జీవితం భాసిస్తుంది. దానితో మరింత మార్కెట్ చెత్తలో జీవితాన్ని పూరిస్తాడు మనిషి. ఒక విష వలయంలోకి నెట్టబడతాడు. చక్రం వలే తిరిగే కాలం, జీవితం అంతుబట్టకుండా పోతుంది.

సృష్టి అంతా చక్రభ్రమణమే. జీవితం, ప్రకృతి, కాలం, సుఖదుఃఖాలు అన్నీ చక్రభ్రమణాలే. జన్మ మృత్యువులు కూడా చక్ర భ్రమణాలే. అన్నం అంటే తినేది తినబడేది కూడా. అంటే జీవితమూ మృత్యువు వేరుకాదు. మనది చక్ర నాగరికత, చక్ర సంస్కృతి.

చక్రం అనేది లేని నాగరికతలు వున్నాయని, మాయ నాగరికతలో చక్రం అనేది లేదు అని చదివాను. మరి వారి తత్వశాస్త్రం ఎలా వుంటుందో నాకు తెలీదు.

శ్రీకృష్ణుడు తనని నిందిస్తున్న జరాసంధుడిని చక్రాయుధంతో చంపుతాడు. అభిమన్యుడు అన్ని ఆయుధాలూ నశించినపుడు చక్రాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడతాడు.

చక్రం పట్ల మన మోజు మన భాషలో కనబడ్తుంది. జీవిత చక్రం, కాల చక్రం, యుగ చక్రం.

చక్రార పంక్తిరివ గచ్ఛతి భాగ్య పంక్తిః (భాసుడు)

సుఖ దుఃఖాలు కలిమి లేములు చక్ర భ్రమణం చేస్తుంటాయి.

నీషే ఎటర్నల్ రికరెన్స్ అన్నా, మార్క్సు సర్పిలాకృతిలో చరిత్ర వుంటుందన్నా చక్రం గుర్తుకు వస్తుంది.

కాని భారతదేశంలో చక్రం పురోగతి అనే భావనకి అడ్డంకిగా నిలిచిందా? మృత్యువుపై జీవితాన్ని దుఃఖంపై సుఖశాంతులని జండాగా ఎగరవేయడానికి చక్రం అడ్డుపడిందా? అలాగే సృష్టిలో మానవుడిని ప్రకృతిపై విజేతగా నిలిపే తత్వానికి ఈ చక్ర భ్రమణం అడ్డుపడిందా? కార్ల్ మార్క్స్ కూడా హిందూ సంస్కృతి మనిషిని ప్రకృతి స్థాయికి దిగజారుస్తోంది అన్నాడు. జంతు ప్రకృతి పూజని తప్పు పట్టాడు. క్రైస్తవ విమర్శ కూడా యిదే.

భాగవతంలోని జడ భరతోపాఖ్యానాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. జంతువుకీ మనిషికీ దూరం లేదు అని. ఒక రుషి లేడిని అమితంగా ప్రేమించడం వల్ల లేడిగా పునర్జన్మిస్తాడు. జాతక కథలలో బోధిసత్వుడు జంతు జన్మ కూడా ఎత్తుతాడు. దశావతారాలలో వరాహ కూర్మ మత్స్య అవతారాలే కాదు, నరసింహావతారం వుంది. వినాయకుడు కూడా సగం జంతువు, సగం మనిషి.

ఈజిప్టులో కూడా యిలా సగం మనిషి, సగం జంతువుల విగ్రహాలు వున్నాయని చదివాను. గ్రీకు పురాణాలలో కూడా వుండవచ్చునేమో. గ్రీకు పురాణాలని మానవ జాతికి చెందిన బాల్యదశ అన్నాడు మార్క్సు.

అంటే పురాణం బాల్యదశ మాత్రమే దానిని మనం అధిగమించాలి అని భావించారు ఆధునికులు. ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు పురాణాలని తీవ్రంగా నిందించాడు. బాల్యదశని యౌవనం నుంచి పూర్తిగా వెలివేయాలని చూశాడు. పురాణాలలోని భావోద్వేగాలనీ శృంగారాన్నీ నిందించాడు. మానవ భావోద్వేగాలకి అతీతమైన దైవాన్ని నిలపాలని చూశాడు.

భారత ఖండంలో భక్తి ఉద్యమం తీవ్ర భావోద్వేగాలతో కూడినది. దేవుడు తండ్రి కాదు. ప్రియుడు లేక స్త్రీ. లేక స్త్రీ పురుష తత్వాలని కలగలుపుకొన్న అర్ధనారీశ్వరుడు.

కానీ ఆధునికతకి కావలసినది ఒక ట్రాన్సెండెంటల్ దేవుడు. దానినుంచే ఒక ట్రాన్సెండెంటల్ మనిషి ఆవిర్భవిస్తాడు. అతడు మాత్రమే ప్రకృతికి పూర్తిగా వేరుగా ఎడంగా నిలిచి ప్రకృతిని తన కొలతలలోకి ఇముడ్చుకుంటాడు.

కొలతని భారతీయులు మాయ అన్నారు. మీయతే అనేన ఇతి మాయా. దీనిచేత కొలవబడ్తుంది కనుక మాయ. నీ కొలతలలోని పరిమితులు కొలవబడేదాన్ని అంచనా వేస్తాయి. కొలతలు సత్యం కాదు. దృష్టే సృష్టి. క్వాంటం ఫిజిక్స్ ద్రష్టని మినహాయించి కొలత సాధ్యం కాదు అని నిర్ణయించింది.

కానీ క్రైస్తవ దృక్పథం ద్రష్టని స్రష్టని ప్రకృతికి అతీతంగా నిలిపింది. దీనినుంచే ఆబ్జక్టివిటీ పుట్టింది.

నిజానికి బైబిల్ సలోమన్ గీతాలు దైవాన్ని ప్రియుడిగా వర్ణిస్తాయి. కానీ వాటి ప్రభావం అరికట్టబడింది. అందువల్ల అక్కడ మధుర భక్తి ఆవిర్భవించలేదు. అదే జరిగితే దేవుడిలో మనిషి కరిగిపోయే వాడు. పాశ్చాత్యంలో ఆధునిక మానవుడి ఆవిర్భావం సాధ్యమయ్యేది కాదు.

దేవుడినీ, మనిషినీ, ప్రకృతినీ మూడింటినీ విడివిడిగా నిలబెట్టే క్రైస్తవ తాత్వికత నుంచే ప్రకృతిని ఎక్స్ ప్లాయిట్ చేసే ఆధునిక ప్రాగ్మాటిజం, సైన్సు, టెక్నాలజీ వృద్ధి చెందాయి. డెకార్టె ఫిలాసఫీ వచ్చింది.

గణితంలో, జామెట్రీలో ఎంతో ప్రతిభ కనబరిచే భారతీయులు టెక్నాలజీలో పాశ్చాత్య

తరహా అభివృద్ధిని ఎందుకు సాధించలేక పోయారు అని ప్రశ్నిస్తాడు కార్ల్ శాగన్.

దీనికి కారణం ప్రకృతి చక్రం నుంచి, జీవ వలయం నుంచి మనిషిని వేరు పరిచే తాత్వికత భారతీయులకి లేదు. అది పాశ్చాత్యులకి వుంది. దానివల్ల పాశ్చాత్యంలో రెండూ సాధ్యమయ్యాయి. మానవ కేంద్రక వాదం వృద్ధి చెందడం.. అదే సమయంలో తృతీయ ప్రపంచ దేశాలని వట్టి ప్రాకృతిక దృక్పథంలో ప్రాకృతిక మతాలలో మగ్గుతున్నవిగా భావించి వాటిని ఉద్ధరించే పేరుతో వైట్ మెన్స్ బర్డెన్ పేరుతో వాటి సంపదని మొత్తంగా కొల్లగొట్టి ఆ పునాదిపై పాశ్చాత్య నాగరికతని వృద్ధి చేయడం.

అమెరికాలో రెడ్ యిండియన్స్‌ని కొల్లగొట్టినా, వారి దగ్గర పాశ్చాత్యులకి అవసరమైన సంపద లేదు. దానికి భిన్నంగా భారత ఖండం సంపదకి నిలయం. దానిని కొల్లగొట్టడం, మార్కెట్‌గా మార్చుకోవడం ద్వారా యింగ్లండ్ అభివృద్ధి చెందింది. అదే సమయంలో తన అభివృద్ధి మోడల్ మాత్రమే సత్యం అనే ద్పకృథాన్ని భారతీయులలో విద్య ద్వారా వ్యాప్తి చెందించింది. ఉద్ధారకుడిగా మిగిలింది. ఇందుకోసం భారతదేశంలోని విద్యాలయాలని పాఠశాలలని, వాటిని పోషించే వ్యవస్థని ధ్వంసం చేసింది యింగ్లండ్ పాలన (బ్యూటిఫుల్ ట్రీ – ధర్మపాల్). ఈ సంగతిని ఆధునిక భారత చరిత్రలో బిపిన్ చంద్ర కూడా గుర్తించాడు.

చివరికి పాశ్చాత్య టెక్నాలజీని ఆరాధించడం, వేదంలో పాశ్చాత్య టెక్నాలజీ వుంది అని వాదించడం పెరిగింది. దీనిని ప్రారంభించింది దయానంద సరస్వతి. కొనసాగిస్తున్నది హిందూవాదులు. హేతువాదులు, దళితవాదులు కూడా పాశ్చాత్య టెక్నాలజీ వంటి దాన్ని కనుగొనలేకపోవడం మన సంస్కృతిలోని మౌలిక లోపంగా విమర్శిస్తుంటారు. అందువల్ల హిందూ దళిత హేతువాదులు ఒకే తరహా వాదన కలిగి వుంటారు. కారణం భారతీయుల సుపీరియారిటీ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సులు వారి తర్కాన్ని ప్రభావితం చేస్తాయి.

ప్రముఖ సైన్సు రచయిత కార్ల్ సాగన్ భారతీయ విజ్ఞానంలోని విశాలత్వాన్ని కొనియాడతాడు. విశ్వం పుడుతుంది నశిస్తుంది మళ్ళీ పుడుతుంది. యిదంతా అనంత చక్ర భ్రమణం. యిది అనాది అనంతం. ఈ కాస్మాలజీ సాధారణ కార్యకారణ సంబంధం లోనిది కాదు. ఈ అనంత చక్ర భ్రమణంలో ఒక క్రమబద్ధమైన కార్యకారణ సంబంధం వుండదు. ఏది మొదలు, ఏది తుది అనే దానికి సరళ సమాధానం లేదు.

ప్రముఖ యిండాలజిస్టు ఫ్రిట్స్ స్టాల్ భారతీయులకి బిగ్ నెంబర్సుపై గల ఆసక్తిని మెచ్చుకొంటాడు. నోమ్ చామ్ స్కీ ఒకచోట అంటాడు "అమెరికన్లు సృష్టి కొన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రారంభమైందని నమ్ముతారు యిప్పటికీ".

◆ ◆ ◆

భారతీయుల దృష్టిలో మృత్యువే జీవితం

జీరోని అనంతాన్ని కనుగోవడం వల్ల భారతీయులు తుది మొదలు లేని కాలచక్రంలో యిరుక్కుపోయారు. బుద్ధుడు కార్యకారణ శృంఖల అన్నది దీన్నే. అందుకే కాలం జీవితంగా కాదు, మృత్యువుగా భావించబడింది. కాల శబ్దానికి నలుపు అని అర్థం. నారాయణ మూర్తి నలుపే. ధర్మదేవత యముడు. నచికేతుడు జీవిత రహస్యాన్ని తెలుసుకోవడానికి మృత్యుదేవతని శరణు వేడతాడు. సావిత్రి భర్త కోసం మృత్యుదేవతని ఎదుర్కోవడం స్వామి అరవిందని ఆకర్షించింది.

మృత్యువుని చేజేతులారా ఆహ్వానించడం జైనంలోనూ, సనాతన ధర్మంలో కూడా కనబడ్తుంది. రామాయణం శబరి, సుతీక్ష్ణ మహర్షి కూడా ఆత్మాహుతి చేసుకొంటారు. చివరికి శ్రీరామచంద్రుడు సముద్రంలోకి పోయి స్వయంగా అవతారం చాలిస్తాడు.

బుద్ధ భగవానుడు గ్రంథ రచయిత చరిత్రకారుడు డి.డి. కోశాంబి తండ్రి ధర్మానంద కోశాంబి గాంధీగారి శబరమతి ఆశ్రమంలో జైనధర్మం ప్రకారం నిరాహారంగా మరణించాడట.

యింకా వింత మహాభారతంలో శత్రువులైన పాండవులకి తన మరణ రహస్యాన్ని భీష్ముడు స్వయంగా చెప్పి, వాళ్ళ చేతిలో మృత్యువు ఒడిలో చేరతాడు. మరణించే ముందు పాండవులకి ధర్మ రహస్యాలు బోధిస్తాడు.

మృత్యువుని ఒక అనివార్యమైన విధిగా స్వీకరించడం భారతీయ మనస్తత్వం. గాంధీ మరణించినపుడు రమణ మహర్షి అన్నారట – ఎవరినీ వ్యక్తిగతంగా నిందించవద్దు. గాంధీ అవతార ప్రయోజనం ముగిసింది. అందుకే ఆయన మరణించాడు. బండి నారాయణ స్వామి 'శప్తభూమి' నవల నాయకుడు వర్షం కోసం తనని తాను బలి యిచ్చుకొంటాడు.

మృత్యువుని అనివార్యంగా భావించడం, ఒకొక్కసారి మృత్యువుని యిష్టపూర్వకంగా ధర్మంగా భావించి స్వచ్ఛంద మరణం పొందడం దీనిని సంస్కృతి అంగీకరించడం చూసి, విల్ డ్యూరెంట్ 'స్టోరీ ఆఫ్ సివిలైజేషన్' అనే పుస్తకంలో భారతీయులని నిరాశావాదులు అంటారు.

ఆశావాదం అనేది నిరాశపైన ఆశని, మృత్యువుపైన జీవితాన్ని ప్రకృతిపైన మనిషిని ఆధిపత్య స్థానంలో నిలిపే పాశ్చాత్య సంస్కృతి నుంచి వ్యాపించింది.

'కాలం చేశాడు' అంటే మరణించాడు అని అర్థం. మరణ సమయం వచ్చినపుడు ఎవరూ నిలువరించలేరని విశ్వాసం. అందుకే పూర్వం వయసు ఐపోయింది చనిపోయాడు అనో, కాలం తీరిపోయింది అనో, నూకలు చెల్లాయి అనో అనేవారు.

యిప్పుడు దానికి భిన్నంగా మృత్యువుని కారణంతో ముడివేస్తున్నారు. ఎంత వయస్సు వచ్చినా ఫలానా రోగం వచ్చి చనిపోయాడు అంటున్నారు. భాష పూర్తిగా మారిపోయింది. వస్తువులలాగే శరీరం కూడా రిపేర్ చేయదగినదిగా, కొత్త భాగాలు అమర్చదగినదిగా భావించబడ్తోంది. యిది మరింత ముందుకు పోయి మానవ జీవిత కాలం అనూహ్యంగా పెరుగుతూ పోతుందని ఇజ్రాయిల్ సామాజిక శాస్త్రవేత్త యువాల్ హరారి అంటాడు.

అసలు విషయం మృత్యువు పట్ల మన దృష్టికోణంలో వచ్చిన మార్పు. ఈ మార్పు వల్ల 'అమరత్వం' మిథ్యగా మారింది. మనిషి ఒక సాధారణ వస్తువుగా కుదించబడ్డాడు. అమరత్వం గొప్ప ఊహ. మనిషి మరణించినా అతని జ్ఞాపకాలు, అతడు చేసిన ధర్మం, అతడు సాధించిన విషయాలు స్ఫూర్తిదాయకంగా మిగిలి వుండడమే అమరత్వం. అందువల్ల ఎంతకాలం జీవించావు, ఎన్నో ఏట మరణించావు అనేది అప్రధానం. కానీ మనిషి శరీరం ఎప్పుడు నిపుణులు కాపాడే పరికరంగా మారిపోయిందో, ఆవిధంగా మన భాషలో మార్పు వచ్చిందో శరీరం యొక్క స్వతంత్రత నశించింది. నిపుణులు మరింత నిపుణుల ఆవశ్యకత పెరిగింది. దాని కోసం ధనం ప్రధానమైంది.

దీంతో మనిషి మరణం ఒక అనివార్యతగా కాక అశక్తతగా అసమర్థతగా లేమిగా నిర్వచించబడ్తోంది. ఈ పరిస్థితి మరింత బిగుస్తోంది. చావుని తప్పించుకోవడం కోసం నిరంతరం ధనం వెంట పరుగులు పెట్టవలసి వస్తోంది. మానవ విజ్ఞాన ఫలాలని అందుకొని మృత్యువు నుంచి పలాయనం చిత్తగించడం కోసం జీవిత సమయాన్ని వెచ్చించవలసి వస్తోంది. అన్నిటికన్న వైద్యమే ఖరీదుగా మారింది. మరింతగా పెరుగుతున్న వైద్య విజ్ఞానాన్ని అందుకోవడం కోసం మనిషి శక్తులన్నీ వ్యయమవుతున్నాయి.

ఈ జీవితంపైన ఆశాభావం, ఆశతో కూడుకొన్న పరుగు మనిషి జీవితాన్ని ఖాళీ చేస్తోంది. దాంతో ఇతరులని ప్రభావితం చేసే ప్రత్యేకతలు ఏవీ మనుషులలో మిగలడం లేదు. మనిషి మరణించాక తలచుకోవడానికి ఏమీ మిగలడం లేదు. దానితో అమరత్వం రద్దు అవుతోంది. మనిషి మరణం ఒక వస్తువు చెడిపోవడంతో సమానంగా మారింది. బహుశా ఇది ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పైన ఆధారపడిన నాగరికతకి ముందుదశ.

మృత్యువు ఐచ్ఛికం కాకపోవడం వల్ల జీవితం కూడా ఐచ్ఛికం కాకుండా పోయింది. కాశ్యాంతు మరణాన్ముక్తిః కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుంది అని ఆర్యోక్తి. అంటే మృత్యువుకి కూడా స్థల కాలాలు వున్నాయా? మృత్యువు ఒక సంఘటనయా? జీవితంలోని అనేక సంఘటనలలాగే మృత్యువు కూడా ఒక సంఘటన అనవచ్చా?

మనిషి మృత్యువుని కూడా ఒక సంఘటన (ఈవెంట్)గా మార్చాడు. అయితే మృత్యువుని సంఘటనగా మార్చడంలో కూడా సాంస్కృతిక భేదాలు వున్నాయి. ఈ సాంస్కృతిక భేదాలని రెండు ఉదాహరణలతో వివరిస్తాను.

సెర్చ్ ఫర్ మీనింగ్ అనే గ్రంథంలో ఫ్రాంక్లిన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త ఒక సంఘటనని గురించి రాస్తాడు.

నాజీ కాన్సంట్రేషన్ క్యాంపులో తన కొడుకుల్ని పోగొట్టుకున్న తండ్రి ఫ్రాంక్లిన్ దగ్గరికి వచ్చాడు. తన పిల్లలు పోయాక జీవితం అర్థరహితంగా మారిపోయిందని ఎందుకు బతకాలో అర్థం కావడం లేదు అని చెప్పాడు. అప్పుడు ఫ్రాంక్లిన్ అడిగాడు "నీకు యూదు మతం బోధించే పరలోకంపై నమ్మకం వుందా?" "ఉంది". "ఐతే నీ కుమారులు సత్పవర్తన గల వారు. కనుక భగవంతుని సన్నిధిలో వారికి స్థానం లభిస్తుందనే సత్యాన్ని గ్రహించు" అని హితబోధ చేశాడా మనస్తత్వ శాస్త్రవేత్త. అప్పుడా యూదు వృద్ధుడు సమాధానం పొంది ప్రశాంత చిత్తంతో జీవించాడు.

పరలోకంపైన నమ్మకం లేకపోతే మృత్యువుని ఎదుర్కోవడం ఎలా? పరలోకం అనేది యిహానికి పూరకంగా పనిచేస్తుంది. యిక్కడ లభించనివి కూడా అక్కడ లభిస్తాయి. చివరికి మృత్యు అనంతరం కూడా జీవితానికి హామీ వుంటుంది. సమాధులలోంచి పునరుత్థానం వుంటుంది. దేవుడు తోడుగా వుంటాడు.

కానీ భారతీయ సంస్కృతిలో పరం వుంది, పర లోకానికి ప్రాధాన్యం లేదు. ఒకవేళ స్వర్గ నరకాలు వున్నా అవి కూడా కర్మబద్ధాలే. చివరికి స్వర్గాధిపతి యింద్రుడు కూడా మానవ తపస్సుకి భయపడే వాడే. రుషి శాపం వల్ల వికృత రూపం పొందిన వాడే. స్వర్గం అనేది మానవుడి స్వప్నం మాత్రమే. కలలో మానవుని యిచ్ఛలు సకల లోపాలతో ప్రతిబింబిస్తాయి. అలాగే స్వర్గలోకం కూడా అపరిపూర్ణమే, లోటుతో కూడినదే. అది మృత్యువు, ఎడబాటులకి సమాధానం కాదు. ఎందుకంటే మానవ జగత్తుతో ముడిపడని పరలోకం కాదు అది.

పరానికి పరిపూర్ణత యిహం లోనే. పరాత్పరుడు కూడా యిక్కడ అవతరించాల్సినదే. నిజానికి యిహం, పరం అనేవి ఒకే నాణానికి బొమ్మ బొరుసు.

నీ ఆలోచనకి అందేది ప్రతీది జన్మ మృత్యువుల మధ్య చరించేదే. అందువల్లే సృష్టకిర్త కూడా సుదీర్ఘకాలం జీవించవచ్చు కానీ మరణం అనివార్యం. బ్రహ్మ అందువల్లే దేవుడు కాలేకపోయాడు. ఎందుకంటే సృష్టి అనేది ఒక ఆదిని సూచిస్తుంది. ఆది వున్నచోట అంతమూ, నాశమూ వుంటుంది. దానికి కారణమైన బ్రహ్మ కూడా ఆద్యంతాలుకి గురికాక తప్పదు. కారణం అంటేనే ఒక మొదలు కలది, అలాంటప్పుడు దానికి తుది కూడా తప్పక వుంటుంది.

నిజానికి ప్రకృతి అనేది అనాది. అది అవ్యక్తంగా సూక్ష్మంగా వుండి వ్యక్తమౌతుంది మళ్ళీ లయించిపోతుంది. యీ ప్రక్రియ అనాది. భారతీయ సృష్టి భావనకి ప్రముఖ

కాస్మాలజిస్టు కార్ల్ సాగన్ కూడా అచ్చెరువొందాడు. యిలా అనంతకాలాన్ని వూహించడం అద్భుతం. దానిలో కార్యకారణ క్రమం అసాధ్యం.

యీ విశ్వదృష్టి 'పరలోకం' అనే భావనకి నిలకడ లేకుండా చేసింది. కానీ పాశ్చాత్యంలోని పరిమిత కాలదృష్టి, కాలాన్ని బాణంలా చూసే దృష్టి స్థల కాలాలని సరళంగా విభజించడం పేర్చడం సాధ్యం చేసింది.

మరి భారతీయులు మృత్యువుని మృత్యువు వల్ల వచ్చే వియోగాన్ని ఎలా చూశారు? యిక్కడ బుద్ధునికి చెందిన ఒక వృత్తాంతం. బుద్ధ భగవానుడి దగ్గరికి కుమారుని కోల్పోయిన స్త్రీ ఏడుస్తూ వచ్చింది. తన కొడుకుని మహిమతో బతికించమని. అలా చేస్తే శాశ్వతంగా శిష్యురాలిగా మారుతానని అంది.

తథాగతుడు అన్నాడు "అమ్మా! మృత్యువు ఏమాత్రం ఎదురుకాని గృహం నుంచి గుప్పెడు నువ్వులు తీసుకురా. నీ కొడుకుని బతికిస్తానన్నాడు. ఆమె శ్రావస్తిపురంలోని ప్రతి యిల్లు తిరిగింది. తమ ఆత్మీయులు ఎవరో ఒకర్ని కోల్పోయిన తీవ్ర దుఃఖాన్ని అనుభవించిన వారే అందరూ. అప్పుడా స్త్రీకి జ్ఞానోదయమైంది. జన్మించిన ప్రతి వ్యక్తీ మరణించే వాడేనని, అది అనివార్యమని గ్రహించింది.

అంటే వాస్తవాన్ని గ్రహించక తప్పదు. దాని నుంచి పారిపోకూడదు. మృత్యువుని అధిగమించినదేదీ లేదు. పరలోకమైనా స్వర్గమైనా మృత్యు పాశం నుంచి ఏదీ తప్పించుకోలేదు. ఎందుకంటే ఉన్నదేదైనా నశించక తప్పదు. మరి మృత్యువుని జయించడం ఎలా? అమరత్వం ఎలా? అసలు పుట్టకపోవడమే జన్మరాహిత్యమే.

అంటే జన్మ రాహిత్యం కోసం కృషిచేయాలి. ఎందుకంటే ఈ లోకమంతా ఒక పునరావృత్తి. ఆ జనన మరణ పునరావృత్తి చక్రంలోంచి బయటపడాలంటే జన్మరాహిత్య స్థితికి వెళ్ళాలి. ఇచ్ఛ అనేది ఈ దుఃఖానికి మూలం అని బుద్ధుడు చెప్పాడు.

◆ ◆ ◆

అస్తి నాస్తి విచికిత్స

అసలు జన్మరాహిత్యం ఎందుకు? అసలు మనం పుట్టామా అనే రాడికల్ ప్రశ్న వేశాడు గౌడపాదుడు.

నిజానికి సాంఖ్యం ప్రకారం ఈ ప్రపంచం కాస్మోస్ కాదు కేయాస్. సత్వ రజస్ తమో గుణాత్మకమైనది ప్రకృతి. ఆ గుణాలన్నీ సమతుల్య స్థితిలో వున్నపుడు సృష్టి లేనే లేదు. (సత్వం అంటే శాంతి, తమస్ అంటే నిద్ర, ఆలస్యం. రజస్ – కదలిక, వేగం) ఈ గుణాల మధ్య సమస్థితి ఎందువల్లో దెబ్బతింటుంది. దాంతో సృష్టి మొదలౌతుంది. మళ్ళీ సమస్థితి బాలెన్స్ అంటే ప్రళయమే. కాళిదాస మహాకవి అంటాడు మరణం ప్రకృతి, జీవితం వికృతి అని.

సృష్టిని గురించి మూడు ప్రసిద్ధ వాదాలు వున్నాయి. 1) పరిణామ 2) వివర్త 3) అజాత వాదాలు.

అవ్యక్తంగా సూక్ష్మంగా వున్నది వ్యక్తం స్థూల స్థితిలోకి వస్తుంది అనేది పరిణామ వాదం.

ఒకటి మరొకటిలా కనిపిస్తోంది. తాడు పాములా కనిపిస్తోంది. మార్పు లేనిది, శాశ్వతమైనది, పరిపూర్ణమైనది పూర్తి వేరేగా మార్పు, అనిత్యత, అపరిపూర్ణత కలదిగా భాసిస్తోంది. అదే మాయ ఇది వివర్తవాదం.

అసలు సృష్టే జరగలేదు, అసలేదీ భాసించడం లేదు అనేది అజాత వాదం. సృష్టి జరిగింది అనడానికి ఆధారం ఏమిటి? మనం పుట్టాం అనడానికి ఆధారమేమిటి?

కార్యకారణ సంబంధం యొక్క పరిమితుల గురించి విచారణ చివరికి ప్రపంచానికి, దృశ్యానికి ఆధార భూమికని ధ్వంసం చేసివేసింది. బహుశా నచికేతుడికి మృత్యువే గురువు కావడం అంటే యిదే.

కఠోపనిషత్తులో నచికేతుడు మృత్యువు ద్వారా పరమసత్యాన్ని తెలుసుకొంటాడు. మృత్యువే నిజమైన గురువు. మృత్యువు అనివార్యం అనికాక అసలు ఉన్నది మృత్యువేనని,

సృష్టి జరగనే లేదు అని గౌడ పాదాచార్యులు తన తత్వం ద్వారా స్పష్టం చేశారు. యింకా చెప్పాలంటే సృష్టినీ జన్మనీ కార్యకారణ తర్కంతో నిరూపించలేం కనుక మృత్యువునీ నిరూపించలేం. కనుక జన్మ లేదు కనుక మృత్యువు లేదు యింక అమరత్వం అసలే లేదు.

భగవద్గీత చెప్తోంది – భూతములకి ఆది అవ్యక్తము, మధ్యము మాత్రమే వ్యక్తము అంతము మళ్ళీ అవ్యక్తమే. "పుట్టుటయు నిజమూ పోవుటయు నిజమూ నట్టనడిమి పని నాటకము" అన్నాడు అన్నమయ్య.

ఈ ఆది అంతాలు లేని ఆటకి అర్థం ఏమిటి? అందుకే అర్థాన్ని ముగించేశాడు గౌడపాదుడు. అర్థ అన్వేషణకి తలుపులు మూసేశాడు.

మీరు పిల్లవాడు పుట్టాడు అని పండగ చేసుకొంటున్నారు. అసలు ఎక్కడపుట్టాడు, ఎప్పుడు పుట్టాడు, పుట్టడం అంటే ఏమిటి అని గౌడపాదుడు ప్రశ్నిస్తాడు. దీనితో ఆశ నిరాశలు రెండింటికీ స్థానం లేకుండా పోయింది.

మృత్యువుని మరణానంతర స్థితిని సంఘటనగా కాక సంఘటనల చక్రంగా సంఘటనల వలయంగా చూశారు భారతీయులు. అది చక్రం కావడం వల్ల ఆద్యంతాల పరిభ్రమణం కావడం వల్ల ఆ జనన మరణ పరంపర ఎక్కడో మొత్తంగా తెగిపోయింది. కానరాకుండా పోయింది.

బుద్ధుడు దీనిని కార్యకారణ శృంఖల అన్నాడు. అంతూదరీ లేని గొలుసుకట్టు ఉనికిని 'ఉనికి'గా ఫొటో తీయడమెలా? అది అసాధ్యంగా మారింది.

కార్యకారణ పరంపరకి మొదలుని కనుగోవడం అసాధ్యం కనుక స్వభావ వాదంని సమర్థించారు. అయితే ఆ స్వభావమూ నిలబడలేదు. కార్యకారణ క్రమాన్ని స్థాపించడం అసాధ్యం కావడం వల్ల జీవితం మృత్యువూ కలిసిపోయాయి.

కనుక జీవితానికి మృత్యువే లక్ష్యం అయింది. జీవితానికీ మృత్యువుకీ దూరాన్ని క్రమాన్ని చూపలేకపోవడం వల్ల రెండూ అదృశ్యమయ్యాయి. ఫలితంగా లక్ష్యం, పరలోకం, జన్మరాహిత్యం అన్నీ ఒకలాగే వెలిసిపోయాయి. మోక్షేచ్ఛకి కూడా మూలాలు తెగిపోయాయి. యిది హేతువాదానికీ మతవాదానికీ కూడా సరిహద్దు.

జీవితం మృత్యువులాంటి సంక్లిష్ట విషయాల సంగతి సరే అసలు 'అస్తిత్వం' అనేది ఉందా. ఒకటి ఉంది అని చెప్పడానికి కంటిన్యుటీ ఉండాలి. ఒకటి ఏదైనా వుంది అని నువ్వు చెప్పేలోపలే అది అది కాకుండా పోతే, నువ్వు దాన్ని 'అది' అని ఎలా అనగలవు?

గ్రీకు ఫిలాసఫీలో ప్రముఖ తత్వవేత్త ప్లేటో వస్తువులకి భావాలు మూలం అన్నాడు. అంటే భూమి మీద వున్న గోవులన్నిటికీ గోవు అనే భావం మూలం. దీనిని భావవాదం అంటారు కాని పాశ్చాత్య విజ్ఞానశాస్త్రానికి మూలం కూడా ఇదే. గోవులు అన్నిటినీ గోవు అనే భావంతో సాధారణీకరించవచ్చు. సాధారణీకరణపై ఆధారపడ్డ ఈ భావవాదం

సాధారణీకరణపై ఆధారపడ్డ సైన్సుకి ఆధారమైంది. ప్లేటో శిష్యుడు అరిస్టాటిల్ ఆ సైన్సుకి నాంది పలికాడు. ప్రాంతీయతలకి అతీతంగా సాధారణీకరించబడ్డ వైద్యం, విజ్ఞానం దీనివల్లే సాధ్యమయ్యాయి. సాంస్కృతిక ప్రత్యేకతలు అధిగమించబడ్డాయి. వృక్ష జంతు మానవులని జాతులుగా వర్గీకరించడం ప్లేటో భావవాద ఫలితం. ఆ భావ వాదం సాధారణీకరణలకి మూలం. అందువల్ల భావవాదం లేనిదే ఆధునిక భౌతికవాదం కూడా లేదు. కానీ ప్రపంచాన్ని వివిధ భావాలుగా వర్గీకరించాడు ప్లేటో. వర్గీకరణ అనేది సర్వసాధారణమైంది. అలాంటి వర్గీకరణే భావవాదం, భౌతికవాదం అనేవి.

అయితే భారతదేశంలో భవం తప్ప భావం లేదు. భవం అంటే పుట్టుక. భూ సత్తాయాం భూ అనే ధాతువుకి 'ఉనికి' అర్థం. అసలు ఉనికి అంటే ఏమిటి? అసలు ఏదైనా ఉనికిలోకి వస్తోందా? అసలు? అసలు ఏదైనా ఉంది అని ఎలా చెప్పగలం?

ప్రతి క్షణం ప్రతిదీ మారిపోతున్నప్పుడు, ఏదైనా వుంది అని ఎలా నిర్ధారించగలం? నిజానికి నిరంతర మార్పునే మనం అంతటా చూస్తున్నాం.

గ్రీకుతత్వంలో కూడా ప్రపంచం యొక్క ప్రవాహశీలత గుర్తించబడిన మాట నిజమే. ఒకే నదిలో రెండుసార్లు కాళ్ళు కడగలేం అని ఒక గ్రీకు తత్వవేత్త అన్నాడు. జీనో పేరడాక్సు తెలిసినదే. ఒకే బాణం వివిధ సమయాల్లో వివిధ ప్రదేశాల్లో వుంటోన్నపుడు కదులుతోంది ముందుకు వెళ్తోంది అని ఎలా చెప్పగలం అనే ప్రశ్న అది.

ఉనికిని గురించి ఈ తాత్వికధార భావాల స్థిరత్వంలో స్తంభించింది. గ్రీకు తత్వం ప్లేటో ఆవిర్భావంతో పాశ్చాత్యం ఉనికిని ఘనీభవింప చేసి, వస్తువులని స్థిరమైనవిగా గుర్తించడం వల్లనే ఆధునిక భౌతిక వాద ఆవిర్భావం, సైన్సు ప్రగతి సాధ్యమయ్యాయి. 'ఉనికి'ని స్థిరీభవింపచేసిన గ్రీకుతత్వం నుంచే యూదు క్రైస్తవ మతాలు ఆవిర్భవించాయి. డెకార్టె ద్వైత తత్వానికి పురుడు పోశాయి. అదే సైన్సుకి కూడా మూలం.

ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను అన్నాడు డెకార్టె. నిలకడ లేని ఆలోచన 'ఉనికి'ని ఎలా నిర్ధారిస్తుంది. ప్లేటో భావవాదపు కొనసాగింపు యిది.

కాని స్వభావవాదులైన భారతీయులు భావాలవైపు, భావాల ద్వారా వస్తువుల వైపు భౌతికవాదం వైపు జరిగిన పాశ్చాత్య తాత్విక ప్రయాణ దిశకి విరుద్ధంగా వెళ్ళారు. చిత్తవృత్తులు – ఆలోచనలు ఉనికిని నిర్ధారించవు. చిత్తవృత్తి నిరోధమే యోగం. ఉనికితో సంయోగం అన్నారు.

ఎందుకంటే ఒక కుర్చీ నేను చూశాను. మరో క్షణం అదే కుర్చీని నేను చూస్తున్నాను అనడానికి ఆధారం ఏమిటి? ఎటువంటి హేతువు ద్వారా గత క్షణపు కుర్చీ ఈ క్షణం కుర్చీ క్షణక్షణం కుర్చీ ఒకటే అని నిర్ధారించగలం? వస్తువులకి 'ఐడెంటిటీ'ని కలిగిస్తున్నదేమిటి?

పరలోకాన్ని పోలిన భావ ప్రపంచాన్ని ఈ ప్రపంచానికి ఆధారంగా చూపడం ద్వారా ప్లేటో ఈ సమస్యని అధిగమించాడు. అంటే పరానికీ యిహానికీ అగాధాన్ని

సృష్టించాడు. యిదే క్రైస్తవ పరలోక భావనకి మూలం అంటాడు తత్వవేత్త నీషే.

భారతీయ తాత్వికులు ప్రత్యక్ష వాదులు, స్వభావ వాదులు. వాళ్ళు ఉనికి యొక్క సమస్యని భావాలలో వెతకలేదు. పాంచభౌతిక జగత్తు పుట్టుకలో చావులో వెతికారు. వీరు వారు అని కాదు భారతీయ తాత్వికులందరూ అంతే.

"భస్మీ భూతస్య దేహస్య పునరాగమనం కుతః" భస్మమైపోయిన దేహం మళ్ళీ ఎలా తిరిగివస్తుంది, ఎలా పునర్జన్మిస్తుంది అని ప్రశ్నించాడు చార్వాకుడు. ఈ ప్రశ్న ప్రత్యక్ష ప్రమాణం యొక్క ప్రాథమిక స్థాయి మాత్రమే. పూర్వమీమాంస భాష్యకారుడు శబరస్వామి కూడా పునర్జన్మ మోక్షం లాంటి గహన విషయాలని ప్రస్తావించనే లేదు. పూర్వ మీమాంస వేదిక్ రిచ్యువల్‌కి చెందిన శాస్త్రం.

యిక్కడ రిచ్యువల్, వేదాలని మొత్తంగా తూలనాడిన చార్వాకుడు, వేదమే ప్రమాణంగా భావించి రిచ్యువల్‌ని ప్రధానంగా నిలిపిన మీమాంసకుడు యిద్దరూ పునర్జన్మని పక్కనబెట్టారు. మీమాంసకులు దైవాన్ని కూడా తిరస్కరించారు. చార్వాకులు అంతే.

యిక్కడ నిష్ణా గరిష్ఠుడైన వైదిక బ్రాహ్మణుడిని, చార్వాకుడినీ ఏకం చేస్తున్నది ప్రత్యక్ష ప్రమాణం. మీమాంసకుడైన కుమారిలుడు దూరదృష్టి, దూర శ్రవణం లాంటి మహిమలను కూడా తిరస్కరించాడు. కారణం వాళ్ళు యిహంలోనే పరాన్ని చూశారు.

మీమాంసకులు కానీ, చార్వాకులు కానీ చూడని ఒక ప్రత్యక్ష సత్యాన్ని బౌద్ధం ఉపనిషత్తులు గుర్తించాయి. అదే ప్రపంచపు నిరంతర నశ్వరత్వం.

ప్రతిదీ ప్రతిక్షణం మరణిస్తోంది, పునర్జన్మిస్తోంది. దేహం యొక్క మరణాన్ని ఒక్కసారే చూశాడు చార్వాకుడు. ప్రతిక్షణం చూశాడు బౌద్ధుడు. గతంలోని నేను యిప్పుడు నేను ఒకరే అనడానికి ఆధారం ఏమిటి? బాలుడనైన నేను, యువకుడనైన నేను, వృద్ధుడనైన నేను ఒకరేనని ఎలా చెప్పగలం? ప్రత్యక్ష ప్రమాణమే దానికి విరుద్ధం.

ఒకొక్కసారి కొంతమందిని చాలాకాలం తర్వాత చూస్తే వాడే వీడు అని మనం గుర్తించలేం. చెప్తే "నువ్వా" అని మనం ఆశ్చర్యపోతాం. ఒకొక్కసారి పోలిక వల్ల మనం గుర్తిస్తాం. యీ మార్పు అనేది ఒకే వస్తువులో జరుగుతున్న మార్పా లేక ప్రతిక్షణం కొత్త వ్యక్తి పుడుతున్నాడా, కొత్త వస్తువులు ఆవిర్భవిస్తున్నాయా? ప్రతిక్షణం కొంగ్రొత్తవి పుడ్తున్నాయి. ప్రపంచంలో కంటిన్యుటీ లేదు, ఐడెంటిటీ లేదు అని బౌద్ధం నిర్ధారించింది. మరి అదే ఇది, వాడే వీడు అనే మన వ్యవహార జ్ఞానానికి మూలం ఏమిటి? సామ్యం మాత్రమే. ఆ సామ్యం ఎలా వస్తోంది? అది మన అనాది సంస్కారం, వాసనలు. అనాది, అనంతం అనే పదాల ద్వారా తమ స్వభావ వాదంలో సమాధానం వెతుక్కొన్నారు భారతీయులు.

వేదాంతులు యీక్షణికత్వానికి నిరంతర మార్పుకి ఒక ఆధార భూమికని కల్పించారు.

అదే ఆత్మ. నిరంతరం క్షణ క్షణం మారిపోతున్న ప్రపంచానికి ఆధారం ఆత్మ. సామ్యం ఎలా సిద్ధిస్తుంది. అంటే సాక్షి కావాలి. సాక్షి లేనిదే ఏదీ గుర్తించబడదు. నిద్ర నుంచి లేచిన తర్వాత "నేను హాయిగా నిద్రపోయాను" అంటున్నాం. అంటే నిద్రకి కూడా నేను అనే సాక్షి వుంది. నిద్ర అంటే అచేతన స్థితి, సెమీ డెత్ అనవచ్చు. స్వప్నాలకే కాదు, స్వప్నాలు లేని పూర్తి నిశ్చల సుషుప్తికి కూడా సాక్షి ఉన్నాడు. లేకపోతే నేను గాఢంగా నిద్రపోయాను అని ఎలా చెప్పగలం. అంటే సాక్షి, ఆత్మ సర్వావస్థలలోనూ వుంది. దేహం చాలించాక 'ఆత్మ' (నేను సాక్షి) వుంటుందా? నిద్ర మృత్యువే కదా, దేహాన్ని చాలించడమే కదా? అయినా అనుభవం వుంది కదా? అలాంటపుడు మృత్యువు కూడా ఆత్మ యొక్క అనుభవమే.

సూర్యోదయ, సూర్యాస్తమయాలు, నిద్ర మెలకువలు వంటి ప్రత్యక్ష అనుభవాలు పునర్జన్మకి మూల కారణం. ఉషస్సుని పునః పునర్జాయమానా మళ్లీ మళ్లీ పుడుతోంది అని రుగ్వేదం. పునరపి జననం పునరపి మరణం మనకి ఈ జీవితంలోనే అనుభవంలోకి వస్తోంది. నిజానికి ప్రతిక్షణమూ మనిషి పునర్జన్మిస్తూనే వున్నాడు. మనిషి మూడ్స్, ఆలోచనలు, దేహంలోని అణువులూ అన్నీ జనన మరణ చక్రంలోనే పరిభ్రమిస్తున్నాయి. దీనినే విస్తరింపచేసి పునర్జన్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దానికి కార్యకారణ సంబంధాన్ని కూరుస్తూ కర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

బౌద్ధులు ఉనికినే ఆభాస అన్నారు. అబద్ధం అన్నారు. వేదాంతులు ఆత్మ చైతన్యానికీ జగత్తుకీ మధ్య భేదభావం భ్రాంతి జనితం అన్నారు. ఎవరూ ద్వంద్వాన్ని సృష్టించలేదు. అందుకే బుద్ధుడికి కూడా అద్వయవాది అనే పేరు వుంది.

భారతీయ తాత్వికులు అందరూ స్వభావవాదులు. సృష్టి స్వతః ప్రమాణం వల్ల, స్వభావం వల్ల సాగిపోతోంది. జగత్తుని వివరించడానికి పరం అవసరం లేదు. అందుకే ఆత్మ జ్ఞానాన్ని కూడా అపరోక్షానుభూతి అన్నారు. పరోక్షం ఏదీ లేదు మరి.

అందుకే పురాణ కల్పనలు కూడా ఈ స్వభావ వాదంపైనే ఉన్నాయి. చార్వాకుడు "పరం, దేవుడు లేరు. ఈ జగత్తు స్వభావం వల్లనే నడుస్తోంది" అని నిర్ధారించాడు. ఈ స్వభావ వాదాన్ని పౌరాణికులు ఊహల్లో విస్తరించి విశాల జగత్తుకి విస్తరించారు. చార్వాకుడిది స్వభావ వాదమే కానీ, పరిమిత దృష్టి. బౌద్ధులది అద్వైతులది విశాలమైన స్వభావ దృష్టి. విశాలమైన ప్రాకృతిక దృష్టి.

దేహం ఏదో ఒకరోజు నశించడం కాదు. ప్రతి క్షణం నశిస్తోంది. రూపాంతరీకరిస్తుంది. దీన్నే విస్తరిస్తే అనంత పునర్జన్మలు సంభవిస్తాయి. ఒక దేహం వల్ల మరో దేహం పుడుతోంది "ఆత్మావై పుత్ర నామాసి" తండ్రే కొడుకుగా పుడుతున్నాడు. ఇంకా సూక్ష్మంగా ఆలోచిస్తే ఒకే దేహం అనేది లేదు. ఆ దేహమే మరో దేహంగా, అది మరో దేహంగా రూపాంతరీకరిస్తోంది. దీన్ని విశాల విశ్వానికి అన్వయిస్తే అనంత జగత్తులు

పుడ్తూ నశిస్తున్నాయి పుడ్తున్నాయి. యిది అనంత కాలంగా జరుగుతోంది. దానికి అధిపతులైన బ్రహ్మలు కూడా పుడ్తూ చనిపోతూ మళ్ళీ పుడ్తున్నారు. ఒక దేహం నుంచి మరో దేహం, ఒక బ్రహ్మ నుంచి మరో బ్రహ్మ మరో సృష్టికర్త.. ఒకే సృష్టికర్త లేడు, ఒకే సృష్టి లేనట్లే.

బ్రహ్మని మనం ప్రధానంగా పూజించం. ఎందుకంటే అతడు సృష్టికర్త. సెమెటిక్ మతాల వారు దేవుడు సృష్టికర్త కావడం వల్లనే పూజిస్తారు. మనం దేవుడు సృష్టికర్త కావడం వల్లనే పూజించం. ఎందుకంటే సృష్టి అనేది పరిమితి. సృష్టి చేసేవాడు కూడా సృష్టిలో భాగమే. అతడు కూడా మార్పుకి వశుడే. చెట్టుకి మూలమైన విత్తు కూడా నశించేదే. పైగా సృష్టి రాగద్వేషాల నిలయం. బ్రహ్మ తన కూతురినే కామించాడు అనే కథ సృష్టి కర్త యొక్క తీవ్ర పరిమితిని తెలియజేస్తుంది. ఈ కథలన్నీ కల్పితాలేనని వ్యాసుడే చెప్పాడు. కానీ కల్పన అనేది వాస్తవం యొక్క స్వచ్ఛ ప్రతిబింబం. నిజానికి సృష్టి అనేది జగత్తు అనేది మనో కల్పన మాత్రమే. లేకపోతే నిరంతరం మారిపోతున్న ప్రపంచాన్ని మనం ఎలా గుర్తిస్తున్నాం? వేదాంతులు చెప్పినట్లు ఆరోపితమైన నామరూపాల వల్ల గుర్తిస్తున్నాం. లేకపోతే ఈ ప్రపంచాన్ని గుర్తించడం అసాధ్యం. ఇంత విశాల అవగాహన చార్వాకుడికి లేదు. చార్వాకుడి స్వాభావిక ప్రాకృతిక దృష్టిని విశాలం చేయడం ద్వారా బౌద్ధ అద్వైతాలు పురాణ వాఙ్మయం పుట్టాయి.

భావాన్ని పక్కనబెట్టి భవాన్ని విశ్వమంత విశాల దృష్టితో చూశారు భారతీయ తాత్వికులు.

అసలు విశ్వమంటే ఏమిటి? నీ దేహమే. అణోరణీయాన్ మహతో మహీయాన్. బిందువులోనే సింధువు. విశ్వానికి సూక్ష్మమైన నకలు దేహం. అందుకే దేహమే దేవాలయం.

ప్రాచీన లోకాయతులు దేవాలయాలని ప్రస్తావించలేదు, యజ్ఞయాగాదులు వైదిక కర్మకాండలనే ప్రస్తావించారు. విమర్శించారు. ఎందుకంటే దేవతలు మనలాంటి వారే. నిజానికి మన దేహమే దేవతల నిలయం. విశ్వమును సజీవ పరిపూర్ణమైనదిగా ఆర్గానిక్ హోల్‌గా చూస్తూ విరాట్ పురుషుడు అన్నారు. అతడు ఎక్కడ వున్నాడు? మనలోనే, మన హృదయంలోనే మనమే విశ్వం.

ప్రపంచాన్ని ఇలా స్వభావ వాదంతో చూసే పద్ధతి వలన అంతా మేలే జరిగిందా? స్వభావ వాదం వల్ల అద్వైత దృష్టి అలవడింది. మనిషికీ ప్రకృతికీ మధ్య, సకల జీవులకీ మధ్య అభేదం సమత్వం సిద్ధించింది. అలాగే జీవుడికీ దేవుడికీ మధ్య, ఇహపరాలకి మధ్య కార్య కారణాలకి మధ్య అభేదం సిద్ధించింది. దీనిని నేచురల్ సైన్స్ చెప్పే జైవిక సమానత్వంతో, అణు సమానత్వంతో పోల్చిన వారు ఉన్నారు. క్వాంటం ఫిజిక్స్ దారితీసిన ద్రష్ట దృశ్యాల మధ్య అభేదంతో పోల్చిన వారు ఉన్నారు. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనే

త్రిపుటి మధ్య అభేదాన్ని బౌద్ధులూ, అద్వైతులూ కూడా చెప్పారు.

అంటే భారత తాత్వికతలోని విభిన్న శాఖల మధ్య ఒక సమానత్వం వుంది. అది స్వభావ వాదం. ఈ స్వభావ వాదం ప్రకృతి ఒక బాహిర కారణం లేకుండా అంతర్గత చలనంలో వుంటుంది. లేక చలనమే లేని స్థితిలో వుంటుంది. ఏదైనా కానీ నిర్దుష్టమైన పరం లేదు. ట్రాన్సెండెన్స్ లేదు. అయితే 'పరం లేదు' అనే తర్కం నీకు బయట కూడా లేదు అనే తర్కానికి దారితీసింది. నీకు బాహిరమైనది ఏదీ లేదు. యింకా చెప్పాలంటే అంతర్ బహిర్ విభజన లేదు. యిది బర్క్లీ చెప్పిన భావవాదం కాదు. బర్క్లీ పదార్థాలు కాదు, భావాలు సత్యం అన్నాడు, భావాలే సత్యం అన్నాడు. పదార్థం అనేదేదీ లేదు అన్నాడు. దేవుడు పదార్థాలని కాదు భావాలని సృష్టించాడు. పదార్థాన్ని తిరగేసి భావాన్ని నిలిపాడు. ప్లేటో భావవాదాన్ని ముందుకు నడిపాడు బర్క్లీ.

భౌతిక వాదులు ఏమంటారు? అంతా పదార్థమే అంటారు. భావాలు కూడా భౌతిక పదార్థం యొక్క పరిణామం అంటారు.

◆ ◆ ◆

భారతీయ తాత్వికత ఫాసిజాన్ని బలపరుస్తుందా?

భారతీయ తాత్వికులు చార్వాకుడి నుంచి అద్వైతుల వరకు అందరూ భౌతిక భావ వాదాలలో యిమడరు. వారు స్వభావ వాదులు. అంతా స్వభావ సిద్ధం. దానికి అదిగా వుంది. దానికి అదిగా వుంది అనడం వల్ల కార్యకారణ తర్కం కూడా స్వభావ వాదానికి గురైంది. నిరీశ్వర వాదులైన సాంఖ్యులు కారణంలోనే కార్యం వుంది అన్నారు అంటే కార్యకారణ అభేదం. రెండింటినీ విభజించలేం. అంటే అవ్యక్తమైనది వ్యక్తం, సూక్ష్మమైనది స్థూలంగా వ్యక్తమౌతుంది. బయట పడుతుంది. ఒకటి మరొకటిగా మారడం కాదు. ఒకటి నుంచి మరొకటి రావడం కాదు. ఒకటే ఒకటిగా వ్యక్తమౌతోంది. పూర్ణమిదః పూర్ణమిదం.. పూర్ణం నుంచి పూర్ణాన్ని తీసేస్తే పూర్ణమే మిగులుతుంది. ప్రతిదీ దానికి అదిగా పరిపూర్ణం.

గడ్డిపరకతో విప్లవం అనే పుస్తకం రాసిన జపాన్ ప్రకృతి వ్యవసాయదారుడు ఫుకు ఓకా అంటారు "ఐన్‌స్టీన్ సాపేక్ష వాదాన్ని సృష్టించి విధ్వంసానికి కారణమయ్యాడు. ప్రతీదీ దానికి అదిగా పరిపూర్ణం."

బౌద్ధం నుంచి సాపేక్ష వాదం ఆవిర్భవించిన మాట నిజమే. బౌద్ధులు పరతః ప్రమాణంపై ఆధారపడ్తారు. ముఖ్యంగా బౌద్ధ నాగార్జునుడు, శూన్యవాది. ఒకదాన్ని నిరూపించడానికి, ఒకదాని అస్తిత్వాన్ని స్థాపించడానికి మరోదానిపై ఆధారపడక తప్పదు. అయితే ఇది ఐన్‌స్టీన్ సాపేక్షవాదం వంటిది కాదు. ఐన్‌స్టీన్ ఆబ్జక్టివ్, ద్రష్ట (అబ్జర్వర్) పరిశీలించే విధంగా పరిశోధనకి అందే రీతిగా స్థల కాలాలని నిలిపాడు. కానీ బౌద్ధం కూడా స్వభావవాదమే మరో రీతిలో.

బౌద్ధ శూన్యవాదులు ఏమన్నారు? ఒకదాని అస్తిత్వాన్ని నిరూపించడానికి మరోదానిపై ఆధారపడాలి. దానిపైన ఆధారపడడానికి మరోదానిపై ఆధారపడాలి. యిది అంతులేని గొలుసు. చివరికి అస్తిత్వాన్ని నిరూపించడం అసాధ్యం కనుక వస్తువులు

శూన్యాలు. అసలా ప్రయాస ఎందుకు? ఆ వృధా ప్రయాస వల్ల అంతులేని అవ్యవస్థ వస్తోంది. అసలు వస్తువులన్నీ స్వభావ సిద్ధాలు అనేస్తే అది అంతటా అదే వస్తువుల అస్తిత్వం సిద్ధిస్తుంది. యిది స్వతఃప్రమాణవాదులైన మీమాంసకుల తర్కం. సాంఖ్యులు కార్యకారణ అభేదం అనేది యిటువంటిదే.

అసలు రుగ్వేదం నాసదీయ సూక్తంలోనే యీ స్వభావ వాదానికి బీజాలు పడ్డాయి. సృష్టికర్త యైన భగవంతుడు వుంటే, ఆ సృష్టిలో ప్రకృతిలో భాగమైన మనుషులూ దేవతలూ కూడా ఆ దేవుడిని తెలుసుకోలేరు. అలాగే సృష్టిలో భాగమైన మనుషులూ దేవతలూ సృష్టికి ముందు ఏం జరిగిందో ఏం వుందో తెలుసుకోలేరు. ఎందుకంటే వారు సృష్టిలో ప్రకృతిలో భాగం కనుక. వస్తు జగత్తులో భాగమైన వాళ్ళు వట్టి శూన్యాన్ని ఎలా అర్థం చేసుకుంటారు. లేకవస్తు జగత్తుకి బయట, పదార్థ జగత్తు చలనానికి బయట వున్నదాన్ని ఎలా గ్రహిస్తారు?

ఆధునిక సైన్స్ కూడా బిగ్ బాంగ్‌కి ముందు ఏం జరిగిందో మనం తెలుసుకోలేం అంటోంది. ఎందుకంటే అక్కడ మనం జీవిస్తున్న కార్యకారణ సంబంధం, స్థల కాలాలు పనిచేయవు. అలా పనిచేస్తే అది ప్రకృతికి పూర్వస్థితి కాలేదు.

భారతీయ స్వభావ వాదం స్థల కాలాల్లోని కార్యకారణ సంబంధంలోని తీవ్ర పరిమితులని గుర్తించింది. సరిగ్గా ఈ కారణం వల్లనే పాశ్చాత్యంలో ఎదిగిన విజ్ఞాన శాస్త్రం, టెక్నాలజీ ఇక్కడ ఆవిర్భవించలేదు.

రామ్ మనోహర్ లోహియా, ఐన్‌స్టీన్ దగ్గరికి వెళ్ళి అంటాడు మా గాంధీ మహాత్ముడు ప్రపంచ శాంతిని సాధించే సత్యం కోసం అన్వేషిస్తున్నాడు. నీవు ప్రపంచ మానవాళి వినాశనానికి మూలమయ్యే అణు బాంబుని కనుగొన్నావు. నీ విజ్ఞానం అక్కడికి దారితీసింది

మంత్రనగరి సరిహద్దులు ముట్టకు అనేది భారతీయుల తత్వం. ప్రాచ్యతత్వం. జపాన్ ప్రకృతి తత్వవేత్త ఫుకు ఓకా అంటాడు – ఇతర గ్రహాలకి ప్రయాణం ఎందుకు? భూమిలాగే ఆ గ్రహాలని కూడా పాడుబెట్టడానికా? అంతకన్న భూమిని స్వచ్ఛంగా నిలపండి. ఇదే దృష్టితో మిత్రుడు కవి అవ్వారి నాగరాజు స్టీఫెన్ హాకింగ్‌ని తప్పుబట్టాడు.

ప్రకృతిలో ఐక్యతని బలపరిచే భారతీయ హోలిస్టిక్ దృక్పథం, స్వభావ వాదం యథాతథ స్థితిని హిందూ ఫాసిజాన్ని బలోపేతం చేస్తుంది అంటారు మీరానందా అనే సామాజిక శాస్త్రవేత్త. జాన్‌డ్యూయీ అనే అమెరికన్ తత్వవేత్తని అనుసరించే అంబేద్కరిజాన్ని భారతీయ తాత్వికతకి విరుగుడుగా ప్రతిపాదిస్తుంది మీరానందా. (ప్రొఫెట్స్ ఫేసింగ్ బ్యాక్వర్డ్)**మీరానందా ఇలా అభిప్రాయపడింది:**

అసలు ప్రకృతికీ, మనిషికీ ఐక్యతని ప్రతిపాదించడమే హేతు విరుద్ధతకి దారితీస్తుంది. ప్రకృతి నుంచి వేరుపడి, ప్రకృతిని ఆబ్జక్టివ్ దృష్టిలో చూసి ప్రకృతిని మారుస్తూ రావడం వల్లనే మానవుడు నాగరికతని సాధించాడు. ప్రకృతీ – మనిషీ

ఒకటే అనే దృక్పథం మార్పుకి వ్యతిరేకం. సైన్సుకీ, మానవతా వాదానికీ ఎదురీదడం.

ప్రకృతికంటే మనిషి వేరు, ప్రకృతి నుంచి దూరం జరిగి దానిపై ఆధిపత్యం నెరుపుతూ రావడం వల్లే మనిషి మనిషి అయ్యాడు. ప్రకృతితో ఐక్యతతో జీవిస్తే మనిషి జంతువుగానే మిగిలిపోయేవాడు.

మనిషినీ, ప్రకృతినీ వేరుపరిచే కంచె వుండడమే ప్రకృతికీ మనిషికీ కూడా క్షేమదాయకం. ఇలా దూరాన్ని పాటిస్తూ ప్రకృతిని ఆబ్జక్టివ్‌గా విశ్లేషించడం వల్లనే మనిషి పర్యావరణ పరిరక్షణ కూడా చేయగలడు. తననీ ప్రకృతినీ రక్షించుకోగలడు.

ప్రకృతికీ మనిషికీ, ద్రష్టకీ, దృశ్యానికీ, జ్ఞాతకీ జ్ఞేయానికీ మధ్య అద్వైతానికి దారితీసే భారతీయ దృక్పథం మానవ సమాజానికి క్షేమకరం కాదు. అంతేకాదు అదే హిందూ ఫాసిజానికి మూలం అని మీరానందా అంటారు.

మీరానందా ఆలోచనలు ఇండియా గురించి కార్ల్ మార్క్స్ ఆలోచనలతో సరితూగుతాయి. మార్క్సు భారతీయ సంస్కృతిని, ఆచారాలని, విశ్వాసాలని తీవ్రంగా విమర్శిస్తాడు. భారతీయులు ప్రకృతి ఆరాధకులు. ప్రకృతిపై సార్వభౌమత్వం వహించే మనిషిని ప్రకృతి స్థాయికి దిగజారుస్తున్నారు ప్రకృతి ఆరాధకులైన యిండియన్లు. భారతీయుల జంతు ఆరాధన వారిని జంతు స్థాయిలోనే మిగిల్చేస్తోంది. యిది మార్క్సు హృదయం.

మీరానందా ఆలోచనలు మార్క్సుకి కొనసాగింపే. ఆవిడ దృష్టిలో గాంధీ వాదానికి కొనసాగింపే హిందుత్వ. రైతు ఉద్యమాలు, స్వదేశీ ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు సోషలిజం యివన్నీ గాంధేయమార్గం ద్వారా హిందూ ఫాసిజంలోకి దారితీశాయి. యిక్కడి మార్క్సిజం కూడా గాంధేయవాద పరిమితులకి లోనైంది అని మీరానందా అంటారు. ప్రకృతిపై మనిషి సార్వభౌమత్వాన్ని కాక ప్రకృతితో మనిషి ఐక్యతని ప్రతిపాదించే భారతీయ దృక్పథంలోనే ఈ లోపం వుంది అని తాత్విక వివరణ యిస్తారు మీరానందా.

భారతీయ హోలిస్టిక్ దృక్పథాన్ని ప్రకృతితోనో ప్రకృతికి మూలమైన పరమాత్మ తోనో భగవంతునితోనో ఐక్యతని చెప్పే భారతీయ దృక్పథాన్ని యుగోస్లేవియా కమ్యూనిస్టు తాత్వికుడు జిజక్ ఖండిస్తాడు. ఆ క్రమంలో బౌద్ధాన్ని ఆయన తూర్పారబడతాడు. జిజక్ అనేదేమిటంటే – బౌద్ధం చెప్పేది మానసిక మార్పు మాత్రమే. అంతేకానీ భౌతిక జగత్తులో వాస్తవంలో వచ్చే మార్పుని కాదు. యిటువంటి దృష్టి ఎటువంటి మానవ విముక్తి సిద్ధాంతాన్నీ ప్రతిపాదించలేదు. అంటే ఒక వ్యక్తి తనకీ ప్రపంచానికీ మధ్య అభేదాన్నీ సమన్వయాన్నీ ఆంతరంగికంగా అనుభూతి చెందుతాడు. దానివల్ల శాంతిని పొందుతాడు.

జపాన్ బుద్ధిస్టు సుజుకి మాటలని ఉటంకిస్తాడు జిజక్. సుజుకి అంటాడు – బుద్ధిస్టు ధ్యాన స్థితిలోకి ఎవరైనా వెళ్లవచ్చు. అతడు నాజీయా కమ్యూనిస్టా అతడి మతం ఏమిటి... వేటితోనూ సంబంధం లేదు. అతడు వాస్తవంగా ఏదైనా కావచ్చు అతడు

హంతకుడు కూడా కావచ్చు. యిది జపాన్ మిలటరిజానికి బలాన్ని చేకూర్చింది అంటాడు.

అందువల్ల ప్రాచ్య తత్వమును మూలమట్టంగా ఖండిస్తూ క్రైస్తవంలో పాశ్చాత్య తత్వంలో పాశ్చాత్య చరిత్రలో మానవ విముక్తి దాయక సిద్ధాంతాన్ని వెదికాడు జిజక్. క్రైస్తవం అద్వైతాన్ని ఏమాత్రం ప్రతిపాదించదు. దేవుడు, మనిషి, ప్రకృతి వీటిమధ్య భేదాన్ని పాటిస్తూ, ప్రకృతిపై మనిషిని నిలిపింది. క్వాంటం ఫిజిక్స్ తర్వాత దేవుడు చనిపోయాడు. యిప్పుడు మనిషి స్వతంత్రంగా మిగిలాడు. పూర్తి నిర్ణయ స్వేచ్ఛని పొందాడు అంటూ ఎథీయిస్టు క్రిస్టియానిటీని ప్రతిపాదిస్తాడు జిజక్. ప్రకృతిని దేవతగా ఆరాధించే తత్వం వల్ల కాక ప్రకృతిని ప్రకృతిగా చూడడం, ప్రకృతిని ధ్వంసం చేయడం వల్ల నష్టాన్ని గ్రహించి తగిన చర్యలు తీసుకోవడం వల్ల మాత్రమే పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది అంటాడు జిజక్.

దీనికి కొనసాగింపా అన్నట్లు మీరానందా భారతీయ పర్యావరణ వాదుల సెంటిమెంట్లు, కమ్యూనిస్టుల గ్రామం సెంటిమెంటు చివరికి హిందుత్వ ఫాసిజానికి దారితీస్తోంది అని విమర్శించారు.

అంబేద్కర్ బౌద్ధమతాన్ని కేవల సామాజిక అవసరంగా ప్రాగ్మాటిస్టు దృష్టితో స్వీకరించాడు అంటారు మీరానంద్. బుద్ధిస్టు మెటాఫిజిక్సుని (కర్మ, పునర్జన్మ..) పక్కనబెట్టారు అని గుర్తు చేస్తారు. యిదే ఆలోచనతో కావచ్చు బుద్ధిజాన్ని పూర్తిగా వ్యతిరేకించే జిజక్ ఇండియాకి వచ్చినపుడు అంబేద్కర్ని ఆకాశానికి ఎత్తారు. గాంధీని తూర్పారబట్టారు. అంబేద్కర్ బౌద్ధమత స్వీకరణని, మార్క్సు జ్యూయిష్ క్వశ్చన్ గ్రంథంలో యూదు మత ఐడెంటిటీని రాజకీయ కారణాలతో సమర్ధించడంతో పోలుస్తారు కొందరు.

అయితే సామాజిక శాస్త్రవేత్త ఆనంద్ తేల్తుంబ్డే బౌద్ధంలోని ప్రకృతి ప్రియత్వాన్ని పర్యావరణ దృక్పథాన్ని అంబేద్కర్ దూరంగా పెట్టడాన్ని విమర్శిస్తారు.

భారతీయ పర్యావరణ దృక్పథాన్ని, పర్యావరణ ఉద్యమాలని హిందుత్వ ఛాందసంగా కొట్టేస్తారు మీరానందా. ఇలాంటి ఆలోచనలు ఒకప్పుడు కొందరు కమ్యూనిస్టులు చేసినవే. పర్యావరణ దృక్పథాన్ని యంత్ర విధ్వంసంతో పోల్చారు కొందరు కమ్యూనిస్టులు. గాంధేయవాదాన్ని తిరోగమనంగా, చివరికి ఫాసిజానికి దారిగా భావించారు. ఆధునిక నాగరికత పట్ల సందేహం వ్యక్తం చేయడాన్నే వారు సైన్సు వ్యతిరేకతగా తిరోగమనంగా ఫాసిజానికి దారిగా భావించారు.

(ఫాసిజమ్ అండ్ సోషల్ రివల్యూషన్ – ఆర్. పామే దత్)

అయితే ఈనాడు విజ్ఞాన శాస్త్రవేత్తలే పర్యావరణ విధ్వంసం వల్ల మానవజాతికి ముప్పు తప్పదని ప్రళయం గురించి చెప్పి భయపెడ్తున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్, బ్రెజిల్ అధ్యక్షుడు పర్యావరణ దృక్పథాన్ని పరిహాసం చేశారు.

పర్యావరణ ఉద్యమాలన్నీ అగ్రవర్ణ దృక్పథంతో కూడుకున్నవి కనుక దళిత వ్యతిరేకమైనవి అని కొందరు వాదించారు. (ముకుల్ శర్మ)

అయితే మీరానందా లాంటి అంబేద్కరిస్టులు గుర్తించనిది ఏమిటంటే – దళితవాదులు, దళితులు, దళిత ప్రభుత్వం బిజెపికి మద్దతుగా నిలవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? బిజెపి మద్దతుతో ప్రభుత్వం నడిపిన మాయావతి గుజరాత్ మారణకాండ పట్ల మౌనం వహించారు. చివరికి తెలుగుదేశం పార్టీ కూడా ఖండించింది. అలాగే దళిత్ పాంథర్స్ పార్టీ నాయకులు, ఉదిత్ రాజు లాంటి బుద్ధిస్టులు హిందుత్వ పార్టీలో కలిసిపోయారు. దళితులలోని కొన్ని వర్గాలు బలపరచడం వల్లనే హిందుత్వ ప్రభుత్వం ఏర్పడింది. అసలు అంబేద్కర్ ఆలోచనలలోనే హిందూ జాతీయతకి మూలాలు వున్నాయి. ముస్లిం వ్యతిరేకత వుంది.

కానీ అంబేద్కర్ కూడా భారతీయ ఆరాధనా పద్ధతిలోకి యిమిడిపోయాడు. మహారాష్ట్ర నవ బౌద్ధులు అనేక దేవీ దేవతలతో పాటు అంబేద్కర్ని కలిపి పూజించడం మొదలుపెట్టారు. అంటే అంబేద్కర్ బుద్ధుడితో పాటు ముక్కోటి దేవతలతో కలిసిపోయాడు. అంటే ప్రకృతికి అతీతంగా మానవుడ్ని నిలపాలన్న అంబేద్కర్ పాశ్చాత్య దృక్పథం విఫలమై అంబేద్కర్ కూడా నేచురలైజ్ అయిపోయాడు నేచర్ (ప్రకృతి)లో కలిసిపోయాడు.

ప్రకృతికీ మనిషికీ, మనుషుల్లోని వివిధ వర్గాలకి మధ్య సాంస్కృతిక, సామాజిక భేదాలని అలాగే నిలిపి సంఘర్షణ ద్వారా సమస్యని పరిష్కరించవచ్చుననే ఆధునిక దృష్టి నిరంతరం విఫలమైంది. అలాంటి ప్రతిపాదనలు చేసిన అంబేద్కర్ లాంటి వారు కూడా ప్రకృతిలో కలిసిపోయారు. అంటే ఆరాధనీయ దేవతలుగా మారిపోయారు. పాశ్చాత్యంలో దేవుడు అంటే ప్రకృతికి అతీతుడు అని అర్థం. ప్రాచ్యంలో భారత ఖండంలో దేవుడు అంటే ప్రకృతితో అభేదం చెందిన వాడు. అందుకే దేవీ దేవతలకి ప్రాకృతిక లక్షణాలు ఎక్కువ.

భారత ఖండంలో చైనాలో జరిగిన రైతాంగ తిరుగుబాట్లు వంటివి లేవని, భారతదేశంలో అనాదిగా విప్లవాత్మక మార్పులు నిలిచిపోయాయనే వాదనలు వున్నాయి. అయితే భక్తి ఉద్యమాలు యిస్లాం ప్రభావంతో ప్రభవించాయి కానీ దేవుడు అనే భావనని అద్వైతీకరించాయి. దానితో విప్లవంతో కాక సామాజిక సామరస్యంలోకి ఈ భక్తి ఉ ద్యమాలు దారితీశాయి.

భారత ఖండంలో 'మార్పు లేదు' అనే వాదన పాశ్చాత్యంతో పోల్చడం వల్ల సంభవించింది. నేను ముందు చెప్పినట్లు చుట్టూ వున్న ఆసియా దేశాలు అనేక దేశాలకన్నా భారతదేశం మత సామరస్యంతో జీవిస్తూ వచ్చిందంటే సనాతన దృక్పథమే కారణం. పాశ్చాత్య ప్రభావాల నుంచి హిందుత్వ పుట్టిన మాట నిజమే కానీ శ్రీలంక, బర్మా, పాకిస్తాన్, చైనాలలా నియంతృత్వ మతరాజ్యంగా డైరెక్టుగా భారతదేశం పర్యవసించలేదు అంటే సనాతనమే కారణం. సనాతనం సర్వధర్మ సమభావనకి సామరస్యానికి స్థానం కల్పిస్తోంది.

పాశ్చాత్య విద్య వల్ల ఆధునిక టెక్నాలజీ వల్ల సనాతన సామరస్యానికి దెబ్బ తగులుతున్నా, నిరక్షరాస్యులు దేశాన్ని కాపాడుతున్నారు,. ఎందుకంటే ప్రకృతిని, ఇతర సమాజాలనీ, ఇతర మతాలనీ, దేశాలనీ ద్వేషభావంతో అదర్ (ఇతరం)గా చూసే పాశ్చాత్య సంస్కారం వారికి అలవడలేదు. అందుకే అనేక దుర్మార్గ చట్టాలకి వ్యతిరేకంగా పోరాడుతున్నది నిరక్షరాస్యులే. అసలు ఈ నియంతృత్వ చట్టాలకి మూలమైన ప్రివెంటివ్ డిటెన్షన్ లా ని అనేకమంది వ్యతిరేకించినప్పటికీ బలంగా సమర్థించినది అంబేద్కర్ (రాజ్యాంగ సభలో). దీనివల్ల కేవలం దేశానికి రాజ్యానికి ప్రమాదం అనే సందేహంతో యే ఆధారాలు లేకపోయినా ఒక వ్యక్తిని నిర్బంధించవచ్చు. ఇటువంటి చట్టాలు యిప్పటికీ కొనసాగుతున్నాయి. యిటువంటి చట్టాలు బ్రిటిష్ వారి నుంచి వారసత్వంగా వచ్చాయి.

ఒకదానిపైన మరొకదాని అధికారాన్ని అన్నిటిపైన భగవంతుడి అధికారాన్నీ నిలపాలన్న పాశ్చాత్య తాత్వికతకి, అంబేద్కర్ నియంతృత్వ చట్టాలని సమర్థించడానికీ లంకె కుదురుతుంది. గ్రామాలపైన రాష్ట్రాలు, రాష్ట్రాలు అన్నిటిపైన కేంద్రం అజమాయిషీ కొనసాగించాలంటే రాజ్యం కోసం వ్యక్తిని బలిచేయవలసిందే. (పాశ్చాత్యంలో ప్రకృతి పైన మనిషి, మనిషిపైన దేవుడు రాజ్యం చేస్తారు. దేవుని రాజ్యం అనే బలమైన దృక్పథం కేంద్రీకృత అధికారానికి గొప్ప శక్తినిచ్చింది)

గాంధీ గ్రామ స్వరాజ్యం అనే భావన వికేంద్రీకరణని బలపరిచింది. భారతీయ సనాతన బహుళత్వంలో వికేంద్రీకరణ వుంది. యిప్పుడు రైతులు ఈ వికేంద్రీకరణ కోసమే పోరాడుతున్నారు.

పాశ్చాత్య తరహా రాజ్య నమూనా మాత్రమే కాదు, టెక్నాలజీ కూడా కేంద్రీకరణకి ప్రాధాన్యం ఇస్తుంది. నిజానికి దీనిలో వ్యక్తి మాయమౌతాడు. నిజానికి వ్యక్తి పరాయీకరణనే వ్యక్తి పేరుతో పిలవడం పాశ్చాత్యంలోని వైరుధ్యం.

పాశ్చాత్య ఆధునికత వ్యక్తి ఆవిర్భావానికి మూలం అనేది ఒక భ్రమ. నిజానికి వ్యక్తినీ వ్యక్తి స్వతంత్రతని అది బలిపెట్టింది. జపాన్ ప్రకృతి వ్యవసాయదారుడు, తత్వవేత్త ఫుకు ఓకా అంటాడు "ఒకప్పుడు తక్కువ భూమినే సాగుచేస్తూ బతికిన రైతులు కవిత్వం రాసే వారు అంటాడు. విలియం డాల్ రింప్ లాస్ట్ మొగల్ పరిపాలనా కాలంలో కవిత్వం చెప్పే రిక్షావాలాలు గురించి రాశాడు.

వ్యక్తీకరించబడే వాడే వ్యక్తి. వ్యక్తం చేయడానికి ఏమీ లేని వాడే, ఖాళీ డబ్బాయే వ్యక్తి అని ఆధునికత చెప్పింది. అలాంటి సారంలేని వ్యక్తి కాని వ్యక్తులని నానా చెత్తతో నింపుతుంది మార్కెట్. ఆ మార్కెట్‌నే విద్య అని, వైద్యమని రకరకాల పేర్లతో పిలుస్తారు. వ్యక్తీకరణ ఖాళీ చేయబడిన వ్యక్తుల్ని రాజ్యం తన చెప్పుచేతల్లోకి తీసుకుంటుంది. హిందూ రాజ్యం అటువంటి కేంద్రీకృత నియంతృత్వానికి సంకేతం. దానిలో బ్రాహ్మడి దగ్గర నుంచి దళితుల వరకు అందరూ రాజ్యానికి నట్లు బోల్టులుగా మారతారు. ఒకరిని మరొకరు నిందించుకోవడం ఒక ప్రహసనం.

అసలు విషయం రాజ్యం, కేంద్రీకృత రాజ్యం పట్ల ఆధునిక భక్తి. దీనికి ఒకే ట్రాన్సెండెంటల్ దేవుడి భావన తాత్విక భూమిక. 17వ శతాబ్దాన్ని క్షీణ యుగంగా వర్ణించారు. కమ్యూనిస్టు మేధావి కె.వి.ఆర్. దానికి కారణం ఒక పెద్ద కేంద్రీకృత రాజ్యం. దానితోపాటు పెద్ద ప్రబంధాల ఆవిర్భావం ఆగిపోవడమే. నిజానికి రాజ్యం బలహీనపడినపుడే గొప్ప సంస్కృతి ఆవిర్భవిస్తుంది అంటాడు తత్వవేత్త నీషే. తెలుగునాట 17వ శతాబ్దంలోనే త్యాగరాజు, కళా పూర్ణోదయం లాంటి నవలని బోలిన కావ్యం, వేమన, వీరబ్రహ్మం సాహిత్యం ఆవిర్భవించాయి. శతక సాహిత్యం కూడా.

మహా ప్రబంధాలని, కేంద్రీకృత రాజ్యాలని ఆధునికులు యిష్టపడ్తారు. అలాగే మెగా ప్రాజెక్టులూ, పెద్ద యంత్రాలని కూడా. ఈ విషయంలో ఫోర్డుకీ స్టాలిన్ కీ తేడాలేదు అంటాడు రామ్ మనోహర్ లోహియా.

ఈ నాగరికత వ్యక్తి పేరుతోనే వ్యక్తిత్వాన్ని హరిస్తుంది. ఆ ఖాళీలో రాజ్యాన్ని నింపుతుంది.

ఈ రాజ్య నియంతృత్వానికి భారతీయ సనాతనంలో పరిష్కారం లభించే అవకాశం వుంది.

వ్యక్త అవ్యక్తాల మధ్య సంచరించే వాడే వ్యక్తి, అతడే జీవుడు.

జీవిత మృత్యువులు, జన్మ మృత్యువులు, జన్మ పునర్జన్మలు, పరా వైఖరీ వాక్కులు, నిర్వికల్ప సవికల్పక జ్ఞానం..

యిలా ప్రతి దానిలోనూ అవ్యక్తం, వ్యక్తం కలిసి వుంటాయి. భూమి ఆకాశాలు కూడా అంతే. అంటే పదార్థం కూడా వ్యక్త అవ్యక్త స్థితులలో చరిస్తుంది.

వ్యక్తానికంటే అవ్యక్తానికే స్థాయి ఎక్కువ. శబ్దంకంటే నిశ్శబ్దం శక్తివంతం. అర్థం కంటే శబ్దం స్వరం గొప్పవి.

సృష్టికన్న దృష్టి సూక్ష్మమైనది, బీజప్రాయమైనది. ఎందుకంటే దృష్టే సృష్టి అని వేదాంతం. నువ్వెలా చూస్తున్నావన్న దాన్నిబట్టి ప్రపంచం వుంటుంది. అందుకే జైనులు సప్తభంగినయం పేరుతో ఒకదాన్నే అనేక విధాలుగా చూడవచ్చును అన్నారు.

మీమాంసకులు చూడడాన్ని ఒక యాక్టివిటీగా చూశారు "ఒక పదార్థం జ్ఞానాన్ని సృష్టిస్తోంది. అదే సమయంలో పదార్థంలో జ్ఞేయత అనేదాన్ని కూడా సృష్టిస్తోంది" అంటారు భాట్ట మీమాంసకులు.

సంఖ్యలు భూత భవిష్యత్ వర్తమాన కాలాల్లోని అన్నిరోజులకీ వర్తించినట్లే అన్ని కాలాల పదార్థాలలోనూ జ్ఞేయత అనేది సిద్ధిస్తుంది. జ్ఞేయత (తెలుసుకోబడడం) అనేదాన్ని పాకంతో పోలుస్తాడు మీమాంసకుడు. అన్నం ఉడికినపుడు పాకత్వం (ఉడకడం) ఎలా సిద్ధిస్తోందో అలాగే జ్ఞేయత అనేది సిద్ధిస్తోంది.

దీనిలో మీమాంసకుడు చూడడం తెలుసుకోవడాలని జ్ఞాత జ్ఞేయం మధ్య జరిగే ఒకానొక క్రియాశీలతగా వర్ణిస్తున్నాడు. మీమాంస తత్వం ప్రకారం వాక్యంలోని సకల శబ్దాలూ క్రియా వాక్యంలో పర్యవసిస్తాయి క్రియే ప్రధానం.

యజ్ఞ క్రియ యొక్క ఫలితం 'అదృష్టం' ద్వారా సిద్ధిస్తోంది. అదృష్టం అంటే దేవుడు కాదు. కనబడనది, తెలుసుకోలేనిది, చూడబడనిది. యిలా నెగిటివ్‌గా చెప్పబడిందే కానీ పాజిటివ్‌గా నిర్వచించబడలేదు.

నైయాయికులు అభావాన్ని కూడా పదార్థాలలో జేర్చారు. కారణం నెగిటివ్ వ్యక్తీకరణే అసలు సత్యాన్ని తెలియజేయగలదు అనే భారతీయ దృష్టి. బుద్ధుడు కూడా దేవుడు లేడు అనలేదు, ఉన్నాడు అనలేదు దేవుడి పట్ల మౌనం వహించాడు. దాన్ని గురించి వ్యాఖ్యానించడం కుదరదు అన్నాడు. అవ్యాకరణీయ ప్రశ్నలు అన్నాడు.

వేదాంతులు నేతి నేతి.. అది కాదు అది కాదు అంటూ పరమ సత్యాన్ని గురించి వ్యాఖ్యానించారు కానీ ఏది సత్యమో చెప్పలేదు.

కనబడనిది, వ్యక్తం కానిది అసలు ఫలితం అదే. జీవితంలోనూ చరిత్రలోనూ కూడా పర్యవసానాలు తెలియరానివి. దీన్నే దైవం, విధి అన్నారు.

ఇలా అదృష్టం, అవ్యక్తత, అనిర్వచనీయత ఎంతో ముఖ్యమైనది. దానిపైనే అనంత కార్యకలాపం జరుగుతోంది. కర్మ నుంచి పని నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎందుకంటే చూడడమంటేనే అసలు పని. అది జ్ఞేయతని సృష్టిస్తోంది. యిక్కడ ఆసక్తికరంగా గణితం ప్రసక్తి తెచ్చాడు మీమాంసకుడు. చివరికి ఆధునిక విజ్ఞాన శాస్త్రం చూడడం అంటే తెలుసుకోవడం అంటే లెక్కించడం అని సంక్లిష్ట గణితంలోకి దారితీసింది.

ద్రష్ట (చూసేవాడు) దృశ్యాన్ని చూస్తున్నప్పుడు దృశ్యం మారిపోతుంది అన్నాడు. క్వాంటం విజ్ఞానవేత్త. జ్ఞేయత సిద్ధిస్తుంది అంటాడు మీమాంసాకారుడు. క్వాంటం విజ్ఞాన శాస్త్రవేత్త కూడా గణిత సమీకరణాల ద్వారా జ్ఞేయత (తెలుసుకోబడడం) సాధిస్తాడు. కానీ అసలు వస్తు స్థితిని పట్టుకోవడం సాధ్యం కాదు. రేండంనెస్, అనిశ్చితి, ప్రాబబులిటీ వెంటాడ్తాయి.

యిక్కడే ద్రష్ట దృశ్యం మధ్య అద్వైతం ప్రవేశించింది. ద్రష్ట మీద దృశ్యం ఆధారపడ్తున్నపుడు సబ్జెక్టివిటీ ప్రవేశిస్తోంది. అప్పుడు ద్రష్ట దృశ్యాలని వేరుపరచడం ఎలా అనే ప్రశ్న ఉదయిస్తోంది. యిక్కడే 'అద్వైతం' ప్రాధాన్యం వహిస్తోంది.

ద్రష్టకీ దృశ్యానికీ మధ్య దూరాన్ని చెరిపేసే క్వాంటం భాషని చూసి సోవియట్ సైంటిస్టులు భయపడిపోయారు, తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. అన్సర్టైనిటీ, ప్రాబబులిటీ లాంటి పదాలు సంప్రదాయ భౌతిక శాస్త్రంలోని ఖచ్చితత్వాన్ని పక్కకి తప్పించాయి. దానితో వస్తుతత్వం దెబ్బతింది.

ఈలోగా ష్రోడింగర్ పిల్లి లాంటి క్వాంటం కథలు ఆబ్జక్టివిటీకి ఎసరుపెట్టాయి. దానితో పాత సీసాలో కొత్త సారా, పాత భాషలో కొత్త జ్ఞానాన్ని యిమడ్చడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ వైఫల్యం సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తల ఉక్రోషంగా మారింది. ఎంత సూక్ష్మ పదార్ధంపై పరిశోధన చేస్తున్నా, సబ్జక్టు ఆబ్జెక్టు విభజన యధాతథంగా సాగుతుంది అన్నాడు లెనిన్. దాన్ని కోట్ చేస్తూ కొత్త క్వాంటం పరిభాషని ఎదిరించారు సోవియట్ సైంటిస్టులు (ఫిలాసఫీ ఆఫ్ ఫిజిక్స్ – హైజన్బర్గ్).

ఇప్పుడు పాశ్చాత్యం ఎదుర్కొంటున్న కొత్త భాష, క్వాంటమ్ భాష ప్రాచ్యానికి భారతఖండానికి చాలా పాత భాష. ఈ వాస్తవాన్ని హైజన్బర్గ్ కూడా గుర్తించారు. క్వాంటమ్ ఫిజిక్స్ పరిభాషని జపాన్ వారు బాగా అర్థం చేసుకొంటున్నారు, దానికి కారణం వారి సంస్కృతి అంటారు.

◆ ◆ ◆

వితండవాది అంటే నిందా?

పాశ్చాత్యం యిలా మన భాషవైపు జరుగుతుండగా, మనం యింకా పాశ్చాత్య ద్వైత భాషలోనే చక్కర్లు కొడ్తున్నాం. ప్రతిదాన్నీ ద్వంద్వాలుగా విడకొడ్తున్నాం. మతాల పేరుతో దేవుడి పేరుతో కొట్టుకు చస్తున్నాం.

పూర్వ శృంగేరీ పీఠాధిపతి చంద్రశేఖర భారతీస్వామి అన్నారు – ప్రపంచమంతా సనాతనమే. కానీ ప్రాంతాలనిబట్టి కొన్ని విశేషమైన నామరూపాలని ధరించింది" అంటారు. అందుకే యితర మతాల నుంచి భారతీయ సనాతన ధర్మంలోకి వస్తానన్న వారిని మీ ధర్మంలోనే కొనసాగండి అని సలహా యిచ్చారు.

ఈ విశాల దృష్టి కనుమరుగవుతోంది. ఎందుకంటే వ్యక్త అవ్యక్తాలకి, ద్రష్ట దృశ్యాలకి ప్రతి దానికి అభేదం అద్వైతం బోధించిన ప్రాచీన సనాతన దృష్టి క్షీణించింది.

భాష విషయంలో సైంటిస్టుల మధ్య జరిగిన వివాదం గురించి వివరించాను. ఈ వివాదాలకి కారణం వారి సాంస్కృతిక నేపథ్యం. సోవియట్ శాస్త్రజ్ఞులు ఫక్తు భౌతికవాదులు. పదార్థమే సత్యం. పదార్థం యొక్క పరిణామమే చైతన్యం. అందువల్ల పదార్థాన్ని చైతన్యం ఆక్రమిస్తుందేమోనన్న ఫోబియా వాళ్ళది.

స్థల కాల సాపేక్షత గురించి భావాలు న్యూటన్ సమయంలోనే వున్నాయి కానీ న్యూటన్ క్రైస్తవ నేపథ్యం వల్ల గుర్తించలేకపోయాడు. క్రైస్తవం ప్రకారం స్థల కాలాలు నిరపేక్షాలు మరి. (కాలం కథ – స్టీఫెన్ హాకింగ్)

సరిగ్గా ఈ క్రైస్తవ నేపథ్యమే ప్రకృతికీ మనిషికీ మధ్య అగాధాన్ని సృష్టించింది. ప్రకృతిని పూర్తిగా మానవ ప్రకృతికి బయటిదిగా మార్చింది. సాంఖ్యం అహం నుంచి సృష్టి మొదలైంది అని చెప్తోంది.

మనిషి సైన్సు పరికరాల ద్వారా తార్కిక పరికరాల ద్వారా ప్రకృతిని అర్థం చేసుకొంటున్నాడు. వ్యాఖ్యానిస్తున్నాడు. యిక్కడ జ్ఞాత ప్రమేయం లేనిదే జ్ఞేయం లేదు. అందువల్ల ప్రకృతి దానికదే పూర్వసిద్ధం కాదు. ప్రకృతిని గురించి మనిషి అవగాహనే ప్రకృతి. దానిలో మనిషి జ్ఞానపు పరిమితులు కూడా వుంటాయి. అందువల్ల మనిషి

ప్రకృతిని పూర్తిగా అర్థం చేసుకోవడం వుండదు. వ్యక్తమైనదానికన్నా అవ్యక్తం చాలా వుంటుంది అవ్యక్తం అనంతంగా వుండడం వల్ల వ్యక్తం కూడా సందేహ స్థితిలో వేళ్ళాడ్తూ వుంటుంది. అయినప్పటికీ మన జ్ఞానం ప్రపంచానికి జ్ఞేయతని కల్పిస్తుంటుంది.

అందువల్ల సూర్యకాంతిలో మనం జీవిస్తున్నప్పటికీ సూర్యున్ని చుంబించలేనట్లే, పూర్తి సత్యాన్ని మనం చేరుకోలేం. కానీ దాని వెలుగులో మనం ప్రయాణిస్తూనే వుంటాం.

భారతీయులు భాషా విస్మృతికి లోనయ్యారు. పాశ్చాత్యులు ప్రాపంచిక విజ్ఞానాన్ని వ్యక్తం చేయడానికి కొత్త భాష కోసం అన్వేషిస్తుంటే, భారతీయులు తమ భాషని విస్మరించారు. యింకా చెప్పాలంటే భాషని సందర్భం నుంచి విడదీసి చూడడంతో అర్థరహితంగా మారిపోతోంది. శబ్దార్థాలు పార్వతీ పరమేశ్వరులలా విడదీయరానివి. కానీ శబ్దార్థాలని విడదీయాలని చూస్తున్నారు.

హేతువాది బి. రామకృష్ణ లోకాయతులని వితండ వాదులుగా నిందించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తారు. బ్రాహ్మణులు, మహాయాన బౌద్ధుడైన ధర్మకీర్తి కూడా చార్వాకులని వితండ వాదులని తిట్టారు అంటారు (చార్వాకం)

వితండవాది అంటే నిందా వాచకమా?

ఆశ్చర్యం ఏమిటంటే, మిళింద పన్హా అనే బౌద్ధ గ్రంథంలో నాగసేనుడు అనే బౌద్ధుడు వితండవాదిగానే పిలవబడ్డాడు. యింతకీ వితండవాదం అంటే ఏమిటి? తన పక్షాన్ని స్థాపించకుండా పరపక్షాన్ని పరపక్షపు లాజిక్‌తోనే ప్రశ్నించడం, గొప్ప అద్వైతియైన శ్రీహర్షుడు 'ఖండన ఖండ ఖాద్యం'లో అవలంభించినది వితండవాదాన్నే.

భారత ఖండంలో ఫక్తు నిందార్థకం అంటూ ఏదీ లేదు. నింద కూడా స్తుత్యర్థకంగా మారగలదు. వ్యాజ నింద అంటే అదే. అలాగే పైకి చూస్తున్నపుడు, వితండవాదం అనేది నిందగా కనిపిస్తుంది అంటే స్వంతంగా ఏమీ చెప్పడు. యితరులని ఖండించడమే పని అనే అర్థం వస్తుంది. స్వంతంగా తప్పకుండా ఏదైనా చెప్పాలా, ఏదైనా స్థాపించాలా?

అంతా భాషలోనే వుంది, భాష బయట ఏమీలేదు అనే దృష్టి సనాతనం కాదు. ప్రతీదీ తర్కంతో సిద్ధించదు. అసలు తర్కంతో ఏదీ సిద్ధించదు. అనవసరమైన వాటిని నెట్టివేయడానికే తర్కం ఉపయోగపడుతుంది. వాదం ఉపయోగపడుతుంది. తర్వాత అసలైనది మిగులుతుంది.

మౌనానికీ ధ్యానానికీ ప్రాధాన్యతనిచ్చే బౌద్ధంలో అద్వైతంలో వాదం పరమం కాదు. అన్ని వాదాలూ వితండవాదాలే. అద్వైతులు శుంభ నిశుంభ న్యాయం గురించి చెప్తారు. ఇద్దరు రాక్షసులు దేవి కోసం తపస్సు చేశారు. దేవి ప్రత్యక్షమైంది. ఏం కావాలో కోరుకొమ్మంది. దేవిని మోహించిన రాక్షసులు, దేవినే వరంగా కోరారు. అప్పుడు దేవి మీరు యిద్దరూ యుద్ధం చేసి ఎవరు గెలిస్తే వారినే వివాహం చేసుకొంటాను అంది. ఇద్దరూ కొట్టుకుని చచ్చిపోయారు. దేవి సాక్షిగా చూస్తూ కూర్చుంది. వాదాలన్నీ యీ

రాక్షసుల వంటివి. సృష్టికి మొదలు వుంది అని వొకడు, లేదు అని మరొకడు వాదిస్తాడు. అద్వైతి మౌనం వహిస్తాడు. అతడు ఏ వాదాన్నీ పట్టించుకోడు.

చార్వాకుడు కూడా ఆస్తికుల వాద వివాదాల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల వాళ్ళ వాదాలతోనే వాళ్లని ఖండించడం వల్ల వితండవాది అనే పేరు వచ్చింది. మరి ఎందుకు బి. రామకృష్ణ అనే నాస్తికుడు ఆగ్రహం వ్యక్తం చేశారు? భారతీయ సాంస్కృతిక నేపథ్యం నుంచి భారతీయ భాషలని చూడక పోవడం వల్ల. భాషా విస్మృతే అసలైన విస్మృతి.

ఒకొక్క భాష ఒకొక్క నేపథ్యం నుంచి, సాంస్కృతిక ధర్మపర నేపథ్యం నుంచి పుడ్తుంది. ఆ నేపథ్యానికి దూరమైతే ఆ భాష ఆ పరిభాష అర్థం కాదు. పాశ్చాత్య విద్య వలన పాశ్చాత్య నేపథ్యంలోంచి భారతీయ గ్రంథాలని అధ్యయనం చేయడం మొదలుపెట్టారు. పాశ్చాత్యంలో దేవుడు అంటే సృష్టికర్త. దేవుడుని నిరాకరించే వారు నాస్తికులు. అంటే క్రియేషనిజాన్ని కాదనే వారు, క్రమ పరిణామాన్ని పరిణామ వాదాన్ని అంగీకరించే వారు.

భారత ఖండంలో క్రియేషనిజం లేనే లేదు. ఆస్తికులైన వైదికులు కూడా దైవాన్ని నిరాకరించిన వారు ఉన్నారు. వేదిక్ రిచ్యువల్‌కి ప్రాధాన్యం యిచ్చే మీమాంసకులు అసలు దేవుడు అనే పదాన్ని యే రూపంలోనూ అంగీకరించరు. అది రిచ్యువల్‌కి అంతరాయం అంటారు. అలాగే సాంఖ్యులు మొదట్లో దేవుడుని అంగీకరించలేదు.

ఐనా పాశ్చాత్యాన్ని పోలిన దైవ భావన మనకి లేదు. ప్రకృతి అనాది. అందువల్ల సృష్టికర్త అనే భావనే లేదు. దేవుడికీ జీవుడికీ అభేదాన్ని అద్వైతాన్ని చాలామంది ప్రతిపాదించారు.

అందువల్ల యిక్కడ వాదాలు, పదాలు, కాంట్రడిక్షన్ (వైరుధ్యం)లో యిరుక్కుపోవు. పరస్పరం కలిసిపోతాయి.

వైర భక్తి అనే పదం వుంది. వైరము భక్తి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. కానీ వైరం కూడా భక్తిగానే చూడబడింది. అదీ భారతీయ వైచిత్రి.

అలాగే వితండ వాదం కూడా వాదమే. వాదం కూడా వితండమే.

పాశ్చాత్యాన్ని పోలిన స్పష్టత కోసం ఆధునికుల పాట్లు భారతీయ భాషా విస్మృతికి కారణమయ్యాయి. సంస్కృతి విస్మృతికి కారణమయ్యాయి.

యిక్కడ ద్వంద్వాలు తప్ప వైరుధ్యాలు లేవు. అందువల్ల ఒకటి మరొకటిగా రూపాంతరం చెందే అవకాశం ఎక్కువ.

ఆధునిక యుగం ప్రశ్నకి ప్రాధాన్యం యిచ్చింది అంటారు. కానీ నిజానికి ప్రశ్నకి స్థానం లేకుండా చేసింది. ముందే సిద్ధం చేసుకున్న సమాధానాలలో ప్రశ్నని యిరికించింది. (నీషే, హిడెగ్గర్ లాంటి తత్వవేత్తలు ఈ సత్యాన్ని గుర్తించారు) ఒకప్పుడు ప్రశ్న అస్తిత్వ మూలాన్ని తాకేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు.

మన పరీక్షల విధానం కూడా దాన్నే ప్రతిబింబిస్తోంది. ప్రశ్నని ప్రశ్నగా ఎక్కుపెట్టే

అవకాశం లేకుండా చేసి, ప్రతీ ప్రశ్నకి సమాధానం సిద్ధంగా వుందిఅనే నమ్మకాన్ని బలపరిచింది. ప్రతీదాన్నీ కార్యకారణ పరిధిలోకి తీసుకురావచ్చునన్న సైన్సు నమ్మకం అన్ని రంగాలలోకి విస్తరించి ప్రశ్న యొక్క స్వతంత్రతని హరించి వేసింది. సమాధానం ప్రాధాన్యం వహించింది.

భారతీయ తత్వంలో ప్రశ్నే ప్రధానం. యిక్కడ ప్రశ్నని సమాధానాన్ని వేరు పరచలేము అని భావించారు. ఈ విశ్వాన్ని ఎవరు సృష్టించారు అనే మౌలిక ప్రశ్నకే వాచ్యమైన సమాధానాన్ని నిరాకరించారు. కానీ పాశ్చాత్యంలో అది ప్రధానమైన ప్రశ్న. సమాధానం వున్న ప్రశ్న.

కేనోపనిషత్తు దేనివల్ల మనస్సు చలిస్తోంది అని మౌలిక ప్రశ్నని ఎక్కుపెట్టింది. అంటే ఆలోచన కూడా ప్రాధమికం కాదు. అస్తిత్వం ప్రాథమికం. స్వభావ సిద్ధమైన అస్తిత్వం. అందుకే సత్‌కి ఉనికికే ప్రాధాన్యం.

ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను అనడం ద్వారా పాశ్చాత్య తాత్వికుడు అస్తిత్వం పైన ఆలోచనని, ఆలోచనపైన పదార్ధ వాస్తవికతని నిలిపాడు. ఈ ప్రక్రియలో అస్తిత్వం మరుగున పడిపోయింది. అస్తిత్వాన్ని తాకే ప్రశ్నలు మరుగునపడిపోయాయి. మళ్ళీ దీనికోసం అస్తిత్వ వాదం అవసరమైంది.

భారత ఖండంలో వేదాంతం అస్తిత్వాన్ని తాకే అమాయకత్వాన్ని కోల్పోయి మార్కెట్ మాయలో లయమైంది. అందువల్లనే ఉపనిషత్తత్వం పరిహాసానికి గురైంది. అది మార్కెట్ మాయాజాలంలో యిరుక్కుపోయింది.

అందువల్ల అద్వైత దృష్టి ద్వారా అస్తిత్వాన్ని తాకే ప్రశ్నలు కనుమరుగు కావడంతో, ప్రశ్న లోతులేనిదిగా మారిపోయింది. యింకా చెప్పాలంటే మితిమీరి బైనరీ ఆపోజిట్‌లో వైరుధ్యాలలో యిరుక్కుపోయిన ఆధునిక ప్రపంచంలో ప్రశ్న అనేది ద్వేషానికి పర్యాయ పదంగా మారింది. నిన్ను నేను ప్రశ్నిస్తున్నాను అంటే నిన్ను నేను ద్వేషిస్తున్నాను అనే అర్థం వచ్చింది.

దీనివల్ల ఏదో ఒక తత్వాన్నీ దృక్పథాన్నీ పైకెత్తి, మిగిలిన దృక్పథాల్ని పరిహాసం చెయ్యడం తిట్టిపోయడం ఆధునికతగా ప్రగతి శీలతగా చలామణిలోకి వచ్చింది.

దీనిలో భాగంగా బ్రాహ్మణ – బౌద్ధ, వైదిక – ద్రావిడ, ఆస్తిక – నాస్తిక ద్వంద్వాల్ని కల్పించి, వొకదానికి మరొకటి పూర్తి విరుద్ధమైనవిగా పరస్పర శత్రుత్వంతో కొట్టుకొనేవిగా చూపడం జరిగింది.

నిజానికి యిటువంటి ఆధునిక సరళ విభజనలో ఎటువంటి లోతైన పరిశోధన లేదు. ఇది బ్రిటీష్ వారు చేసిన హిందూ – ముస్లిం జనగణనలాంటిదే. అసలు కుల వ్యవస్థకి ఒక సైద్ధాంతిక భూమికని కల్పించింది బౌద్ధమేనంటాడు చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్. అహింస, కర్మ సిద్ధాంతం అటువంటి పాత్రని పోషించాయి. అలాగే బ్రాహ్మణులకీ

బౌద్ధులకీ మధ్య బౌద్ధిక చర్చలు జరిగాయి. కానీ అవి ఎటువంటి విప్లవాన్నీ తీసుకురాలేదు. వ్యవహారంలో వున్న అంతరాల్ని బౌద్ధులు కూడా తొలగించడానికి పెద్ద ప్రయత్నమేమీ చేయలేదు. సన్యాసం అనేది బౌద్ధంలోనే కాదు, సనాతన ధర్మంలో కూడా అన్ని కులాల వారికి స్థానం కల్పించింది కానీ వివాహం కుటుంబం విషయంలో కులం పాటించబడింది. వీరశైవంలాంటి భక్తి ఉద్యమాలే కొంతవరకు కుల వ్యవస్థని తాత్కాలికంగా అతిక్రమించాయి.

యింక ఆస్తిక – నాస్తిక విభజన భారతదేశంలో క్లిష్టమైనది. వైదిక ధర్మాన్ని అనుసరించే మీమాంసకులు కూడా దైవాన్ని తిరస్కరించారు. ప్రత్యక్ష ప్రమాణానికి ప్రాధాన్యం యిచ్చారు. భారత ఖండంలోని అందరు తత్వవేత్తలూ ప్రకృతిని స్వయంభువుగా స్వయం చలనంలో వున్నదిగా భావించారు. అందువల్ల చార్వాకుల ప్రత్యేకత ఏమీలేదు.

చార్వాకులు కూడా రాజునీ రాజ్యాన్నీ ధిక్కరించలేదు. రామాయణంలో వైదిక కర్మకాండనీ పితృభక్తినీ ధిక్కరిస్తూ చార్వాకం బోధించిన జాబాలి, తన బోధల పరమార్థం రాముడిని రాజుని చేయడం కోసమేనంటాడు. అంటే రాజు, రాజ్యం చార్వాకులకి కూడా ప్రధానం.

నిజానికి బ్రాహ్మణులూ (వైదిక ధర్మమూ) విజ్ఞాన శాస్త్ర వికాసానికి విరుద్ధమైన వారు అనేది పూర్తిగా తప్పు. నిజానికి నివృత్తి మార్గం సన్యాసం బోధించిన బౌద్ధులు కాదు, వ్యవస్థనీ రాజ్యాన్నీ బలపరచిన బ్రాహ్మణులే ఖగోళ విజ్ఞానం, గణితం, కాలం యొక్క జ్ఞానం (పంచాంగం) వంటి విజ్ఞాన వికాసానికి కారణమయ్యారు అందుకే ఖగోళ గణిత శాస్త్రవేత్తలు పౌరాణిక ప్రతీకలని వాడుకున్నారు.

వైదిక యజ్ఞ కర్మ కాండలో భాగంగానే జామెట్రీగణితంలకి సంబంధించిన శుల్బ సూత్రాలు రాయబడ్డాయి. యివన్నీ పరిశోధనలో తేలిన సత్యాలు కానీ ఆధునిక ఉద్యమ అవసరాలు ప్రయోజనాలూ సత్యాలని మరుగు పరుస్తున్నాయి.

మొత్తంగా ప్రజా సమూహాలని శత్రువర్గాలుగా విభజించడం ఒక రాజకీయ అవసరంగా మారింది. హిందూ దళిత కమ్యూనిస్టులు అందరూ యిదే చేస్తున్నారు. దీనితో ప్రశ్నించే తత్వం అనేది తిట్ల పురాణంగా మారింది.

భారతీయ సనాతన దృష్టి లేనిదే నిజమైన ప్రశ్నలు ఉదయించే అవకాశం లేదు. సనాతనం అంటే స్వభావ సిద్ధం, స్వయం చలనంతో వుండే ప్రకృతి అని అర్థం.

◆ ◆ ◆

ఉపసంహారం

ఇది సనాతనం గురించి ప్రవచనం కాదు, నేను మరో ప్రవచన కారుణ్ణి కాదు.

పరోపకారః పాపాయ

పుణ్యాయ పరపీడనం

అనే కాలంలో మనం జీవిస్తున్నాం. పర ద్వేషం, పరమత ద్వేషం యివే మత్తుమందులా కిక్కిచ్చే కాలంలో వేదాంతమూ సుభాషితమూ ఏక కాలంలో విఫలమౌతాయి.

కనుక నేను ఏ ప్రాచీన గ్రంథాలనో, ఆర్యోక్తులనో తవ్విపోసే పని పెట్టుకోలేదు.

మొదట ఈ పుస్తకం మేధావి మానవ హక్కుల యాక్టివిస్టు భువనగిరి చంద్రశేఖర్‌తో స్నేహం కొనసాగుతున్న కాలంలో ప్రారంభించాను. ఆయన కేన్సర్‌తో మరణించారు. చంద్రకి దైద శివాలయం వద్ద వినిపిస్తుండే వాణ్ణి. అలా దశాబ్దం కిందటే ప్రారంభమైనా ఆయన మరణానంతరం యీ గ్రంథ రచన చాలాకాలం నిలిచిపోయింది.

మిత్రులు నా గ్రహాంతరవాసి నవలని ఆంగ్లంలోకి అనువదించిన ప్రొఫెసర్ సుబ్బరాయుడు గారితో కలిసి సహృదయులు పండితులు రచయిత కుప్పా శ్రీనివాస శాస్త్రిగారిని ఒక శుభ ముహూర్తంలో కలిశాను. శాస్త్రిగారు నా లాస్ట్ బ్రాహ్మిణ్ గ్రంథం ప్రసక్తి తెచ్చారు. ఉషారాణిగారు లాస్ట్ బ్రాహ్మిణ్ లో ప్రస్తావించినట్లుగానే తమ వైదిక కుటుంబాలలో గుడికి ప్రాధాన్యం లేదని స్పష్టం చేశారు. అదే సందర్భంలో నేను బ్రహ్మశ్రీ కుప్పా శ్రీనివాస శాస్త్రి గారితో 'సనాతనం' గ్రంథం గురించి ప్రస్తావించాను.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఇటీవల గాందేయవాది, మేధావి అవధానం రఘుకుమార్ ఏర్పాటుచేసిన జూమ్ మీటింగ్‌లో నేను ప్రసంగించాను. మళ్ళీ శాస్త్రిగారు ఆ మీటింగ్ లోనే 'సనాతనం' గ్రంథం పూర్తి చేశారా అని నిలదీశారు. దాంతో మళ్ళీ నాకు ఉత్సాహం పెల్లుబికింది.

గ్రంథ రచన ప్రారంభం తర్వాత యిప్పటికీ చాలా సంవత్సరాలు గడిచాయి. నా శైలి కూడా మారింది. మొదట్లో ప్రాచీన సనాతన గ్రంథాల నుంచి ఉటంకింపులు

కనబడ్తాయి. కానీ ఇటీవల నేను పూర్తిచేసిన మిగిలిన గ్రంథంలో సుదీర్ఘమైన ఉటంకింపులు తక్కువ. కారణం గ్రంథాల ప్రాసంగికత తగ్గిపోయిందని నేను గ్రహించాను. ప్రవచనకారులు సనాతన గ్రంథాల సారాన్ని పిప్పి చేశారు. వట్టి ఎంటర్‌టైన్‌మెంటుగా మార్చారు. వాటిని ఉత్తేజకరమైన మత్తుమందులుగా మార్చివేశారు. ఆ శూన్యంలోకి హిందుత్వ ప్రవేశించి ఆక్రమించుకొంది.

ఈరోజు మా కాలేజీ విద్యార్థి కరీంనాతో అన్నాడు "గురువుగారూ మీరు ప్రశ్నలు వెయ్యడం, మేము సమాధానం రాయడం ఎందుకు? మీరు సమాధానాలు చెప్పండి. మేము ప్రశ్నలు వేస్తాం".

మనం సమాధానాలు, పరిష్కారాలు, మోక్ష మార్గాలూ, విముక్తిదాయక సిద్ధాంతాలూ ముందే సిద్ధం చేసుకుని, ప్రశ్నల్ని ప్రోత్సహిస్తున్నట్టు నటిస్తున్నాం. దాని అర్థం ఏమిటంటే ప్రశ్నకి సిలబస్ సిద్ధంచేసి, ఆ సిలబస్ కి అనుగుణమైన ప్రశ్నల్ని ప్రోత్సహిస్తున్నాం. దీనినే ఆధునికతలో ప్రశ్నకి ప్రాధాన్యం పెరగడంగా బుకాయిస్తున్నాం.

ఇప్పుడు మనం చేయాల్సింది ప్రశ్నని ప్రశ్నీకరించడం.

నా పుస్తకాన్ని మీరు సనాతనం అంటే ఏమిటి? అనే ప్రశ్నతో చదువుతారని నాకు తెలుసు. మీరు సమాధానాల కోసం చదువుతారు. దీనిని కూడా మరో ప్రవచనంగా భ్రమపడ్తున్నారా? సనాతనానికి సంబంధించిన సిలబస్ దొరుకుతుందని చదువుతున్నారా?

ఐతే మిమ్మల్ని నిరుత్సాహ పరచడానికే నేనీ పుస్తకం రాశాను. మీ ఆశలు అన్నిటినీ భంగపరచడానికే నేనీ గ్రంథం రాశాను. ఎందుకంటే గొప్ప భంగపాటు నుంచే మీలో అన్వేషణ మొదలవుతుంది. అప్పుడు బయట మార్కెట్లో ప్రోగ్రెసివ్ మార్కెట్లో స్పిరిచ్యువల్ మార్కెట్లో.. సమాధానాల పరిష్కారాల వెతుకులాట ముగిస్తారు. మందుల మార్కెట్ రోగాలని పెంచుతున్నట్లుగా, సమాధానాలు ప్రశ్నల్ని చంపేస్తాయి. మీరు సమాధానాల కోసం ప్రత్యామ్నాయాల కోసం పరిష్కారాల కోసం వెతుకులాటని ముగించినపుడు మీలో నిజమైన ప్రశ్న ఉదయిస్తుంది. అదే సనాతనం.

◆ ◆ ◆